ఎఎంఆర్ అపార్డ్
AMR-APARD

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 5 సంచిక: 9

అక్టోబర్, 2013

ఎడిటర్
**శశిభూషణ్ కుమార్** ఐ.ఏ.ఎస్.
కమీషనర్, అపార్డ్

ఎడిటోరియల్ బోర్డు
**డా॥ సి. నాగరాజు**
**హెచ్. కూర్మారావు**
**ఎ. సుభాష్‌చంద్ర గౌడ్**
**డా॥ కె. ఆసయ్య**
**ఎ. నాగేశ్వరరావు**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
**సెంటర్ ఫర్ మీడియా & పబ్లికేషన్స్, అపార్డ్**
**& కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. - అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : editorsthanikapalana@gmail.com
Website: www.apard.gov.in

ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి గాని అపార్డ్‌కి గాని చెందినవిగా భావించనక్కరలేదు.

# విషయ సూచిక

సంపాదకీయం ..... 2
మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం అమలుపై గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు శ్రీ డి.మాణిక్యవరప్రసాద్ ..... 3
సర్పంచి పదవి ఎంతో హుందా కలిగినది ..... 4
త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్య సౌకర్యాలను మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టాలి ..... 5
ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పనులను మరింత పటిష్ఠవంతంగా అమలు చేయాలి.... ..... 6
అపార్డ్ అధికారుల బాకారం సందర్శన ..... 7
గ్రామీణాభివృద్ధి వివిధ అంశాలు ..... 7
ఒరిస్సా గ్రామీణాభివృద్ధి అధికారులు అపార్డ్ సందర్శన ..... 8
సత్య, సాహిత్య అన్వేషి అరవిందులు ..... 9
భారత దేశంలో జనగణన విధానము అవగాహన ..... 11
150 సేవల విస్తరణతో 'మీ సేవ' ..... 13
సారపు ధర్మమున్ విమల సత్యము..... ..... 14
వాతావరణ మార్పులతో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం ..... 15
పథకానికి పది ప్రశ్నలు - రాజీవ్ గాంధీ కౌమార బాలికల సాధికారత పథకం - సబల ..... 17
బిఎన్‌విల సేవాతత్పరతకు నిలువెత్తు నిదర్శనం ఈ గ్రంథాలయం ..... 19
బిందు సేద్యం - ఉపయోగాలు, పద్ధతులు ..... 20
ఆహారంలో కల్తీ - ఆరోగ్యంపై ప్రభావం... తీసుకోవలసిన జాగ్రత్తలు ..... 21
బంజరు భూములను సస్యశ్యామలం చేసే ఎత్తి పోతల పథకాలు ..... 25
మనం - మన పర్యావరణం - వాస్తవాలు ..... 26
ప్రపంచం మరువలేని మేడమ్ క్యూరీ ..... 28
బిఎన్‌విగా మారిన ఎంపిడివో ..... 31
బారత్ నిర్మాణ్ వాలంటీర్ల అపూర్వ విజయాలు ..... 32
కూలీ కుటుంబాలు రైతుకుటుంబాలుగా ..... 34
గ్రామీణ మహిళలు చేపట్టదగిన ఆహార, కుటీర పరిశ్రమలు ..... 36
విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగంపై పెరుగుతున్న అవగాహన ..... 39
మెల్లగా పుంజుకుంటున్న జీరో టిల్లేజ్ సేద్య విధానం ..... 41
చిన్నరేవల్లి గ్రామంలో స్వయం సహాయక సంఘాలు ..... 42
సులబ్ జనకుడు - బిందేశ్వర్ పాఠక్ ..... 43
మనకేం తెలుసు ? ..... 44
చిత్తూరు జిల్లా, కలకడ మండలంలో సాక్షర భారత్ ..... 45
మహిళా ప్రజాప్రతినిదుల్లో చైతన్యం రావాలి ! ..... 47
భరోసా ! ..... 48
విశిష్ట వ్యక్తులు - కొన్ని ఉదాత్త ఘట్టాలు ..... 52
విశాఖలో గ్రామీణ మహిళా వికాసం ..... 54
గ్రామాభివృద్ధికి సోపానం గాంధీజీ మార్గం ..... 57
దేశంలో ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. పథకం అమలు తీరు ..... 58
గ్రామ స్వరాజ్యానికి గ్రామ పంచాయితీలు ..... 60
అసలు సిసలైన పంచాయితీ - పున్నారి! ..... 62
ఐక్యరాజ్య సమితి మహిళల గ్రామసభలతో వెల్లివిరిసిన చైతన్యం - సామాజిక దురాచారలపై మహిళల సమరశంఖం ..... 63

సంపాదకీయం...

# బాపూజీ బాటలో భారత్

భూమి మనిషికి భరోసానిస్తుంది. భూమిపై సొంత హక్కును కలిగి ఉంటే తనకు తాను నమ్మకంతో జీవితాన్ని కొనసాగిస్తాడు. అందుకే ఏ దేశంలోనైనా భూ సంస్కరణల వలన ఉత్పత్తి పెరగడమే గాక ఆ సమాజంలో స్థిరీకరణ జరుగుతుంది. అందుకే ప్రపంచంలోని దేశాలు భూ సంస్కరణలను అమలు జరిపి అభివృద్ధిని పొందాయి. తూర్పు, దక్షిణ ఆసియా దేశాలు భూసంస్కరణలను అమలు జరిపి అభివృద్ధిని సాధించాయి. వాటిలో చైనా, జపాన్, తైవాన్, దక్షిణకొరియాలను చెప్పుకొనవచ్చును. భారతదేశంలో కూడ సమాజంలో స్థిరీకరణను పెంపొందించేందుకు భూ సంస్కరణలను తీసుకురావడం జరిగింది. 1972లోనే భారత ప్రభుత్వం భూ సంస్కరణలను ప్రవేశ పెట్టింది. అంటే మహాత్మాగాంధీ కన్న కలలను నేరవేర్చేందుకు పూనుకొన్నది.

కేంద్రప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖవారు తెలిపిన వివరాల ప్రకారం దేశంలో 73 లక్షల ఎకరాలు భూమిని సేకరించింది. 48 లక్షల ఎకరాలు భూమి లేని పేదలకు పంచారు. ఆంధ్రప్రదేశ్ ఇంతవరకు మిగులు భూమిని 8 లక్ష 90 వేల 492 ఎకరాల మేరకు సేకరించింది. అందులో దాదాపు 5 లక్షల 30 వేల 575 ఎకరాలను పేదలకు పంచడం జరిగింది. ఈ నేపథ్యంలో భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగామిగా నిలిచింది. మిగులు భూమిని పంపిణీ చేయడమే కాదు. ఆ భూమిని సాగు చేసుకొనుటకు తగిన ఋణ సదుపాయాన్ని కూడా కలుగజేసింది. బ్యాంకుల నుండి తగు సహాయం ఇప్పించి పేదలు పొందిన భూమిని సాగు చేసుకొనుటకు సహాయం చేసింది. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ మంత్రి చేసిన ప్రకటన ప్రకారం రెవెన్యూ సదస్సులను నిర్వహించి గత సంవత్సరంలో పేదలకు లక్షా ముప్పది వేల ఎకరాలను భూమి లేని పేదలకు పంపిణీ చేయడం జరిగింది. అంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంను అమలు చేయుటలో దేశంలోనే ముందంజలో ఉండటమే కాక భూపంపిణిలో కూడ అదే రీతిలో దేశంలోనే అగ్రగామిగా పేరు తెచ్చుకోవడం ముదావహమైన విషయం. అదే రీతిలో భూ పంపిణీ జరిగిన తరువాత కూడ పేదలకు చెందిన భూమి ఆక్రమిత దారుల నుండి పంపిణీ దారులకు చెందే విధంగా చర్యలు తీసుకొని పేదవారికి చెందులాగున చేయడం జరిగింది. మన రాష్ట్రం భూమి లెక్కలను కూడ సేకరించి వాటిని కంప్యూటరీకరించడం జరిగింది. దీనివలన భూమి స్వంత దారునికి కావలసిన వివరాలు అందజేయటం చాలా సులభమవుతుంది. భూ పంపిణీ ద్వారా భూమి లేని పేదలు ఇతర ప్రాంతాలకు తరలి పోకుండా ఆ పగలుగుతున్నారు అంటే ఆయా గ్రామాల ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలి పోకుండా ప్రభుత్వం బ్రతుకు భరోసాను కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుందని చెప్పవచ్చును. ఆ విధంగా మహాత్మాగాంధీ చెప్పిన విషయాలను పాటించి ప్రజల జీవితాలకు స్థిరీకరణ కలిగించెందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలను, అభివృద్ది పనులను అమలు చేస్తుంది. ఇటీ వలనే గ్రామ పంచాయతీలకు ఎన్నికలను జరిపింది. దానితో గ్రామాలలో అభివృద్ధి పనులను చేపట్టి అమలు చేయుటకు పంచాయితీరాజ్ వ్యవస్థ పనిచేయగలదు. అందుకు కావలసిన అవకాశాలను, కొంతమేరకు వనరులు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కల్పించుతుంది.

అదేవిధంగా భారత్‌నిర్మాణ్‌లో భాగంగా బిఎన్‌వి గ్రామాలలో స్వచ్ఛందంగా పనులు చేయుటకు ప్రజలకు సహకరించేందుకు పని చేస్తున్నారు. బీద ప్రజల అవసరాలలో సహాయ సహకారాలను అందించేందుకు బిఎన్‌విలు గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్నారు. మన రాష్ట్రంలో బిఎన్‌విలు సుమారుగా 43,000 మంది ఉన్నారు వీరు గ్రామ ప్రజల జీవితావసరాలలో చేయూతనందించి గ్రామీణ జీవితంను మెరుగుపడులాగున కృషి సల్పుతూ గ్రామ ప్రజలకు మరింత చేయూత నిస్తూ ముందుకు వెళుతున్నారు. ఆ విధంగా రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు భూమి సాగుకు కావలసిన వాటర్ షెడ్స్ ద్వారా నీటిని పొందుటకు వాటర్‌షెడ్ కార్యక్రమాలను కూడ అమలు చేస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేయుచున్నారు. ఈ గ్రామాభివృద్ధికి సహాయపడుటంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తుందని చెప్పవచ్చును.

ఈ విధంగా మహాత్మాగాంధీ ఆశించిన రీతిలో భారత ప్రభుత్వం పేదలకు భూమి పై హక్కులను కలిగిస్తూ, క్రమబద్ధీకరణ చేస్తూ సెప్టెంబర్ 2013న ఒక చట్టంను పార్లమెంటు ఆమోదించింది. ఈ చట్టంను అమలు చేయుటకు రాష్ట్రాలు ముందుకు వస్తే మరింత అభివృద్ధి సాధించవచ్చు. ఈ చట్టంవలన రైతుల నుండి భూమి బలవంతంగా సేకరించకూడదు. సేకరించిన పూర్తిగా భూమి విలువ రైతులకు చెల్లించవలసి ఉంటుంది.

( శశి భూషణ్ కుమార్ )



# మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం అమలుపై గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు శ్రీ డి.మాణిక్యవరప్రసాద్

**ఎం.జి.ఎన్.ఆర్ ఇ.జి.ఎస్. పథకంలో నేను ఒక కూలీనే అని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డి. మాణిక్యవరప్రసాద్ అన్నారు. ఆయన అక్టోబర్ 2న పత్రికల వారితో మాట్లాడుతూ ఈ శాఖలో ఫైళ్ళు ఏమి ఉండవు... అంతా ఆన్‌లైన్‌లోనే ఉంటాయి కనుక ఎంతో పారదర్శకంగా ఈ పథకంను అమలు చేయటం జరుగుతుందని అన్నారు. దేశానికి ఆదర్శప్రాయమైన ఉపాధిహామీ పథకం ద్వారా 1.9 కోట్ల మందికి ఉపాధి కల్పించామని ఇందుకు గాను 3,295 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు వివరించారు.**

ఉపాధి పథకం వలన ఆంధ్రప్రదేశ్‌లో 25వేల మంది కూలీలు రైతులుగా మారారని, పథకం అమలై 8 సంవత్సరంలో వెళుతున్నదని, ఇప్పటివరకు 209 కోట్ల పనిదినాలు కల్పించగా పథకంపై 27,803 కోట్ల రూపాయలు వివిధ పనులకు కూలీలకు ఖర్చు చేసినట్లు ప్రసాద్ వివరించారు. ఇందిరజలప్రభ ద్వారా నీటి వసతి కల్పించి 3 లక్షల ఎకరాల బీడు భూమిని సాగులోకి తెచ్చామన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలను నిరోధించి 23 కోట్ల రాబట్టగలిగామని చెప్పారు. అదే రీతిలో అక్రమాలకు పాల్పడిన ఆరోపణపై 76 మంది మీద కేసులు పెట్టినట్లు మంత్రి మాణిక్యవరప్రసాద్ వివరించారు.

పథకంలో సామాజిక తనిఖీ ద్వారా అవినీతి తగ్గిందని చెప్పారు. ఈ సమావేశంలో పంచాయితీ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ వి.నాగిరెడ్డి, గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ శ్రీ శశిభూషణ్ కుమార్‌లు కూడ పాల్గొన్నారు.




# సర్పంచి పదవి ఎంతో హుందా కలిగినది

**గ్రామ పాలనలో సర్పంచ్ పదవికి చాల హూందాతనం ఉందని. ఏ పథకమైన ప్రజలకు చేరేలా చేసే అవకాశము ఉన్న వారిలో సర్పంచులు ప్రధానమైన వారని, వారికి 73 వ రాజ్యాంగ సవరణలో విశిష్టస్థానముందని కేంద్ర సాధికారికత రాజ్య మంత్రి శ్రీ పి. బలరామ్ నాయక్ అన్నారు. ఆయన ఖమ్మం జిల్లాలోని పలు సర్పంచుల శిక్షణా సమావేశంలో పాల్గొని ముఖ్యోపన్యాసంచేశారు. ఖమ్మంలో సెప్టెంబర్ 16-18 వరకు 2013 8 మండలాలకు చెందిన సర్పంచులు శిక్షణలో పాల్గొన్నారు ఇది మంచి అవకాశమని, అవగాహనతో సర్పంచులు తమ విధులను నిర్వహించుతూ బాధ్యతగా వ్యవహారించాలని సూచించారు.**

రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి శ్రీరాం రెడ్డి మాట్లాడుతూ సర్పంచులు తమతమ రాజకీయభావాలను పక్కనపెట్టి గ్రామాభివృద్ధికి అందరిని కలుపుకొని కృషి చేయాలని అన్నారు. గ్రామాలలో బలహీన వర్గాలను దృష్టిలో ఉంచుకొని వారి సమస్యల పరిష్కారానికి పనిచేయాలని సూచించారు. రాష్ట్ర శాసన సభ ఉప సభాపతి శ్రీ మల్లుభట్టి విక్రమార్క మాట్లాడుతూ, 73వ రాజ్యాంగ సవరణనందు గల 23 అంశాల దృష్టిలో ఉంచుకొని వాటి గురించి కృషి చేయాలన్నారు. దేశంలో వచ్చిన మార్పులను దృష్టిలో పెట్టుకొని అందుకు అణుగుణంగా గ్రామాభివృద్ధికి పాటు పడవలెనని పిలుపునిచ్చారు. ఈ శిక్షణలో మొదటి విడతగా 8 మండలాల్లోని గ్రామ సర్పంచులు పాల్గొన్నారు. ■

# త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్య సౌకర్యాలను మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టాలి

**నేటి గ్రామాలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు త్రాగునీరు, పారిశుద్ధ్య అవసరాలను తీర్చేందుకు తగిన చర్యలు చేపట్టవలసిన అవసరం ఉందని ఎఎంఆర్-అపార్డ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సి.నాగరాజు అన్నారు. ఆయన సెప్టెంబర్ 26న అపార్డ్‌లో త్రాగునీటి పథకాల నిర్వహణా శిక్షణ గురించి జరిగిన ఒక రోజు వర్క్‌షాపును ప్రారంభించి ప్రసంగించారు.**

గ్రామాలలో పారిశుద్ధ్యానికి, త్రాగునీటికి ప్రాధాన్యతనిస్తూ మిలీనియం అభివృద్ధి లక్ష్యాలను నెరవేర్చే విధంగా పనిచేయవలసిన వారి శిక్షణకు తగినవిధంగా మాడ్యుల్సు తయారు చేసి తద్వారా పంచాయితీరాజ్ వ్యవస్థల సమన్వంతో నీటి పథకాల మెరుగైన నిర్వహణకు దోహదం చేయాలని పిలుపిచ్చారు.

ఈ సమావేశంలో ప్రాజెక్టు డైరెక్టర్ కమ్యూనిటీ కెపాసిటి డెవలప్‌మెంట్ యూనిట్ శ్రీ సి. రవిబాబు మాట్లాడుతూ, ప్రాంతాల వారీగా గ్రామాల త్రాగునీటి అవసరాలను తీర్చుతూ 12వ ప్రణాళికలలో నిర్ధేశించిన సూత్రాలకు అనుగుణంగా టార్గెట్స్‌ను తయారుచేసి అమలు చేసేందుకు చర్యలు తీసుకొనవలసి ఉందని, అందుకు తగిన మాడ్యూల్సు తయారు చేసి ఆదేశాలు పంపించాలని అన్నారు. గ్రామ జనాభాను బట్టి త్రాగునీటి అవసరాలను తీర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ఎప్పటికప్పుడు పంచాయతీ సర్పంచులతో సమావేశమై, వారి అవసరాలకు తీసుకొన్న చర్యలను బట్టి వాటిని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ప్రాజెక్టులు అమలులో శ్రద్ధ వహించి జి.పి. నిర్ణయాలను అమలు చేయాలని మానిటరింగ్ చేయాలని చూచించారు.

రాష్ట్ర నీరు పారిశుద్ధ్య మిషన్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీరాములు నాయక్ మాట్లాడుతూ, గ్రామ పారిశుద్ధ్యపు అవసరాలకు తగిన స్కీంలకు అనుగుణంగా పనిచేయటానికి పనివారిని సమాయత్తం చేయవలసి ఉందన్నారు. గ్రామ ఆరోగ్య, పారిశుద్ధ్యపు కమిటీలను ఏర్పాటు చేసి అవసరాలను తీర్చేందుకు సమాయవత్తమవ్వాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో సెంటర్‌హెడ్ సిడబ్ల్యుఎస్ శ్రీ ఎ. నాగేశ్వరరావు స్వాగతోపన్యాసం చేస్తూ వర్క్‌షాప్ ఉద్దేశాలను వాటి పూర్వ రంగాన్ని వివరించారు. సి.డబ్ల్యుఎస్ ఫ్యాకల్టీ సభ్యులు శ్రీమతి పి. మాధురి వర్క్‌షాపు డైరెక్టరుగా వ్యవహరించారు.

ఈ వర్క్‌షాప్‌లో త్రాగునీరు, పారిశుద్ధ్యపు ఇంజనీర్లు 30 మంది పాల్గొన్నారు.

*- సి.ఎం.పి, అపార్డ్*






Sthanika_Color_Oct13.indd 20 17/10/13 5:27 PM



# ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పనులను మరింత పటిష్ఠవంతంగా అమలు చేయాలి...

**మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మరింత ఉపయోగకరమైనదిగా తీర్చిదిద్ది, ప్రయోజనకారియైన సామాజిక అసెట్స్‌ను నిర్మించాల్సిన అవసరం ఉందని గ్రామీణాభివృద్ధి శాఖా కమీషనర్ శ్రీ శశిభూషణ్ కుమార్ ఐఏఎస్ అన్నారు. ఆయన సెప్టెంబర్, 28న ఎఏంఆర్ అపార్డ్‌లో జరుగుతున్న ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకం అమలు చేస్తున్న అధికారులు ఎపిఓలు, ఫీల్డు అసిస్టెంట్స్‌ల ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.**

ఎం.జి.ఎన్.ఆర్.జి.ఎస్ కార్యక్రమాల అమలులో తీసుకొనవలసిన చర్యలు, వాటిలో ఉన్న మినహాయింపులను గూర్చి అమలు చేసే అధికారులకు వివరించారు.

సోషల్ ఆడిట్, ఇంజనీరింగ్ పనులను సమన్వయంతో చేస్తూ 100 రోజుల పనిని అడిగిన వారికి ఇవ్వవలసి ఉందని ఆయన సూచించారు. ప్రస్తుతం సుమారు 900 గ్రామాలలో పనులు చేయవలసి ఉందన్నారు.

గ్రామ పంచాయతీలలో గ్రామసభను సమావేశపరచి తగిన సమన్వయంతో పనులు చేయవలసి ఉందని శ్రీ శశిభూషణ్ కుమార్ ఆదేశించారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం అమలు అధికారులు పంచాయతీ అధికారులతో సమన్వయంగా పనిచేయాలని కోరారు.

ఉపాధిహామీ పథకంలో ఉన్న వివిధ క్షేత్రస్థాయి విషయాలను గూర్చి ప్రతి స్పందనలు, ప్రశ్నలు సేకరించి తగిన సమాధానాలు చెప్పారు.

ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి వచ్చిన 120 మంది పైగా ఎపిఓలు, ఫీల్డు అసిస్టెంట్లు, సోషల్ ఆడిట్స్ అధికారులు తమ తమ పని తీర్లను సమీక్షించుకోవటానికి మంచి అవకాశం ఈ శిక్షణ ఇచ్చిందని తెలిపారు.

వీరికి కమీషనర్ శశిభూషణ్ వివరించి సమాధానాలు ఇచ్చారు. ఈ శిక్షణలో ఉపాధి హామీ పథకంలో గల కొన్ని విషయాలను సరిచేయటానికి వీలు కలిగింది.

*- సి.ఎం.పి, అపార్డ్*



Sthanika_Color_Oct13.indd 21 17/10/13 5:27 PM

# అపార్డ్ అధికారుల బాకారం సందర్శన



**భారత్ నిర్మాణ్ వాలంటీర్ల పనితీరును పరిశీలించేందుకు, రివ్యూలు చేసి తగిన సూచనలను సలహాలు ఇచ్చేందుకు అపార్డ్ అధికారులు సెప్టెంబర్ 16, 2013 న బాకారం గ్రామాన్ని సందర్శించారు.**

భారత్‌నిర్మాణ్ వాలంటీర్లు గ్రామాలలో ఐచ్ఛికంగా పనిచేస్తూ గ్రామాలలోనున్న సమస్యల పరిష్కారం అధికారులతో కలిసి తగిన చర్యలు తీసుకొని గ్రామ ప్రజలకు చేదోడువాదోడుగా ఉండడం జరుగుతుంది. బిఎన్‌విలు గ్రామంలో జరుగుతున్న విషయాలను స్వయంగా చూసి తెలుసుకోవడం జరిగింది.

అటు కేంద్రం ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న దాదాపు 40-50 వరకు వివిధ పథకాలను గూర్చి అవగాహన పెంచే ప్రయత్నంలో భాగంగా బాకారం గ్రామాన్ని పరిశీలనార్థం ఎంపిక చేసికొని ఒక ప్రాజెక్టును చేపట్టటం జరిగింది. అందులో ముఖ్యంగా ఆరోగ్యం, పరిరక్షణ, త్రాగునీటి వసతులను కల్పించటం, ప్రజాపంపిణిని గురించి తెలుసుకొని గ్రామస్తులతో చర్చించడం కూడా జరిగింది.

ఈ కార్యక్రమంలో అపార్డ్ సి.డి.ఎస్ డైరెక్టర్ జనరల్ శ్రీ కె. చంద్రమౌళి ఐ.ఏ.ఎస్. కుమారి దివ్య ఐ.ఎ.ఎస్. తో పాటు, అపార్డ్ జాయింట్ డైరెక్టర్ డా॥ నాగరాజు, శ్రీ కూర్మారావు, సెంటర్ హెడ్ సి.ఎస్. ఆర్.ఎం, సిడిపిఎ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ ఆర్. సూర్యనారాయణ రెడ్డి, ఇతర అపార్డ్ అధికారులు పాల్గొన్నారు.

*- సి.ఎం.పి*

# గ్రామీణాభివృద్ధి - వివిధ అంశాలు

**ఎ.ఎం.ఆర్-అపార్డ్‌లో గ్రామీణాభివృద్ధిపై ఫొటో ప్రదర్శనను సెప్టెంబర్ 28న నిర్వహించడం జరిగింది. ఈ ఫొటో ప్రదర్శనను అపార్డ్ జాయింట్ డైరెక్టర్ (పాలన) డాక్టర్ సి. నాగరాజు సమక్షంలో ఎన్.ఐ.ఆర్.డి. డైరెక్టర్ జనరల్ డా॥ ఎం.వి. రావు, ఐ.ఎ.ఎస్ ప్రారంభించారు.**

ఫొటో ప్రదర్శన వలన ఎన్నో విషయాలను తెలియజేయడం, అంతేగాక ఒక ఫొటో ఫ్రేమ్ ఎన్నో వ్రాత పేజీలకు సమానం అన్నారు. భారతదేశం లాంటి అక్షరాస్యత తక్కువగా వున్న దేశాలలో ఫొటో ప్రదర్శనకు ఎంతో ప్రాముఖ్యత ఉందని డా॥ ఎం.వి.రావ్ అన్నారు.

ఫొటో జర్నలిజం ఉన్నతమైన అంశమని ఫొటో వలన సామాన్యునికి కూడా విషయాంశాలను ఎంతో క్షుణ్ణంగా వివరించ వచ్చని, వారు అవగాహన చేసుకొనేందుకు వీలుంటుంది. ఒక ఫొటో వేయి మాటలతో సమానం. దృశ్యాలు కఠిన హృదయాలను కూడా కరిగిస్తాయి.

ఫొటో ప్రదర్శనలో గ్రామీణాభివృద్ధిలో ఎన్నో అంశాలను గూర్చి వివరించడం జరిగింది. గ్రామాలలో జీవన విధానం, పొగపొయ్యిల ఉపయోగం, త్రాగునీటి విషయంలో జాగ్రత్తలు, నీటి ఊటల నుండి నీటిని సేకరించి త్రాగేందుకు ఉపయోగించడం తదితర ఎన్నో విషయాలగురించి ఫొటోలు ప్రదర్శించడం జరిగింది.



**ఎ.ఎం.ఆర్. - అపార్డ్‌లో ఫొటో ప్రదర్శన**

గ్రామీణులు నీటిని సేకరించేందుకు ఎంత ప్రయాస పడతారో చూపబడింది. గ్రామాలలో వంటకు ఉపయోగించే కట్టెల సేకరణ, గ్రామీణుల ఉత్పత్తులను మార్కెట్టు చేయడం తదితర అంశాలను ఎన్నిటినో ప్రదర్శించడం జరిగింది.

మహిళా సంఘాలు పని చేసేతీరు, గ్రామీణ ఉత్పత్తులు, పాల ఉత్పత్తి, పంపిణీ, వినియోగం తదితర అంశాలను కూడా ప్రదర్శించారు.

గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న పలుకార్యక్రమాలు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకం అమలు తీరు (MGNREGS), మహిళాభివృద్ధి, శిశు సంరక్షణ, పారిశుద్ధ్యం, మరుగు దొడ్ల ఉపయోగం తదితర ఎన్నో అంశాలను ఫొటో ప్రదర్శనలో ఉంచారు. ఈ ఫొటో ప్రదర్శనను జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ సమన్వయంతో ఏర్పాటు చేశారు.

*- సి.ఎం.పి*



Sthanika_Color_Oct13.indd 22 17/10/13 5:27 PM




# ఒరిస్సా గ్రామీణాభివృద్ధి అధికారులు అపార్డ్ సందర్శన

**ఒరిస్సా గ్రామీణాభివృద్ధి అధికారులు ఎ.ఎం.ఆర్ అపార్డ్‌ను ఇటీవల సందర్శించారు. ఈ సందర్భంగా అపార్డ్‌లో జరుగుతున్న వివిధ శిక్షణ, పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను గూర్చి సెంటర్ ఫర్ వికేంద్రీకరణ అండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రొఫెసర్ ఆర్. సూర్యనారాయణ రెడ్డి వారికి వివరించారు. అపార్డ్‌లో క్రింది స్థాయి నుండి రెవెన్యూ డివిజనల్ స్థాయి అధికారులు వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వారికి కావలసిన వసతి సౌకర్యాలు ఒకే సారి ఒక వేయి మందికి రెసిడెన్షియల్ శిక్షణా సదుపాయాలను కలిగి ఉన్నదని వివరించారు. పంచాయితీ సర్పంచుల నుండి జిల్లా పరిషత్ అధ్యక్షులకు కూడ శిక్షణనిచ్చి దేశంలోనే నెంబర్ వన్ గ్రామీణాభివృద్ధి శిక్షణా సంస్థగా పేరు పొందిందన్నారు.**

అపార్డ్ నందు ఆధునిక టెక్నాలజీ సదుపాయాలతో కూడిన వీడియో కాన్ఫెరెన్స్ సౌకర్యాలతో రాష్ట్రంలోని మరో ఐదు కేంద్రాల వారికి ఒకే సారి శిక్షణనిచ్చే సదుపాయాలను కలిగి ఉందని వివరించారు. అపార్డ్ మీడియా సెంటర్ నందు స్థానికపాలన జర్నల్‌తో పాటు, డాక్యుమెంటరీలు, చిత్రాలు, లఘుచిత్రాలను, తీయు సదుపాయం, ఇన్ - హౌస్ ప్రొడక్షన్ ఎడిటింగ్, కాపీయింగ్ సదుపాయలను కలిగి ఉందన్నారు. ఒడిస్సాలో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నూతన స్టూడియోలను నిర్మాణం కొరకు సర్వేలు నిర్వహిస్తున్నట్లు శ్రీ పినాకినీ మహంతీ, ఒరిస్సా రాష్ట్ర ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, లలితేందు మహంతీ, ప్రొక్యూర్ మెంట్ అధికారులు వివరించారు. ఆంధ్రప్రదేశ్ లో నూతన సాంకేతిక పరిజ్ఞానం, ఉపయోగం ఎంతో విస్తరించిందని, దానిని అనుసరించి తమ రాష్ట్రంలో కూడ గ్రామీణాభివృద్ధి పథకాలలో టెక్నాలజీని అభివృద్ధి చేయనున్నట్లు పినాకినీ మహంతీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్స్, వివిధ శాఖల వారు పాల్గొని వారికి అపార్డ్ కార్యక్రమాలను వివరించారు.

**సి.ఎం.పి.**

అరవిందఘోష్ 1872 వ సంవత్సరం ఆగస్టు 15 న శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన డా॥ కృష్ణాధన్‌ఘోష్, స్వర్ణలతా దేవి దంపతులకు బెంగాల్ రాష్ట్రంలో జన్మించారు. 1872 - 79 వరకు అరవిందుని తండ్రి వైద్యవృత్తిలో తూర్పు బెంగాల్‌లో గల ఖుల్నాలో జిల్లా వైద్య శాఖాధికారిగా పని చేయడంతో ఆయన బాల్యం అక్కడే గడిచింది. 1877-79 మధ్యకాలంలో ఆయన లొరెట్టో కాన్వెంటు స్కూలులో డార్జిలింగ్‌లో విద్యాభ్యాసం ప్రారంభించారు. తరువాత ఘోష్ 1879 నుంచి 1884 వరకూ తన చదువు నిమిత్తం ఇంగ్లాండు పోవలసి వచ్చింది.



# సత్య, సాహిత్య అన్వేషి అరవిందులు

అక్కడే వున్న డ్రూవెట్ కుటుంబ సంరక్షణలో విద్య కొనసాగించారు. 1884-90 లలో సెయింట్ పాల్స్ స్కూలులో, 1890-92 సంవత్సరాలలో కేంబ్రిడ్జిలోని కింగ్స్ కాలేజీలో అరవిందులు చదువు పూర్తి చేశారు. అక్కడ ఉన్న భారతీయ విద్యార్థి బృందం ఇండియన్ మజ్లిస్‌కు ఆయన తన ప్రసంగాల ద్వారా భారత స్వాతంత్ర్య అవసరాన్ని ఉద్బోధించి చైతన్య పరిచారు.

కేంబ్రిడ్జ్‌లో విద్యార్థి దశ నుండే అరవిందుడు కవిత్వ రచన చేస్తూ, ఇతరత్రా సాహిత్య కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన సాగారు. రాష్ట్రీయ శక్తిని, ఆధ్యాత్మిక శక్తిని జోడించి భారత దేశ భవిష్యత్తుకు బంగరు బాటను ఏర్పరిచిన నిస్వార్థ జీవి అరవింద ఘోష్. ఆయన ఒకసారి కలలో ఒక తమస్సు (చీకటి) తనను ఆవహించినట్లు, ఇంగ్లాండు వెళ్లినప్పుడు ఆ అంధకారం పూర్తిగా తనలో నిండిపోయినట్లు గమనించగలిగారు.

ఆయన భారత్‌కి తిరిగి రావడంతో ఆ చీకటి తొలగిపోయినట్లు పేర్కొనడం విశేషం. ఇక్కడ మనం గమనించాల్సిన సత్యం ఒక్కటే! తాను గడిపిన విదేశీ జీవితమంతా ఆయన స్మృతి పథంలో ఒక అంధకార బంధురమైనదిగా మారిపోవడం. 1893 ఫిబ్రవరి నెలలో అరవిందులు భారత భూభాగంలో తిరిగి అడుగు పెట్టారు. బొంబాయి, పోర్‌బందర్‌లలో అడుగు పెట్టిన అరవిందుడు కొద్ది మాసాలపాటు ఖాళీగా కాలం గడిపారు.

బరోడా మహారాజు దగ్గర సేవలు అందిస్తూ ఉపాధి చూసుకోవడం ముగిసాక, అదే చోట ఆయన ఇంగ్లీషు, ఫ్రెంచి భాషలలో ప్రొఫెసర్‌గా పని చేస్తూ, క్రమేపీ ఆ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. 1893 ఆగస్టు 7 వ తారీఖు నుంచి బాంబే నుండి వెలువడే హిందు ప్రకాష్‌లో 'న్యూల్యాంప్స్ ఫర్ ఓల్డ్' శీర్షిక ద్వారా ఆయన రాజకీయమైన రచనలు ప్రారంభించారు.

మహా రచయితగా అరవిందునికి గుర్తింపు తెచ్చిన 'సావిత్రి'ని ఆయన 1898 - 99లలో రాయడం జరిగింది. 1900-1902 మధ్య కాలంలో అరవిందులు తన రాజకీయ కార్యకలాపాలను విస్తృత పరిచారని చెప్పవచ్చు. 1901 ఏప్రిల్ నెలలో కలకత్తాలోనే అరవిందఘోష్, మృణాళినీ బోస్‌లలకు వివాహం జరిగింది. పెండ్లియైన మరునటి ఏడాదే సిస్టర్ నివేదితను ఆయన కలుసుకోవడం, పరిచయమేర్పడటం జరిగింది.

అదే ఆయనకు స్వదేశంతో కొత్త పరిచయానికి నాందిగా చెబుతారు. 1902 - 03 నడుమ కాలంలో పశ్చిమ భారత దేశంలో పని చేస్తున్న 'సీక్రెట్ సొసైటీ'లో అరవిందులు చేరడం మరో కీలకమైన మలుపని చెప్పుకోవచ్చును. 1903 ఏప్రిల్ నెలలో కాశ్మీరులో గల శంకరాచార్య పర్వతంపై స్వరూప జ్ఞాన అన్వేషణానుభవాన్ని అరవిందులు పొందారు.

1904 - 05 సంవత్సరాలలో యోగసాధనను ముమ్మరం గావించి, దానిని జీవితాంతం ఆచరించారు. తద్వారా అరవిందఘోష్ అరవిందయోగిగా పరిణతి చెందారని చెప్పవచ్చు. యోగి అరవిందుని గురువు ఇంగ్లాండులో గల 'బ్రౌనింగ్'. విద్యార్థిగా అరవిందుని గురించి వారు చెప్పిన మాటలు ఇవి : "నీవు ఒక అసాధారణమైన ఉన్నతమైన పరీక్షలో ఉత్తీర్ణుడవయ్యావు. నేను నా త్రయోదశ వసంతాల అధ్యాపక వృత్తిలో పరీక్షా పత్రాలు, జవాబు పత్రాలను చూస్తూ వచ్చాను. కానీ నీ సమాధాన పత్రం లాంటి పత్రాన్ని నేను చూడలేదు. నీ వ్యాసం బాగుంది" అంటూ బాల్య విద్యార్థిగా వున్నప్పుడే అరవిందులకు బ్రౌనింగ్ కితాబివ్వడం గణనీయమైన అంశం. దీనిని బట్టి అరవిందుని రచనాశైలి ఎంత శక్తివంతమైనదో అవగతమవుతుంది.

యోగిగా మారాక ఆయన తన మాతృదేశం గురించి అన్న ముక్కలు యివి. "ఈనాడు ప్రజలు దేశాన్ని ఒక జడ పదార్థంగా, మైదానంగా, భూమిలాగా, అడవులుగా, పర్వతాలుగా, నదులుగా భావిస్తున్నారు. కాని నేను తల్లిగా భావిస్తాను. ఆమెను ఆరాధిస్తాను. ఆమె పట్ల భక్తిభావంతో వుంటాను...." అన్నారు.

1905లో బెంగాల్ రెండు భాగాలుగా (ముక్కలుగా) చీలిపోయింది. అప్పుడు అరవిందుడు ఆ నేపథ్యాన్ని పురస్కరించుకుని భవానీ మందిర్, నో కాంప్రమైజ్ మొదలైన కరపత్రాలు పంచిపెట్టి పెద్ద సంచలనానికి నాంది పలికారంటే ఆశ్చర్యం కలుగక మానదు.

1906లో కలకత్తాలో ఆయన నివసించడం ఇంకో మలుపుగా పేర్కొనవచ్చు. ఘోష్ సోదరుడు బరీంద్ర ప్రారంభించిన బెంగాలీ వార పత్రిక యుగాంతర్‌ను మార్చి నెల నుండి అరవిందుడే నడపడం మరో విశేషం. రాజకీయ రాడికల్ వార్తా పత్రిక వందేమాతరంను 1906లో బిపిన్ చంద్రపాల్ ప్రారంభించినాడు. ఆయనకు అప్పుడు అరవిందుడు సహాయకుడుగా నిలిచాడు.

ఇదే పత్రిక వెస్ట్ బెంగాల్‌లో నేషనలిస్ట్ పార్టీకి అండగా నిలబడిందని చెప్పుకోవాలి. వందేమాతరం పత్రిక సంపాదకుడుగానూ వ్యవహరిస్తూ, 1907 ప్రాంతంలో "ద డాక్ట్రిన్ ఆఫ్ పాసివ్ రెసిస్టెన్స్" వంటి అనేక రచనలు చేయడం ఆయనకే సాధ్యమయ్యింది. అరవిందుని రచనలకు భయపడ్డ వలస ప్రభుత్వం ఆగస్టు 16న ఆయనను అరెస్టు చేసింది. బెయిల్ దొరికినందువల్ల విడుదలయ్యారు.

1908 మే - 1 న అరవిందఘోష్‌ను తిరిగి ఆలీపూర్ కుట్ర కేసులో దోషిగా అరెస్టు చేశారు. మే - 5, 1908 నుంచి మే - 6, 1909 వరకూ అండర్‌ట్రయల్ ఖైదీగా ఆలీపూర్ సెంట్రల్ జైల్‌లో నిర్బంధ జీవితం గడిపారు. ఆ కారాగారవాస జీవితానుభవాల్ని ఆయన "టేల్స్ ఆఫ్ ప్రిజన్ లైఫ్"లో చిత్రించారు. నూతనమైన ఆలోచనలకు నిదర్శనంగా అరవిందుడు కర్మయోగ పేరుతో ఆంగ్లవారపత్రికను జూన్ - 19, 1906లో ప్రారంభించారు. అదే యేడాది ఆగస్టు 23 నుంచి మాతృభాష అయిన బెంగాలీలో ధర్మ అనే వారపత్రికను తీసుకు రావడం విశేషం.

1910 ఫిబ్రవరి నెలలో ఆయన కలకత్తా నుంచి చంద్రానగర్‌కు ప్రయాణమయ్యారు. అక్కణ్ణుంచి 1910, ఏప్రిల్ 1-4 తేదీల మధ్య నౌకలో పాండిచ్చేరి వెళ్లడం తటస్థించింది. పుదుచ్చేరి (పాండిచ్చేరి) లోనే అరవిందులు పాల్ రిచర్డ్స్‌ను కలిసారు. వారి కలయిక తర్వాత 1914 మార్చి 29న ఆయన మీరా రిచర్డ్స్‌ని కలిసారు.

అరవిందులు ప్రారంభించిన ఆర్య మాస పత్రిక తొలి సంచిక ఆగస్టు - 15 , 1914 న వెలువడింది. ఆయన గొప్ప రచనలలో ఒక్క సావిత్రి మినహా మిగిలినవన్నీ ఈ పత్రికలో ప్రచురితాలై, వెలుగులోకి రావడం ప్రత్యేకాంశంగా పేర్కొనాలి. ఇది 1921 వరకూ కొనసాగింది.

చాలా సంవత్సరాలు మీరా రిచర్డ్స్ జపాన్‌లో గడిపి 24 ఏప్రిల్ 1920 న పుదుచ్చేరి తిరిగి వచ్చారు. 1926 నవంబర్ - 24 న సిద్ధి దినోత్సవం జరిగింది. తన శిష్యుల యోగక్షేమాలు చూడ తలపెట్టిన మదర్ (మీరా రిచర్డ్స్) అక్కడ ఆశ్రమాన్ని నెలకొల్పారు. 1928 లో ద మదర్ రచన వెలువడింది. 1930 - 38 సంవత్సరాల మధ్య ఆశ్రమంలోనున్న సాధకులతో అరవిందయోగి నిత్యం సంభాషణలు కొనసాగిస్తుండే వారు.

1939 - 40 సంవత్సరంలో పునశ్చరణ తర్వాత 'ద లైఫ్ డివైన్' పుస్తక రూప కల్పన గావించారు ఆయన. అప్పుడే ఆయన 30 కి పైన పద్యాలు రాయడం విశేషంగా మనం భావించాలి. అరవిందయోగి సాహిత్య సేవ అనంతమైనదనే చెప్పుకోవాలి. తాను ఎన్నో రచనలు చేసినా అన్నిటికన్న మిన్నగా నిలిచినది 'సావిత్రి' అనే విషయం నిర్వివాదాంశం. ఆయన కలం నుంచి వెలువడిన ద్వైత ఆవాహన, సంధ్య వంటి ఆధ్యాత్మిక కవితలు ఎన్నదగినవి. తాను దర్శించ గలిగిన ఆధ్యాత్మిక సౌందర్యం అనన్య సామాన్యమైనదిగా ఆయన భావిస్తారు.

ఘోష్ యవ్వన దశలో తిరుగులేని స్వాతంత్ర్య సమరశీలిగా పేరెన్నికగన్నాడు. పిదప దేశభక్తి పూరిత రాజకీయ వేత్తగా, యోగిగా, ఋషిగా, భారత భవిష్యద్దర్శనం చేసిన మేధావిగా, కీర్తి పతాకను ఎగుర వేసిన మహనీయుడుగా నిలిచాడు.

ఆయన చేసిన కృషి బహు ముఖీనమై విస్తరించినదన్న సంగతి జిజ్ఞాసువులకు తెలియంది మాత్రం కాదు. ఒక విప్లవకారుడుగా, పరమయోగిగా, తాత్త్వికుడుగా, రాజ నీతి చతురుడుగా, రచయితగా, మహాకవిగా, అధ్యాపకుడుగా, ఆధ్యాత్మిక వేత్తగా, సౌందర్యోపాసకుడుగా పేరు పొందారు.

1942 డిసెంబర్ - 2 న అరవిందయోగి పుదుచ్చేరిలో ఆశ్రమ పాఠశాలను ప్రారంభించారు. చరిత్ర వరంగా మనం పరిశీలించినట్లయితే, భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన రోజునే అరవిందయోగి 75వ పుట్టిన రోజు కావడం యాదృచ్ఛికం. వేదాంత పరిభాషలో చెప్పాలంటే, భూమి పొరలలో దాగివున్న శక్తిని స్వీకరించి భూమి పొరలను చీల్చుకుని సృష్టి అందాలు పొదిగి, అందమైన ఫలాలు, ఆరోగ్య వంతమైన ఔషదులను అందించడానికి వచ్చే అంకురంగా పూర్వజన్మ సంస్కారాలను, తల్లిదండ్రుల సంస్కారాలను పుణికి పుచ్చుకుని అరవిందుడు యోగిగా ఈ సృష్టిలోకి అడుగు పెట్టాడనవచ్చు.

నిర్వీర్యమైన సమాజంలో వీర్యవంతుడైన శిశువు, నిరాశా నిశీధిలో ఆశాకిరణం, అకురాలిన చెట్టుకు మొలచిన కొత్త చిగురు - విశేషించి చెప్పాలంటే, ఎడారుల్లో కనిపించే ఒయాసిస్సు, ఉషోదయ కాలంలో ముందు కనిపించే వేగుచుక్కే ఆయన. అరవిందయోగి తత్వం విచారించి శోధించిన వారికే అవగతం కాగలదన్నది అక్షరసత్యం.

ఆయన కలం నుంచి జాలువారిన 'సావిత్రి' మొదటి భాగం 1950 లో ప్రచురితమయ్యింది. తక్కిన రెండు మూడు భాగాలు 1951 లో ఆయన మరణానంతరం ప్రచురితమైనాయి. 1950 నవంబర్ నెలలోనే అరవిందయోగికి 'కిడ్నీ' పాడైతే అనారోగ్యం పాలయ్యారు. డిసెంబర్ - 5, 1950లో ఆయన ఈ లోకాన్ని విడిచిపెట్టి పరమాత్మలో లీనమైపోయారు.

'అరవింద దర్శనం' కోసం ఆయన భౌతిక కాయం ఐదురోజుల పాటు ఆశ్రమంలో ఉంచారు. నేటికీ పాండిచ్చేరిలోని శ్రీ అరవిందో ఇంటర్నేషనల్ యూనివర్శిటీ సెంటర్, అరవిందో ఇంటర్నేషనల్ సెంటర్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థలు ప్రపంచ వ్యాప్తమై ఆధ్యాత్మిక స్వధర్మాన్ని, యుగధర్మాన్ని వ్యాపింపజేస్తూనే ఉన్నారు. 1968 ఫిబ్రవరి - 29 న ఏర్పాటైన అరోవిల్లే (పుదుచ్చేరి) లో అరవిందుల వారి తేజస్సు ప్రతిష్ఠితమైనది.

**- మంతెన సూర్యనారాయణ రాజు**

# భారత దేశంలో జనగణన విధానము అవగాహన

**జనగణన అనేది దేశ సర్వతో ముఖాభివృద్ధికి కావలసినటువంటి పరిపాలన పరమైన, ఆర్థిక పరమైన ప్రణాళికలు, విధానాల రూపకల్పన లో ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఇది కేవలం దేశ స్థాయిలోను, రాష్ట్ర స్థాయిలలోను మాత్రమే గాక, జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో, గ్రామ పంచాయితీ స్థాయిలలో వికేంద్రీకరణ అభివృద్ధి ప్రణాళికల నిర్మాణానికి ఉపయోగ పడుతుంది. అందువలన జనగణన గూర్చిన అవగాహన కేవలం దేశ, రాష్ట్ర స్థాయిలకు మాత్రమే గాక నేడు గ్రామ స్థాయిలోను, మండల స్థాయిలోను అత్యవసరమవుతుంది. ముఖ్యంగా గ్రామ పంచాయితీ స్థాయిలో గ్రామాభివృద్ధి ప్రణాళికలు తయారు చేయవలసిన బాధ్యత గ్రామ పంచాయితీ స్థాయిలోని వార్డు మెంబర్లపై, గ్రామ స్థాయి కమిటీలపై ఆధార పడి ఉంటుంది. ఈ ప్రక్రియంతటికి గ్రామ పంచాయితీ సర్పంచి, వివిద కమీటీల సభ్యులు, గ్రామ పంచాయితీ కార్యదర్శులు పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుంది.**

గ్రామ స్థాయిలో అంగన్‌వాడి కేంద్రాల సంఖ్య, ప్రజా పంపిణీ కార్డుల సంఖ్య, విధవుల భత్యము, కరువు భత్యము, వృద్దాప్య భత్వపు వ్యక్తుల సంఖ్యను జనాభాగణనపై ఆధారపడి ఉంటుంది. ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక వైద్యా కేంద్రం, గ్రామాన్ని జనభా ప్రాతిపదికన వార్డుల వారీగా విభజనకు జనగణన అవసరమవుతుంది, కాబట్టి జనగణనను గుర్చి అవగాహన ప్రభుత్వ అధికారులకు, ప్రజా ప్రతినిధు లకు మాత్రమే గాక ప్రజలకు కూడా నేడు అవగాహన అవసరమైనది.

### జనగణన అంటే ఏమిటి?

జనాభా లెక్కల సేకరణ అంటే కేవలం ఒక నిర్దేశిత ప్రదేశంలో ఎంతమంది ఉన్నారు అని తలలు లెక్కపెట్టడం కాదు, ఆ పదానికి విస్తృతమైన, విశ్లేషణాత్మకమైన పరిదిలో ఐక్యరాజ్యసమితి నిర్వహించింది. ఒక నిర్దేశిత ప్రదేశంలో లేదా దేశంలోని జనాభాకు సంబంధించి, నిర్దేశిత సమయంలో సంఖ్యా సేకరణ, సంకలన, విశ్లేషణ, సంఖ్యాగణన, ప్రచురణ చేయటమే గాక, ఆ గణాంకాలను ఆర్థిక పరంగా, సాంఘీక పరంగా పట్టికలు లేదా గ్రూపుల రూపంలో వర్గీకరించడమే జనగణన అంటాము. (జనగణన సిఫార్సులు, సూత్రాలు, ఐక్యరాజ్య సమితి, న్యూయార్క్, 2008).

### జనగణన విధానం

భారత దేశంలో ప్రతి పది సంవత్సరములకొక మారు జనభా లెక్కలు లేదా జనగణన నిర్వహిస్తారు. మన దేశంలో జనగణన యధార్ధ ప్రచారకర్త పద్దతి (Defacto canvonsor) ని అనుసరించి నిర్వహిస్తారు. ఈ పద్దతి ప్రకారం ఒక నిర్దిష్ట ప్రశ్నావళి ద్వారా ప్రతి ఇంటిలోని ప్రతి వ్యక్తి నుండి 3 వారాల పరిధిలో సమాచారాన్ని సేకరించడం జరుగుతుంది. ఈ సేకరించిన సమాచారాన్ని తాజాగా నిర్దేశించిన తేదీకి అనుగుణంగా మార్పులు, చేర్పులు చేయడానికి ఒక డివిజన్ రౌండును నిర్వహిస్తారు. 1931 వరకూ జరిగిన జనగణన సింక్రోనస్ డాఫాక్టో పద్ధతిలో అంటే ఏక కాలంలో నిర్వహించే విధంగా దేశమంతా



ఒకే రాత్రిలో జనగణన నిర్వహించేవారు. కాని, ఈ విధానం ఎంతో వ్యయప్రయాసలతో కుండుకున్నది కావడంతో 1941 లో ప్రస్తుతం అమలులో ఉన్న పద్ధతిలో జనగణనను నిర్వహించడం జరుగుతుంది.

### జనగణన నిర్వహక నిర్మాణం

భారత దేశంలో జనగణన రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ లోని 69 వరుస క్రమంలో ఉన్నది. ఆర్టికల్ 246 ప్రకారం ఇది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. స్వతంత్ర భారత దేశంలో Census Act 1946 ద్వారా జనగణనకు చట్టబద్ధత లభించింది. చట్ట ప్రకారం జనగణన ప్రక్రియ క్రింద ప్రభుత్వ పరిధిలోనిది అయినప్పటికి, దానికి అవసరమైన నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వాలే సహాయపడతాయి. జనగణన నిర్వహణ శాఖకు అనుబంధంగా ఉంటుంది. కేంద్ర కార్యలయానికి రిజిస్ట్రార్ జనరల్, సెన్సెస్ కమీషనర్ ప్రధాన అధికారిగా ఉండగా, క్షేత్ర కార్యలయాలకు డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్స్ అధికారిగా ఉంటారు. జనగణన కార్యాలయానికి అవసరమైన సలహాలు ఇవ్వడానికి, ప్రశ్నావళిని ఖరారు చేయడానికి ఒక ప్రత్యేక సాంకేతిక సలహా సంఘం (టి.ఎ.సి) ఉంటుంది. 2011 జనగణనకు గాను ఈ సాంకేతిక సలహా సంఘాన్ని భారత ప్రభుత్వం 2008 సెప్టెంబర్ 30వ తేదీన నియమించింది. ఈ సంఘం 2008 నవంబర్ 25,2009 అక్టోబర్ 9,2010 జూన్ 23 తేదీలలో మూడుసార్లు సమావేశమయింది.

### జనగణన నిర్వహణ శిక్షణ

జనగణన ప్రజలను సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా అభివృద్ధి చేయడానికి రూపొందించే కార్యాక్రమాలలో ప్రభుత్వాలకు ఒక కీలక అధార అంశంగా ఉంటుంది కాబట్టి జనగణన నాణ్యతగా, ఖచ్చితంగా, యధార్ధవంతంగా ఉండడానికి దానిని నిర్వహించే సిబ్బందికి తగిన శిక్షణ అవసరం. ఈ శిక్షణకు అవసరమైన మానవ వనరులను రాష్ట్రాల స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వాలు సమకురుస్తాయి. రాష్ట్ర స్థాయిలో ఉన్నటు వంటి జనగణన అధికారులు వీరికి శిక్షణను అందిస్తారు. సాధారణంగా ఈ కార్యక్రమానికి అద్యాపకులు, ఉపాధ్యాయులను వినియోగిస్తారు. గ్రామ స్థాయిలో ఉన్నటువంటి వివిధ ప్రభుత్వ సేవలు నిర్వహిస్తున్నటువంటి అంగన్ వాడి, వయోజన విద్య వాలంటీర్లను కూడా రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగిస్తున్నాయి.

2011 జనగణనలో పాల్గొన్నటువంటి విధినిర్వహకులు, సమాచారసేకరణ, నమోదుదార్లు, పర్యవేక్షకులు అనే మూడు రకాల సిబ్బందికి శిక్షణను మూడు అంచెలుగా రూపొందించారు. జాతీయ స్థాయిలో 90 మంది శిక్షకులను ఎంపిక చేసి వారికి 5 రోజులు శిక్షణ ఇచ్చారు. ఈ జాతీయ స్థాయి శిక్షకులు రాష్ట్ర స్థాయిలో 725 మంది మాస్టర్ ట్రైనర్ ఫెలిసిటేటర్స్ (యమ్.ఎఫ్)కు శిక్షణ ఇచ్చారు. వీరు జిల్లా స్థాయిలో 54000 మంది మాస్టర్ ట్రైనర్‌లకు శిక్షణ అందించారు. ఈ మాస్టర్ ట్రైనర్ లు క్షేత్ర స్థాయిలో ఉన్న జనగణన సిబ్బందికి శిక్షణ, సూచనలు ఇచ్చారు.

జాతీయ స్థాయిలో ప్రధాన జనగణన అధికారులు, జనగణనకు ముందు సంవత్సరము సమావేశమవుతారు. ఈ సమావేశాలకు కార్యదర్శులు హాజరవుతారు. వీరితో పాటు రాష్ట్ర స్థాయి జనగణన అధికారులు, డైరెక్టర్లు, కమీషనర్లు హజరయి, జనగణన నిర్వహణ విధానంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, అంశాలు, సమస్యలు వాటి పరిష్కారాలను గూర్చి చర్చిస్తారు. ఈ సమావేశానంతరం, కేంద్ర జనగణన రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయ ప్రతినిధులు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను పర్యటించి రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి అధికారులతో విస్తృతంగా సమావేశాలు నిర్వహించడం జరుగుతుంది. జనగణన వివిధ దశల పురోగతికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తు కేంద్ర హోంమంత్రి, కార్యదర్శులు ప్రత్యేక పత్రికా సమావేశాలు ఏర్పాటు చేస్తారు. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, హోంశాఖల ఆధ్వర్యంలోని మిలటరీ, పారామిలటరీ సంస్థల నోడల్ అధికారుల సమావేశం ఏర్పాటు చేసి, వాయు, నౌక, పదాతి దళ ప్రతినిధులు, కోస్ట్ గార్డ్ ప్రతినిధులు పాల్గొనుట ద్వారా అన్ని విభాగాల వారిని జనగణన నిర్వహణ ప్రక్రియలో భాగస్వాములుగా చేయడం జరుగుతుంది.

క్షేత్ర స్థాయిలోను, జిల్లా స్థాయిలోను జనగణన ప్రక్రియలో సిబ్బందికి సంబందించిన ప్రత్యేక మొబైల్ ఫోన్ క్షేత్ర స్థాయినుండి అన్ని పై స్థాయిల సిబ్బందికి జనగణన నిర్వహణ విధానం పరిపూర్ణంగా అవగాహన కావడం కోసం సులభంగా, సవివరంగా తెలిపే కరదీపికలు, శిక్షణ సూచికలను రూపొందించారు. ఈ శిక్షణను పవర్ పాయింట్ ప్రజంటేషన్లు, ఈ లెర్నింగ్, ప్రాక్టీస్ షీట్స్ తదితర ఆధునిక సాంకేతిక శిక్షణ విధానాల ద్వారా అందించారు. అలాగే అంగవికలురు, స్త్రీల శిశువుల, సమాచార సేకరణకు అవలంభించవలసిన ప్రత్యేక పద్ధతులను కూడా వివరించారు. ఈ శిక్షణ విధానాన్ని కేంద్ర జనగణన సంస్థ, ఐక్యరాజ్య సమితి సంస్థలైన యుఎన్‌డిపి, యుఎన్ మహిళా విభాగం సంయుక్తంగా రూపకల్పన చేశారు.

### 2011 జనగణన నిర్వహణలోని కీలక అంశాలు

2011 జనగణన శిక్షణ కార్యక్రమంలో ప్రభుత్వేతర సంస్థలను కూడా వినియోగించడం ఒక నూతనాంశం. స్వచ్ఛంద సంస్థలలో శిక్షణ పొందిన కార్యకర్తలను క్షేత్ర స్థాయిలో సన్నితమైన వైకల్యం లింగ నమోదు అంశాలలో జనగణన సిబ్బందికి అనుబంధంగా వినియోగించారు. దేశమంతా విస్తరించియున్న 600 మంది ప్రధాన జనగణన అధికారులతో కేంద్ర జనగణన కమీషనరు ఏకకాలంలో మాట్లాడడానికి వీడియో కాన్ఫెరెన్సు పద్ధతి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అమలు చేయడం జరిగింది.

నెంబర్ల జాబితాను తయారు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతారు. దీని వలన క్షేత్ర స్థాయిలో ప్రజల నుండి సూచనలు, పర్యాయలు, సమాధానాలు తేలికగా అందుకోగలుగుతారు. అలాగే జనగణన సిబ్బంది మరింత సౌకర్యవంతంగా, వేగంగా పనిచేయడానికి, ప్రజల వీలయినంత అందుబాటులో ఉండడానికి ఎస్.ఎమ్.ఎస్., కాల్ సెంటర్, వెబ్‌సైట్ వంటి ఆధునిక కమ్యునికేషన్ సాధనాలకు వినియోగిస్తారు.

### జనగణన ప్రశ్నావళిలో చేసిన మార్పులు

2011 జనగణన కొరకు రెండు ప్రశ్నావళులు రూపొందించారు. ఒకటి కుటుంబ నమోదు కోసం, మరొకటి జనాభా నమోదు కోసం. మొదటి ప్రశ్నావళిలో 35 ప్రశ్నలు, రెండవ ప్రశ్నావళిలో 29 ప్రశ్నలు ఉన్నాయి. వీటిని భారత ప్రభుత్వ అనుమతిపొందిన తర్వాత గెజిటెలో ప్రచురించారు. అయితే రెండవ ప్రశ్నావళి అయిన జనాభ వివరాలను సేకరించే దానిలో ముఖ్యమైన అంశాలలో మార్పులు చేశారు. అవి ఈ క్రింది విధంగా ఉన్నాయి.

**జనగణన ప్రశ్నావళిలో చేసిన మార్పులు**

| | 2001 జనగణన | 2011 జనగణన |
|---|---|---|
| 1. | వయసు (పూర్తయిన సం॥) | వయసుతోపాటు పుట్టిన తేది. |
| 2. | వైవాహిక స్థాయి వివాహితులు/అవివాహితులు | వీరితో పాటుగా అదనంగా విడాకులు పొందినవారు / విడిగా ఉంటున్నవారు. |
| 3. | విద్యా సంస్థలో హాజరు | అదనంగా చేర్చినవి : ఎప్పుడూ హాజరుకానివారు / గతంలో హాజరయినవారు |
| 4. | గత సం॥. ఎప్పుడైన ఉద్యోగం నిర్వహించారా | అదనంగా చేర్చినవి : 3-6 నెలలు పనిచేసినవారు 3 నెలల కన్న తక్కువ పనిచేసినవారు |
| 5. | ఆర్థికేతర వ్యాపకం | అదనంగా చేర్చినది : పనిచేయకుండా ఆదాయం పొందేవారు. |
| 6. | జన్మస్థలం | అదనంగా చేర్చినవి : గ్రామము, పట్టణము |
| 7. | గత నివాస స్థలము | అదనంగా చేర్చినది : గ్రామము, పట్టణము |
| 8. | గత సం॥. సజీవంగా జన్మించిన శిశువులు | సం॥. రానికి మార్చి 1, 2010 నుండి ఫిబ్రవరి 28, 2011 వరకు అని నిర్దిష్టంగా పేర్కొన్నారు. |

ఆధారం: జనగణన 2011.

- డా॥ బి.నాగేశ్వర రావు, పి.డి.ఎఫ్. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

# 150 సేవల విస్తరణతో 'మీ సేవ'




**పౌర సేవలను ప్రజలకు సకాలంలో అతి సులభంగా అందించేందుకు పతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'మీసేవ' కార్యక్రమం విజయవంతంగా అమలవుతున్న తరుణంలో ఈ కార్యక్రమం ద్వారా మరి కొన్ని సేవలను రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తీసుకురానుంది. 15 శాఖలకు సంబంధించిన మొత్తం 150కు పైగా సేవలను ప్రభుత్వం అందించనుంది.**

### ముఖ్యమైన సేవలు

*రెవిన్యూ శాఖ*

1. అడంగళ్/పహణీ
2. ఆదాయ ధ్రువీకరణ పత్రం
3. నివాస ధ్రువీకరణ పత్రం
4. సమగ్ర ధ్రువీకరణ పత్రం (కులం, స్థానికత, జనన తేది)
5. రెవెన్యూ రికార్డులో మార్పులు, చేర్పులు
6. గ్రామ భౌగోళపటం (నకలు) మరిన్ని సేవలు
7. ప్రజావాణి, సరిహద్దు మార్పులపై మార్చిన ఆర్జీలు, స్థిరాస్తుల స్థానికత నమోదు.
8. పట్టాదారు పాస్‌బుక్.

*మున్సిపల్ పరిపాలన శాఖ*

1. జనన ధ్రువీకరణ పత్రాలు
2. రిజిస్ట్రేషన్ పత్రాల ధ్రువీకరణ నకలు
3. జనన, మరణ ధ్రువీకరణ లేదని తెలుపు పత్రం
4. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలలో మార్పులు, పిల్లల పేర్లను చేర్చటం.

*స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ*

1. ఎన్‌కంబరెన్స్ ధ్రువీకరణ పత్రం
2. రిజిస్ట్రేషన్ పత్రాల ధ్రువీకరణ నకలు
3. సొసైటీలు, సంస్థల రిజిస్ట్రేషన్

*పోలీసు శాఖ*

1. పోగొట్టుకున్న / తస్కరింపబడిన ముఖ్యమైన దస్తావేజుల గురించి అభ్యర్థన

*పౌర సరఫరాల శాఖ*

1. రేషన్ కార్డులలో మార్పులు
2. జనన తేదీ, చిరునామా మార్పు, పేర్లలో మార్పులు, చౌక ధరల దుకాణాల మార్పు

*పరిశ్రమలు, వాణిజ్య శాఖ*

1. పావలా వడ్డీ
2. పరిశుభ్రమైన ఉత్పత్తులు
3. ఉత్పత్తి చేసేందుకు ఇచ్చే పథకాలు
4. పెట్టుబడిపై రాయితీ ఐఎస్ఓ/బిఐఎస్ సర్టిఫికేషన్
5. విద్యుత్ చార్జీల తిరిగి చెల్లింపు
6. నైపుణ్యతను పెంచటం
7. స్టాంపు నిర్వహణ/భూమి రుసుము/భూముల బదలాయింపు రుసుము/తనిఖీ నిర్వహణ

### కొత్తగా ప్రవేశ పెట్టబడే సేవలు

*విద్యా శాఖ*

1. వయస్సు నిర్ధారిస్తూ ఇచ్చే ధ్రువపత్రం కొరకు దరఖాస్తు
2. మార్కుల జాబితా నకలు పొందడానికి దరఖాస్తు
3. మార్కులు పున: మూల్యాంఖన కోసం దరఖాస్తు
4. విద్యా సంబంధిత వలసల కోసం దరఖాస్తు

*శాఖల వారీగా . . .*

| | | | |
|---|---|---|---|
| యుఐడిఏఐ ఆధార్ | 2 | రెవిన్యూ శాఖ | 55 |
| రిజిస్ట్రేషన్ శాఖ | 12 | మున్సిపల్ పరిపాలన శాఖ | 22 |
| పోలీస్ శాఖ | 4 | పౌర సరఫరాల శాఖ | 3 |
| రవాణా శాఖ | 4 | భారీ పరిశ్రమ శాఖ | 4 |
| విద్యా శాఖ | 4 | మైనింగ్, జియాలజీ శాఖ | 7 |
| కార్మిక శాఖ | 4 | వ్యవసాయ శాఖ | 2 |
| సాధారణ పరిపాలన శాఖ | 4 | | |
| సమాచార సాంకేతిక, కమ్యునికేషన్ శాఖ | 11 | | |

*మైనింగ్ జియాలజీ శాఖ*

1. సూచిక అనుమతి పత్రం
2. తవ్వకాలకు ఒడంబడిక
3. గ్రనెట్ క్వారీ ఒడంబడిక
4. మార్బుల్ క్వారీ ఒడంబడిక
5. ఇతర క్వారీ ఒడంబడిక
6. ఖనిజ వసతి అనుమతి పత్రం

*వ్యవసాయ శాఖ*

1. పంటలు బీమా
2. సబ్సిడీతో విత్తనాల పంపిణీ


*కార్మిక శాఖ*

1. కొత్త కార్యాలయాలు, వ్యాపార సంస్థల నమోదుకై దరఖాస్తు (ఫారం-1)
2. కార్యాలయాలు, వ్యాపార సంస్థల అనుమతి కోసం దరఖాస్తు (ఫారం-2)
3. కార్యాలయాలు, వ్యాపార సంస్థల నమోదు ధ్రువపత్రం నకలు పొందటం
4. మార్పులు, చేర్పుల వివరాలు తెలియచేయటం.

*- సి.ఎం.పి.*



Sthanika_BW_Oct13.indd 24 17/10/13 5:25 PM




# సారపు ధర్మమున్ విమల సత్యము.....

**ప్రజల యోగక్షేమాలను చూసే పాలన పాలకులకు అసిధారావ్రతమే. ఎక్కడ ఏ మేరకు ఎలా ప్రవర్తించాలో, ప్రవర్తించకూడదో తెలుసుకొని వివేకంతో నడుచుకోవలసిన బాధ్యత పాలకులందరిపైనా ఉంటుంది. దుర్మార్గాన్ని తుంచటం ఎంత అవసరమో, సన్మార్గాన్ని పదికాలాలపాటు ప్రజలకు ఏర్పరచటం కూడా అనివార్యమే. ఈ విధినిర్వహణలో ధర్మాన్ని పరిరక్షించటం, సత్యాన్ని సర్వకాల సర్వావస్థలలోనూ పూని చరించటం పాలకుల ప్రప్రథమ కర్తవ్యం. ఎన్నో సమస్యలను సైతం స్థిరచిత్తంతో విప్పకోగల స్థైర్యమే పాలకులకు కవచం. తనపై ఆదరణ కల అనుయాయులందరినీ చక్కగా పాలించి తనకు పెట్టని కోటగా ఏర్పరచుకోవటమూ అవసరమే. ముందు రాజ్యం నిర్భీతిగా ఉన్నప్పడే ప్రజలు సుఖశాంతులతో ఉంటారనే సత్యాన్ని మరువకూడదు. పాలకులు స్వీకరించే ఏ సంస్కరణ అయినా, పరిణామమయినా అందులో ప్రజాక్షేమం ప్రతిబింబించాలి. అది సత్ఫలితంగా ప్రతిఫలించి అప్పడే ఆ పాలన ప్రజల హృదయాలను చూరగొంటుంది. ముఖ్యంగా పాలకులు ఏ దోషమూ లేకుండా నిష్కళంక మనస్తత్వంతో వ్యవహరించాలి.**

ప్రతి వ్యక్తికీ హక్కులు ఉంటాయి. వాటితో పాటు బాధ్యతలు కూడా ఉంటాయి. నిద్రలో కూడా మరపురానివి హక్కులు. మరొకరు గుర్తుచేస్తే గాని గుర్తురానివి బాధ్యతలు. ఈ రెండింటి సంబంధం ఆధార ఆధేయం. మనం మన బాధ్యతలను సరిగ్గా నిర్వర్తిస్తే - అది ఇతరులు తమ హక్కుల్ని అనుభవించడానికి మూలం అవుతుంది. బాధ్యతలను గుర్తుపెట్టుకోవాలి విధిగా నిర్వర్తించాలి. హక్కులు వాటంతట అవే వస్తాయి.

నేడు సమాజంలో హక్కుల కోసం పోరాటాలు జరుగుతున్నాయి. బాధ్యతల నిర్వహణకు ఎలాంటి ప్రయత్నమూ జరుగుతున్న దాఖలా లేదు. హక్కుల పోరాటాల కింద బాధ్యతలు నలిగిపోతాయని గుర్తుంచుకోవాలి. ప్రజాస్వామ్య దేశాలలో పాలకుల పక్షపాత వైఖరి, స్వార్థబుద్ధి, బాధ్యతా రాహిత్యం, హక్కుల పోరాటాలను ప్రోత్సహిస్తుంటాయి. ఈ పరిస్థితిని ఏనాడో ఊహించి మహర్షి వాల్మీకి, రామాయణంలో పాలకులకు ఉండకూడని దోషాలను రాముడితో భరతుడికి చెప్పింది.

**నాస్తిక్య మనృతం క్రోధ ప్రమాదం దీర్ఘసూత్రతాం**
**అనాదరం జ్ఞానవతా మాలస్యం పంచవృత్తితాం**
**ఏక చింతన మర్థానా మనర్థజ్ఞైశ్చ మంత్రణం**
**నిశ్చితానా మనారంభః మంత్రస్యాపరి రక్షణం**
**మంగళస్యా ప్రయోగం చ ప్రత్యుత్థానం చ సర్వతః**
**కచ్చిత్త్వం వర్జయస్యేతాన్ రాజదోషాం చతుర్దశః**

**(అయోధ్య. 100 సర్గ. 65,66,67 శ)**

1. నాస్తికత. దేవుణ్ణేకాదు దేనిని నమ్మకపోవటం 2. అబద్ధమాడటం 3. క్రోధం 4. తప్పలు చేయటం 5. ఆపద వచ్చినప్పడు మాత్రమే నివారణకోసం అన్వేషించటం, 6. జ్ఞానవంతుల మాటలు వినక పోవటం, 7. సోమరితనం 8. ఇంద్రియ లోలత్వం 9. ఒంటరిగా నిర్ణయాలు తీసుకోవటం 10. కీడు చేసే వారితో మంత్రాంగం 11. చేసిన నిర్ణయాలను అమలు చేయకపోవటం 12. గుట్టుగా ఉంచ వలసిన ప్రభుత్వ రహస్యాలను కాపాడలేకపోవటం. 13. దీర్ఘకాలంలో మేలు చేసే పనులను చేపట్టక పోవటం 14. అన్నివైపులనూ దండెత్తటం, ఇరుగు పొరుగు దేశాలతో శత్రుత్వం ఉండటం.

వాల్మీకి కాలం నాటి సమాజంలో ఉన్నది రాజరికం. నేడు ప్రజాస్వామ్యం. అయినా ఇవన్నీ నేటికీ సరిగ్గా సరిపోతున్నాయి. సమాజంలో పాలకులు, పాలితులు ఎప్పడూ ఉంటారు.

పాలితులు ఉండటం వల్లనే పాలకులు అవసరం అయ్యారు. పాలన అంటే రక్షణ. పాలకుడు అంటే రక్షకుడు. పాలన పీడన కాదనీ పాలకులు పీడించరాదని పాలకులను వాల్మీకి ఆనాడే హెచ్చరించాడు. పాలకుల దోషాలు వ్యవస్థను పాడు చేస్తాయని హితవు పలికాడు. అందుకే వాల్మీకి మహర్షి అన్ని కాలాలకూ పనికి వచ్చే సత్యాలను దర్శించగలవాడే ఋషి, మహర్షి అనే పదం వాల్మీకికి సార్థకం.

**- డా. అద్దంకి శ్రీనివాస్**

# వాతావరణ మార్పులతో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం

**పర్యావరణ మార్పు ప్రపంచంలోని పలు దేశాలపై తీవ్ర ప్రభావం చూపుతున్న తరుణంలో, భూమిని కాపాడాల్సిన బాధ్యత ప్రపంచ నేతలపై వుంది. 2009 సెప్టెంబరు 15న ఐక్యరాజ్య సమితి నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పర్యావరణ మార్పుపై అమెరికా అధ్యక్షుడు ఒబామా ప్రసంగిస్తూ, 'మా దౌత్య ఎజండాలో పర్యావరణ పరిరక్షణను ప్రధమ స్థానంలో ఉంచాం. ఆఫ్రికా నుంచి ఐరోపా దాకా అన్ని ఖండాలలోని దేశాలతో ఉండే మా సంబంధాలలో పర్యావరణమే కీలకాంశం అవుతుంది" అన్నారు. మానవాళి మనుగడకే ప్రమాదం వాటిల్లే వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయన్నది మాత్రం నిజం! ఈ విషయమై యావత్ ప్రపంచం జాగ్రత్త పడాలంటూ వాతావరణ నిపుణులు ప్రమాద ఘంటికలను మ్రోగిస్తున్నారు.**

వాతావరణంపై అధ్యయనం చేయడానికి ప్రపంచ వాతావరణ సంస్థ, ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమం సంయుక్తంగా 1988 వ సంవత్సరంలో ఇంటర్ గవర్నమెంటల్ ప్యానల్ ఆన్ క్లెయిమేట్ ఛేంజి (ఐ.పి.సి.సి) సంస్థను ఏర్పాటు చేయడం జరిగింది. వాతావరణ మార్పుల వల్ల మానవాళి విషవలయంలో చిక్కుకుంటుందని ఆసియా, ఆఫ్రికా ఖండాలు వాసులు భవిష్యత్‌లో పెను ముప్పులకు గురికాక తప్పదని ఐ.పి.సి.సి. తన నాల్గవ నివేదికలో హెచ్చరించింది.

### గ్రీన్ హౌస్ వాయువుల

గ్రీన్ హౌస్ వాయువుల పెరుగుదల, గ్లోబల్ వార్మింగ్ కారణంగా, భూగోళపు శీతోష్ణస్థితుల్లో మార్పులు మెరుపు వేగంతో సంభవిస్తున్నాయి. ఓజోన్ రక్షణ కవచం ఇప్పటికే చాలా వరకు కుంచించుకు పొయింది. ఫలితంగా ప్రమాదకరమైన అతి నీలలోహిత కిరణాల ప్రభావం 20 శాతం అధికంగా ధ్రువ ప్రాంతాలపై పడనుంది. ఈ కిరణాలలో 90 శాతం భూమికి 50 కిలోమీటర్లు ఎత్తున ఉన్న వాతావరణపు రెండవ పొర "స్ట్రాటో స్పియర్"లో ఉండే ఓజోన్ పొర జీర్ణించుకుని చరా చర జీవరాశుల్ని రక్షిస్తుంది. ఫలితంగా శీతోష్ణస్థితులు సమతుల్యతతో ఉంటాయి. ఎప్పుడైతే ఓజోన్ పొర అనే రక్షణ కవచం క్షీణిస్తుందో, అప్పుడు ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగి, జీవరాశులలో జన్యు మార్పులకు, రకరకాల క్యాన్సర్ వ్యాధులకు దారి తీస్తుంది.

గ్లోబల్ వార్మింగు ప్రభావం వ్యవసాయంపై చాల తీవ్రంగా వుంటుంది. వాతావరణ మార్పు, వ్యవసాయం అనేది అంతర్గత బాంధవ్యం కలిగి వుంటాయి. భూగోళపు వాతావరణ మార్పుల అధ్యయనం వల్ల వ్యవసాయ ఉత్పత్తిని పెంచే ఆధునిక పద్ధతులను అమలు చేయవచ్చు.



వ్యవసాయంపై వాతావరణ మార్పు ప్రభావం అనేది భౌగోళపు వాతావరణ పరిస్థితులపై కాకుండా, స్థానిక వాతావరణ పరిస్థితులపై ఆధారపడి వుంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. 1880 వ సంవత్సరంలో భూగోళపు ఉపరితల ఉష్ణోగ్రత 1.5 ఫారన్ హీట్ (0.83 సెల్సియస్) పెరిగింది.

2030 వ సంవత్సరంలో వాతావరణ మార్పుల వల్ల, దక్షిణ ఆఫ్రికా, తన ముఖ్య ఆహార ధాన్యంగా వున్న జొన్న పంటలో 30 శాతాన్ని నష్టపోయే అవకాశముందని శాస్త్ర వేత్తలు చెప్తున్నారు. అలాగే దక్షిణ ఆసియాలో ముఖ్య వాణిజ్య పంటలైన వరి, జొన్న, మొక్కజొన్నలు 10 శాతం నష్టపోయే అవకాశముంది.

సుదీర్ఘకాలంలో వాతావరణ మార్పు అనేది వ్యవసాయంపై పలు విధాలుగా ప్రభావం చూపుతుంది.

- ఉత్పత్తి పరిమాణం, నాణ్యతపరంగా
- సాగునీటి ఉపయోగంలో మార్పులు, క్రిమి సంహారకాలు, ఎరువుల ఉపయోగాల ద్వారా వ్యవసాయ విధానాలు.
- పర్యావరణ ప్రభావంతో తరచూ నేల బీటలు పడడం, నేలకోత.
- గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ భూమి తరుగుదల, నీటి వసతులు.
- విత్తనాల ఎంపిక

55 శాతం వ్యవసాయక్షేత్రం రుతు పవనాల వర్షాలపై ఆధారపడివుంటుంది. కాని, సాగు నీటి పైన కాదు. ఈ ప్రభావం వేసవి పంటలపైన ప్రత్యక్షంగా వున్నప్పటికీ, గోధుమ, ఆయిల్ సీడ్స్ వంటి రబి పంటలు అనగా శీతాకాలపు పంటలపై పరోక్ష ప్రభావం వుంటుంది.

నెలల వారీగా, రాష్ట్రాల వారీగా వర్షపాత విభజన వ్యవసాయ ఉత్పత్తులపై ప్రభావం చూపుతుంది.

ఆలస్యంగా వచ్చే రుతు పవనాల వలన విత్తనాలు నాటడం ఆలస్యమై, దిగుబడిపై ప్రభావం చూపుతుంది.

భారత దేశ స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయోత్పత్తి భాగం 17 శాతం వుంది. అలాగే వ్యవసాయరంగం మూలంగా 58 శాతం జనాభాకు ఉపాధి ఉంది. రుతు పవనాల ప్రభావంతో వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడి తగ్గి ధరలు పెరగడం, ఆదాయం తగ్గడం, స్థూల దేశీయోత్పత్తి దెబ్బతినడం జరుగుతుంది. ఇప్పటికే ఆహార ద్రవ్యోల్బణం గత మార్చి నెలకు సుమారు 10 శాతం వుంది. గత రెండు సంవత్సరాలలో వచ్చిన భారీ రుతు పవనాల మూలంగా, 2009 వ సంవత్సరంలోని కరువు తరువాత కూడా, ధాన్యాలు, పత్తి పంటపై ద్రవ్యోల్బణం స్వల్పంగా మాత్రమే ఉంది.

కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ క్రితం, సంవత్సరం విడుదల చేసిన వ్యవసాయ ఉత్పత్తుల అంచనాల ప్రకారం, 2011-12 ఆర్థిక సంవత్సరంలో, వరి, గోధుమ, ప్రత్తి రికార్డు స్థాయిలో ఉత్పత్తి అవడాన్ని భారత్ గమనించింది. 2012 వ సంవత్సరంలో వచ్చే సానుకూలమైన రుతు పవనాల మూలంగా ధరలు స్థిరంగా వుండడం లేదా తగ్గుముఖం పట్టడం జరుగుతుందని నిపుణుల అంచనా.

కాని సాధారణ రుతు పవనాలు ఒక్కటే కారణం కాదు. కూరగాయలు, పాలు, పళ్ళు వంటి ఆర్థిక స్థోమతను బట్టి వినియోగించే పదార్థాల ఆవశ్యకతపై ఆధార పడి ఆహార ద్రవ్యోల్బణం వుంటుంది. కాని, ఈ విషయంలో రుతుపవనాల ప్రభావం చాల స్వల్పంగా వుంటుంది. అదే కాకుండా, ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరకు పెంచిన నాడు కూడా ధరలు పెరుగుతాయి!

గ్రామీణ ఆదాయాలపైన రుతు పవనాల ప్రభావం వుంటుంది. ఉదాహరణకు రుతు పవనాలు సక్రమంగా, సకాలంలో వున్న రోజులలో రైతులు అధిక ఆదాయాన్ని కల్పించే వరి, గోధుమ పంటలు వేసి ఆదాయ వనరులను పెంచుకున్నారు. స్వల్ప ఆదాయం వచ్చే ధాన్యాలను పండించడానికి స్వస్తి చెప్పారు.

ఉత్పత్తి ఖర్చులు ఏటా 15% పెరుగుతున్నాయి. 2011-12 ఆర్థిక సంవత్సరంలో ఎరువుల ధరలు రెట్టింపయ్యాయి. 3 సంవత్సరాలలో వ్యవసాయ కూలి 75% పెరిగింది. కనుక సాధారణ రుతు పవనాలున్నప్పటికీ, లాభాలు మాత్రం ఎక్కువగా వుండే అవకాశాలు తక్కువ.

క్రితం ఏడాది సాధారణ రుతు పవనాల మూలంగా రికార్డు స్థాయి ఆహారోత్పత్తి జరిగినా, ఆహార ధాన్యాలను నిలువ చేసే సౌకర్యాలు తక్కువ అయ్యాయి. నిలువ చేసే గిడ్డంగుల పరిస్థితి అధ్వాన్యంగా వుంది. 1-06-2012 నాటికి ఆహార ధాన్యాలు 75 మిలియన్ టన్నుల లభ్యత వుంటే, నిలువ చేసే గిడ్డంగుల స్థాయి 50 మిలియన్ల టన్నులే! మిగిలిన 25 మిలియన టన్నుల ఆహారధాన్యాలు వర్షపు నీటి పాలు కాక తప్పదు.

ఆహార ధాన్యాల నిలువలు పెరిగి, నిర్లక్ష్య ధోరణి వల్ల ముక్కి పోతుంటే, ఆ ధాన్యపు విలువలను వృధా పరచే బదులు, భారత అత్యున్నత న్యాయ స్థానం ఆదేశాల మేరకు ఆకలితో అలమటిస్తున్న అన్నార్థులకు ఉచితంగా ఆహారధాన్యాలను సరఫరా చేసి, ఆకలి తీర్చడం అభిలషణీయం!

వాతావరణంలో మార్పులు సహజమైనప్పటికీ, ఓజోన్ పొరలో చిల్లులు అధికమవుతుండడంతో, విశ్వ మానవాళి మనుగడ ప్రమాదపుటంచులకు చేరింది. ఈ సమస్యపై అగ్ర రాజ్యాలు దృష్టి సారించి ప్రప్రథమంగా 1979లో ప్రపంచ వాతావరణ సదస్సును నిర్వహించడం జరిగింది.

వాతావరణం వేడెక్కడం వలన 2030వ సంవత్సరం నాటికి భారత దేశంలో హిమనదాలు 80 శాతం పెరిగిపోతాయని ఐ.పి.సి.సి. నివేదిక పేర్కొంది. భూగోళపు ఉష్ణోగ్రత 1.1 నుంచి 6.4 డిగ్రీల సెంటిగ్రేడ్ అనగా 2.0 నుంచి 11.5 డిగ్రీల ఫారన్ హీట్ వరకు 21వ శతాబ్దంలో పెరగవచ్చని ఐ.పి.సి.సి. పేర్కొంది. గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలను నియంత్రించినప్పటికినీ, అత్యంత వేడిమిని కలిగి వున్న సముద్రాలు, వాతావరణంలో అధిక కాలం మన గలిగి వుండే కార్బన్ డై ఆక్సయిడ్ మూలంగా 2100 వ సంవత్సరం తరువాత కూడా భూగోళపు ఉష్ణోగ్రత కొనసాగే అవకాశముంది.

ప్రస్థుత స్థాయిలో గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాల విడుదల కొనసాగితే, 2055 వ సంవత్సరం నాటికి, భూగోళం 4 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు వేడెక్కుతుందని 2009లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నిర్వహించిన అంతర్జాతీయ పర్యావరణ సదస్సులో బ్రిటన్ అధ్యయన విభాగం వివరించింది.

భూగోళంపై ఉష్ణతాపాన్ని తగ్గించాలంటే, గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలను నియంత్రించాలి. గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గరాలను తగ్గించడానికి కుదుర్చుకున్న ''క్యోటో ప్రొటోకాల్'' ఒప్పందం ప్రపంచంలోనే ప్రథమ అంతర్జాతీయ ఒప్పందం. ఈ ఒప్పందాన్ని 160 దేశాలు అంగీకరించాయి. ఈ ఒప్పందపు కాల పరిమితి 2012 వ సంవత్సరంతో అంతమయింది.

సహజవనరులను, జీవరాశులను, మానవాళిని కాపాడు కోవడం కోసం, జల, వాయు, కాలుష్యాలకు కారణమైన పరిశ్రమలను నియంత్రించాలి. ప్లాస్టిక్ సంచులు, రసాయనాలు, రసాయనిక క్రిమిసంహారకాల నిషేధించి, సాంప్రదాయ పద్ధతులననుసరించటం ద్వారా, గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను నియంత్రించవచ్చు. ఆ విధంగా వాతావరణ మార్పులను బలహీనపరచడం ద్వారా, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలి.

అమెరికా వంటి అగ్ర దేశాలు స్వలాభాపేక్షతో వాతావరణాన్ని కాలుష్య కారకాలతో విషపూరితం చేయటం మానుకొంటూ ప్రతి ఏటా గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను 3 శాతం మేరకు తగ్గించుకుంటూ వస్తే, భూగోళపు ఉష్ణతాపం అదుపులో ఉంటుంది.

యావత్ ప్రపంచం భయంకరమైన ప్రమాదంలో చిక్కుకొనివుంది. భూగోళపు ఉష్ణోగ్రతా ప్రభావాలు ఉధృతమవుతున్నాయి. భవిష్యత్‌లో మన భావితరాల వారి జీవితాలు ఎలా వుంటాయో అనూహ్యంగా వుంది.

మానవాళి మనుగడ కోసం అనైతిక స్వప్రయోజనాలకు తిలోదాకాలిచ్చి, వాతావరణ విషవలయం నుంచి మన తరం వారు ప్రపంచాన్ని తప్పించక పోతే, భావితరాల వారు మనలను క్షమించకపోగా, మనం చరిత్ర హీనులమవుతాం!

**- ఏ.వి. రాజా**

పథకాలపై అవగాహన
పెంచటానికో చిరుప్రయత్నం

# పథకానికి పది ప్రశ్నలు

## రాజీవ్ గాంధీ కౌమార బాలికల సాధికారత పథకం – సబల



**భారతీయ మహిళ తన సుదీర్ఘ ప్రస్థానంలో వివిధ దశల్లో వివిధ రకాల సమస్యలను ఎదుర్కొంటుంది. ప్రతి దశ కీలకమైనదే. అయితే, వీటన్నింటిలో యుక్త వయస్సు దశ మరీ కీలకమైంది. బాల్యం నుండి యవ్వనంలోకి మారే క్రమంలో అనేక శారీరక, మానసిక మార్పులు చోటు చేసుకుంటాయి. 11 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు ఉండే యుక్త వయస్సు బాలికల పోషణను, ఆరోగ్యాన్ని మెరుగు పర్చడానికి కేంద్ర ప్రభుత్వం 2010, డిసెంబర్ 14 'సబల' పథకం ప్రారంభించింది.**

**1. 'సబల' కార్యక్రమం మన రాష్ట్రంలో ఎన్ని జిల్లాలలో అమలులో ఉంది ?**

*జ.* మొత్తం '7' జిల్లాలలో అమలులో ఉంది అవి : విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, అనంతపురం, చిత్తూరు, ఆదిలాబాద్, మహబూబ్ నగర్‌లు.

**2. 'సబల' కార్యక్రమం ఏ శాఖ పరిధిలో అమలవుతుంది ?**

*జ.* మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పరిధిలోని సమీకృత శిశు అభివృద్ధి పథకం (ఐ.సి.డి.ఎస్.) క్రింద 'సబల' పథకం అమలు జరుగుతుంది. ఈ పథకం అమలుకు పట్టు కొమ్మలు 'అంగన్ వాడీ కేంద్రాలు'.

**3. ఈ పథకం అమలు విషయంపై ఎవరిని కలవాలి ?**

*జ.* అంగన్ వాడీ సూపర్ వైజరు, సి.డి.పి.ఓ., అంగన్‌వాడి కార్యకర్త లేదంటే హెల్ప్ లైన్ 1800 425 1096కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

**4. ఈ పథకం క్రింద లబ్ధిదారులకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరుతాయి ?**

*జ.*
- పౌష్టికాహార సంబంధ లబ్ధి.
- పౌష్టికాహారేతర సంబంధమైన లబ్ధి

**ఎ) పౌష్టికాహార పంపిణీ**

పాఠశాల పరిధిలో ఉన్న కిశోర బాలికలకు మధ్యాహ్న భోజన పథకం పాఠశాల బయట ఉన్న కిశోర బాలికలకు 'టేక్ హోమ్ రేషన్' క్రింద అనుబంధ పౌష్టికాహారం పంపిణీ జరుగుతుంది.

**బి) ఇతర సర్వీసులు**

- ఐరన్ ఫోలిక్ మాత్రలు
- హెల్త్ చెకప్‌లు, రిఫరల్స్
- పౌష్టికాహారం, ఆరోగ్య విద్య
- కుటుంబ సంక్షేమం, ఎ.ఆర్.ఎస్.హెచ్., చైల్డ్ కేర్ ప్రాక్టీసెస్
- జీవన నైపుణ్యాల విద్య
- ప్రభుత్వ సేవలు, కార్యక్రమాలు అందుబాటులోనికి తేవడం.
- బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలకు మళ్ళించడం
- 16-18 సంవత్సరాల లోపు పిల్లలకు వొకేషనల్ శిక్షణ.

**5. అంగన్ వాడీ కార్యకర్త 'సబల' పథకం అమలులో పాత్ర ఏమిటి ?**

*జ.* • అంగన్ వాడీ కార్యకర్త తన పరిధిలోని కిశోర బాలికలకు సంబంధించి ప్రాథమిక సమాచారాన్ని సర్వే ద్వారా సేకరించి, వివరాలను రిజిష్టరులో నమోదు చేయడం.

- మూడు మాసాల కొకసారి 'కిశోరి దివస్' కార్యక్రమాలను సఖి, సహేలీల సాయంతో నిర్వహించడం.
- కిశోర బాలికల 'ఆరోగ్య కార్డు'లను 'సఖి' సాయంతో నిర్వహించడం.
- సఖి, సహేలీల ద్వారా అంగన్ వాడీ కార్యకర్త రేషన్ (న్యూట్రిషన్ ప్రొవిజన్) పంపిణీ చేయడం.
- కిశోర బాలికల చిరునామాల సమీకరణకు ఇంటింటికి వెళ్ళడం (ఇద్దరు, లేదా ముగ్గురు కిశోర బాలికలను వెంట పెట్టుకుని)

• ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆరోగ్య సంబంధ కార్యక్రమాలు నిర్వహించేటపుడు వారికి సహాయంగా ఉండడం. ఉదా : ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ, నులి పురుగుల నివారణ మందుల పంపిణీ మొదలగునవి.

• కిశోర బాలికలను 'సబల' సేవలు వినియోగించుకోనేలా ప్రోత్సహించడం.

• సఖి, సహేలీల ఎంపికలో కిశోర బాలికలకు సహాయ పడడం.

• అంగన్ వాడీ హెల్పర్‌పై అన్ని కార్యక్రమాల్లో అంగన్ వాడీ కార్యకర్తకు సహాయపడాలి.

**6. సఖి, సహేలీలు ఎవరు ?**

**జ.** అంగన్ వాడీ కేంద్రం పరిధిలోని కిశోర బాలికల నుండి '15-25' మందితో ఒక గ్రూపు ఏర్పాటు చేస్తారు. ఈ గ్రూపుని 'కిశోర సమూహం' అంటారు. ఈ కిశోర సమూహానికి ముగ్గురు సహాయకులుంటారు. వారిలో ఒకరు నాయకురాలు. ఆమే సఖి. మరో ఇద్దరు సఖికి సహాయకులు ఉంటారు. వారే సహేలీలు.

సఖి, సహేలీలు ఒక సంవత్సరానికి ఎంపిక కాబడతారు. రోటేషన్ పద్ధతిలో ఈ ముగ్గురు తలా నాలుగు నెలలు సఖిగా వ్యవహరిస్తారు.

**7. సఖి, సహేలీల పాత్ర ఏమిటి ?**

**జ.** ప్రాజెక్టు, సెక్టారు స్థాయిలో సఖి, సహేలీలకు శిక్షణ నిస్తారు. వీరు శిక్షణ పొందిన తదుపరి వారి కిశోర సమూహంలోని కిశోర బాలికలకు శిక్షణ నివ్వాలి. అంతేకాక,

• కిశోర బాలికలందరూ 'సబల' కార్యక్రమంలో నమోదయ్యేలా ప్రోత్సహించడం.

• అంగన్ వాడీ కేంద్రంలో జరిగే రోజు వారీ కార్యక్రమాలతో పాటు 'కిశోరీ దివస్' నాడు జరిగే కార్యక్రమాలలో తామూ ముఖ్య భూమిక పోషించడం.



• 'సబల' రిజిష్టర్ నిర్వహించడంలో అంగన్ వాడీ వర్కర్‌కి సహాయ పడడం.

• టేక్ హోమ్ రేషన్ పంపిణీలో సహాయ పడడం చేయాలి.

**8. కిశోర బాలికలకు చెందిన 'ఆరోగ్య కార్డు' లో ఏఏ అంశాలుంటాయి?**

**జ.** ఒక్కో కిశోర బాలికకు ఒక్కో ఆరోగ్య కార్డు నిర్వహిస్తారు. ఈ కార్డులో...

- బరువు
- పొడవు
- శరీర మాస్ సూచిక (బరువు కేజీలలో / పొడవు మీటర్లలో)
- ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ
- నులి పురుగుల తొలగింపు మందులు
- నివేదన సేవలు (రిఫరల్ సర్వీసెస్)
- రోగ నిరోధకాలు (ఇమ్యూనైజేషన్)

సఖి ఈ కార్డులోని అంశాలను నింపి సంతకం చేయాలి. అంగన్ వాడీ కార్యకర్త కౌంటర్ సంతకం చేయాలి.

**9. టేక్ హోమ్ రేషన్ ఎన్ని రోజులకు పంపిణీ చేయాలి ? ఎవరికి అందుతుంది ?**

**జ.** సంవత్సరానికి 300 రోజులకు టేక్ హోమ్ రేషన్ ఇవ్వాలి. ఈ రేషన్‌లో 600 కాలరీలు, 28 నుండి 20 గ్రాముల ప్రొటీన్స్, 8 మైక్రోన్యూట్రియంట్స్ ఉంటాయి.

11-15 సంవత్సరాల మధ్య బడికి వెళ్లే కిశోర బాలికలకు, 16-18 సంవత్సరాల లోపు కిశోర బాలికలందరికీ ఈ టేక్ హోమ్ రేషన్ అందిస్తారు.

**10. 'సబల' పథకం లక్ష్యాలు ?**

**జ.** • కిశోర బాలికలు స్వీయ అభివృద్ధి, సాధికారికత సాధించడం.

• వారి పోషణ, ఆరోగ్య పరిస్థితిని మెరుగు పరచడం.

• ఆరోగ్యం, పరిశుభ్రత, పోషణ, పునరుత్పత్తి వ్యవస్థ, లైంగిక ఆరోగ్యం మొదలైన అంశాల పట్ల అవగాహన కల్గించడం.


• గృహ ఆధారిత నైపుణ్యాల వృద్ధి, జీవిత నైపుణ్యాల కల్పన, వృత్తి నైపుణ్యాల అభివృద్ధికై యన్.యస్.డి.పి.తో కలసి కృషి చేయడం.

• బడి బయట ఉన్న కిశోర బాలికలను నియత విద్య, అనియుత విద్యలలోనికి తీసుకురావడం.

• ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రభుత్వ సర్వీసులు, అనగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం, పోస్ట్ ఆఫీస్, బ్యాంకు, పోలీస్ స్టేషన్ మొదలైనవాటి గురించి తగిన సమాచారం అందించడం.

**- సి.ఎం.పి.**

# బిఎన్‌విల సేవాతత్పరతకు నిలువెత్తు నిదర్శనం ఈ గ్రంథాలయం





## మన గ్రామ అభివృద్ధి మన చేతుల్లోనే

**మారుద్దామా మన గ్రామాన్ని, ఇలా !**

**జ్ఞానం ఒక శక్తి. ఒక యుక్తి. విశ్వజనీన శాస్త్ర సాంకేతిక, సాహిత్య, వ్యాకరణ, తర్క, మీమాంస, చారిత్రక, భౌగోళిక, అధ్యాత్మిక ఇలా ఒకటా రెండా ప్రతి అంశాన్ని మనం పుస్తకాల ద్వారానే తెలుసుకుంటాం.**

గ్రంథాలయం విజ్ఞానాన్ని వికసింపచేసే కేంద్రం. పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు, ప్రబంధాలు, కథలు, జానపద సాహిత్యం, కథాసాహిత్యం, బాలసాహిత్యం ఇలా అనంతమైన జ్ఞాన సంపదని తన లోగిలిలో దాచుకుని స్వాగతం పలికే విజ్ఞానాలయం గ్రంథాలయం. ఇలాంటి వాటిని ఏర్పాటు చేసి పదుగురికి జ్ఞానం అందించాలని, పఠనాసక్తి పెంచాలన్న సదుద్దేశంతో పలువురు యువత, సంస్థలు నడుం కట్టాయి. ప్రత్యేకంగా గదులను వేల రూపాయలతో ఏర్పాటు చేసి, పుస్తకాలు కొనుగోలు చేసి, వివిధ రకాల పత్రికలను గ్రామీణులకు అందుబాటులోనికి తెచ్చారు.

దాంతో చిన్నారులు, విద్యార్థుల నుంచి ముదుసలి వరకు పఠనాభిరుచి పెంచుకుని అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. గ్రంథాలయాలను ప్రభుత్వమే సరిగ్గా నిర్వహించలేని ఈ రోజుల్లో గ్రామ అభివృద్ధికి కంకణం కట్టుకున్న భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సేవకు నిలువెత్తు నిదర్శనం గ్రంథాలయాలను నెలకొల్పడం.

కడప జిల్లా, కలసపాడు మండలం, తెల్లపాడుకు చెందిన భారత్ నిర్మాణ్ వాలంటీర్ పి. రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అక్కడ యువకులంతా ఒక్కటయ్యారు. తమ ఊరి పిల్లలకు విజ్ఞానాన్ని అందించాలని నిర్ణయించుకున్నారు. గ్రంథాలయ ఏర్పాటుకు సిద్ధమయ్యారు. అయిదేళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనాన్ని శుభ్రం చేశారు.

దాతలు, విద్యావంతులు, గ్రామస్తుల సహకారంతో యువకులు సరస్వతీ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. వివిధ రకాల పుస్తకాలు, విజ్ఞాన దీపికలను ఏర్పాటు చేశారు. రూ. 15 వేలకు పైగా విలువ చేసే వివిధ రకాల పుస్తకాలను కొనుగోలు చేశారు. మూడు దిన పత్రికలు తెప్పిస్తున్నారు. ప్రతి రోజూ 40 మందికి పైగా పాఠకులు గ్రంథాలయాన్ని సందర్శిస్తున్నారు.

### గ్రంథాలయంలోని పుస్తకాలు

పెద్దబాల శిక్ష, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వర్తమాన వ్యవహారాలు, భారత చరిత్ర, ఐబీపీఎస్, డైట్, ప్రవేశ పరీక్ష బిట్ బ్యాంక్, డీఎస్సీ తదితర పుస్తకాలు, అధ్యాత్మికం, సామాజిక నీతి, వివేకానందుని జీవిత చరిత్ర, యోగాసనాలు, ఆయుర్వేదం తదితర పుస్తకాలు సిద్ధంగా ఉంచారు. 'ఆదర్శం', 'మేలుకో' అనే రెండు పుస్తకాలను పెట్టి, నిత్యం దినపత్రికల్లో వచ్చే స్ఫూర్తిదాయక కథనాలు, యువత విజయాలు, సేవా కార్యక్రమాల కథనాలను అందులో ఉంచుతున్నారు. నీతి వాక్యాలతో మరో పుస్తకం తయారు చేశారు.

*- ఏ.వి. సురేష్ కుమార్,*
*జిల్లా పరిషత్ శిక్షణా మేనేజర్, కడప జిల్లా*



Sthanika_BW_Oct13.indd 32 17/10/13 5:25 PM

# బిందు సేద్యం – ఉపయోగాలు, పద్ధతులు

**నీరు ప్రకృతి ఇచ్చిన వరం మాత్రమే తప్ప, శాశ్వతం కాదు. ఎల్లకాలం ఉచితంగా కూడా లభించదు. ప్రపంచపు నీటి నిల్వలు, లభ్యమయ్యే అవకాశాలు వేగంగా అంతరిస్తున్నాయి. ఈ పరిస్థితులలో ఊరట నివ్వగల ఏకైక మార్గం బిందు సేద్య విధానం. మట్టి, నీరు, పంట నేల స్వభావం, వ్యవసాయ వాతావరణ పరిస్థితుల మధ్య గల సంబంధాలను విస్తృతంగా గమనించి, వీటిన్నిటికి సరిపడే, ఆర్థికంగా కూడా అనుకూలమైన విధానాన్ని రూపొందించటం జరిగింది. అదే బిందుసేద్యం. దీని వల్ల మొక్కలకు వత్తిడి కలుగకుండా వాటి వేళ్ళ ప్రాంతానికి నియమిత మోతాదులో నీటిని ప్రతి మొక్కకు విడివిడిగా క్రమమైన సమయ, విరామాలతో అందించటం జరుగుతుంది. అదే సూక్ష్మ సేద్య విధానం. దీనివలన మొక్కకు అధికనీరు కానీ లేక తక్కువ నీరు కానీ అందదు. పంటకు సరిపడా మోతాదు నీరు మాత్రమే లభిస్తుంది. రైతులకు నిరంతరం పొలంలో ఏర్పాటు చేయబడిన బిందుసేద్య వ్యవస్థ నిర్వహణకు తగిన శిక్షణ కూడా అవసరం. తత్ఫలితంగా పూర్తిస్థాయిలో ఎక్కడి కక్కడ ప్రత్యేకంగా, సమర్ధవంతమైన జీవితకాల బిందుసేద్య విధానం లభిస్తుంది.**

ఈ బిందు సేద్యం వలన నీరు పొదుపు చేయటం, తద్వారా త్వరగా భూసారం అంతమవకపోవటం, కష్టసాధ్యమైన నీటి సాగు విధానానికి స్వస్తిపలకటం, కూలీలకు అయ్యే ఖర్చు తగ్గటం, ఎరువుల వాడకం తగ్గటం మొదలైనవి జరిగి అంచెలంచెలుగా అధిక దిగుబడు లతో శాశ్వత లాభాలుగా మారుతాయి. ***బిందుసేద్య పరికరాలను తమ పొలాల్లో అమర్చుకోవాలి. బిందు సేద్యపు రైతులందరూ ఆనందమయ కుటుంబాలతో జీవించే మార్గము సుగమము చేసుకోవాలి.***

### డ్రిప్, స్ప్రింక్లర్ల వలన లాభాలు

బిందు సేద్య విదానంలో ఈ కింద పేర్కొన్న విధానాలు పాటించాలి.

**1. శాండ్ ఫిల్టర్ పద్ధతి :**

**బ్యాక్ వాష్ పద్ధతి :** ఈ పద్ధతిలో మొదట ట్యాంకులో సామాన్యంగా పై నుండి నీరు ప్రవహిస్తుంది. రెండవ ట్యాంకులో నీటి ప్రవాహం వేరుగా అనగా క్రింది నుండి ప్రవహిస్తుంది. బ్యాక్ వాష్ వాల్వు తెరువబడి ఉంటుంది.

దీనివలన నీటి ప్రవాహంపై వత్తిడి మూలంగా ఫిల్టర్‌కి నీరు ప్రవహించేటప్పుడు ఫిల్టర్లోకి తిరిగి ప్రవహించినప్పుడు ఇసుకలో ఉన్న చెత్తా చెదారం నీటిపై తేలుతాయి. ఇలా ఇసుక శుభ్రం అవుతుంది. దీని తరువాత బ్యాక్ వాల్వును మూసి వేయాలి.


**రసాయనిక పద్ధతి :** ఈ పద్ధతిలో యాసిడ్, క్లోరిన్ లేదా మైలతుత్తం (కాపర్ సల్ఫేట్) లాంటి రసాయనిక పదార్థాలను ఉపయోగించి కూడా శాండ్ ఫిల్టరును శుభ్రపరచవచ్చును. రసాయనాలను వెంచురీ ద్వారా ఫిల్టర్‌లోకి ప్రవేశ పెట్టాలి. ఆ నీటిలో కరిగి మలిన పదార్థాలను నిర్మూలించడానికి సహాయపడును.

**మాన్యువల్ పద్ధతి :** ఈ పద్ధతిలో ప్రతి వారం ఒక సారి ఫిల్టర్ మూత తెరిచి లోపలవున్న ఇసుకను చేత్తో నలుపుతూ మలిన పదార్థాలను బయటకి పార వేయాలి.

స్క్రీన్ ఫిల్టర్ - శుభ్రపరచటం : దీని కోసం స్క్రీన్ ఫిల్టర్ మూత తెరచి లోపలి ఫిల్టర్ ఎలిమెంట్ (ఇనుపవల) శుభ్రం చేయాలి.

### వివిధ భాగాలు గల. పి.సి. పైపును శుభ్రపరచటం.

పి.సి. పైపుపై సబ్ మెయిన్‌కు ప్రత్యేకమైన ఫ్లష్ వాల్వు బిగించబడి



ఉంటుంది. ప్రతి 8 లేక 15వ రోజున దీన్ని తెరచి పూర్తి వేగంతో నీటిని వదలినట్లయితే, లోపల పేరుకున్న మలిన పదార్థాలు ప్రవాహంతో పాటు బయటికి వస్తాయి.

### లేటరల్స్ శుభ్రపరచటం

లేటరల్స్ ట్యూబుల శుభ్రం కోసం ఎండ్ క్యాప్ లేదా ఎండ్ ప్లగ్ ఉంటుంది. దీన్ని ప్రతివారం లేదా 15 రోజులకు ఒకసారి తెరచి నీటి ద్వారా పూర్తి ప్రెజర్‌తో నీటి లోపలికి పంపినట్లయితే, మలిన పదార్థాలు తెరచి ఉన్న ఎండ్ ప్లగ్ ద్వారా బయటికి వస్తాయి.

### డ్రిప్, స్ప్రింక్లర్ల వలన లాభం

- పంట దిగుబడిలో నమ్మశక్యం కాని లాభం, అంటే 235% లాభం పొందవచ్చు.
- నీటి ఆదా 70% ఉంటుంది. ఇది సూక్ష్మ సేద్యానికి కీలకమైన నీటిని ఆదా చేస్తుంది.
- పంట ఎదుగుదల ఆశించిన రీతిగా ఉండి ఆరోగ్యవంతమైన, పంట తొందరగా పక్వానికి వస్తుంది.
- ఎరువుల వినియోగంలో తగ్గుదల 30% వరకు ఉంటుంది.
- ఎరువుల కొనుగోలులో మిగులు, కలుపు తీతలో మిగులు ఉంటుంది. కూలీల కొరత పరిష్కరింపబడుతుంది.
- సస్యరక్షణ మందులు కూడా బిందు సేద్యం ద్వారా ఇవ్వవచ్చు.
- కీటకాలు, చీడల బారి నుండి విముక్తి కలుగుతుంది.
- ఎగుడు, దిగుడు భూమి, క్షార భూములు, నీటి ముంపు ప్రాంతం, ఇసుక కొండ ప్రాంతాలలో కూడా ఈ పద్ధతుల ద్వారా లాభసాటిగా పంటలు పండించవచ్చును.

**రైతులు గుర్తించుకోవలసిన ఇతర విషయాలు :**

- పి.సి. పైప్, లేటరల్ జాయింట్ దగ్గర లీకేజి అయి, నీరు కారినట్లయితే, జాయింట్‌లను సరిచేసుకోవాలి.
- లేటరల్స్ తల భాగం దాకా నీరు రాకపోతే లేటరల్స్ అన్నింటిని పరిశీలించి సరిచేసుకోవాలి.
- లేటరల్ ఎండ్ ప్లగ్‌ని తీసినపుడు తెల్లని లేదా రంగు మట్టి బయటికి వచ్చినట్లయితే, లేటరల్స్‌ను సరిగ్గా ఫ్లష్ చేసి కెమికల్ ట్రీట్ మెంటు ఇవ్వాలి.
- డ్రిప్పరు పై భాగంలో లేటరల్స్ నుంచి నీరు కారినట్లయితే డ్రిప్పర్ జాయింటర్ సరి చేసి, తిరిగి పంచ్ చేసి గూఫ్ ప్లగ్‌ని కరిగించి డ్రిప్పర్‌ను అక్కడ అమర్చాలి.
- ప్రెజర్ గేజ్‌లో సరియైన ప్రెజర్‌ని మాత్రమే ఉంచాలి.
- ఎయిర్ రిలీజ్ వాల్వులో నుంచి నీరు కారుతుంటే రింగ్ తిరిగి పెట్టటం కానీ లేదా మరో రింగ్ మార్చి పెట్టాలి.
- పశు పక్ష్యాదులతో లేటరల్స్‌కు హాని కలుగకుండా వాటిని నేలలో 3 నుంచి 4 అంగుళాల లోతుకు పరచి కప్పివేయాలి.

- **టి.యం.కె. గాంధీ,** జూనియర్ ఫాకల్టీ, సిఎన్ఆర్ఎం, అపార్డ్

# ఆహారంలో కల్తీ - ఆరోగ్యంపై ప్రభావం... తీసుకోవలసిన జాగ్రత్తలు

**ఆహార పదార్థాలలో కల్తీ జరుగుతున్నట్లు తరచూ వింటున్నాము. చట్టాలు వున్నాయి వీటిని అమలు జరిపే ప్రభుత్వ యంత్రాంగం వుంది. కాని ప్రజలు కూడా హక్కులతో బాటు తమ బాధ్యతలను గుర్తించి ప్రభుత్వ యంత్రాంగానికి తమ సహాయ సహకారాలందించాలి. అసలు కల్తీ ఎలా జరుగుతుంది, ప్రభుత్వ యంత్రాంగం ప్రజల సహకారంతో దీన్ని ఏ విధంగా నిర్మూలించాలి. అనే విషయాన్ని పరిశీలిద్దాం.**

### ఆహార పదార్థాలలో కల్తీ

ఆహార పదార్థాలలో మూడు కారణాలవల్ల కల్తీ జరుగుతుంది. 1) వర్తకుల మోసం 2) ప్రజల అజాగ్రత్త వల్ల 3) ప్రజల అజ్ఞానము వల్ల. వివరాల్లోకి వెళదాం.

**1. వర్తక మోసం వల్ల కలిగే కల్తీ**

- పాలల్లో నీళ్ళు కలుపుట
- పాలకోవాలో మైదాపిండి
- నెయ్యిలో వనస్పతి
- కాఫీ పొడిలో చికోరి లేక కాల్చిన చింతగింజల పొడి
- టీ పొడిలో ఒకసారి వాడి ఎండబెట్టి రంగు వేసిన పొడి
- మిరపపొడిలో రంగు కలిపిన తవుడు లేక రంపపు పొట్టు
- శనగపప్పులో లంకపప్పు
- వంట నూనెలలో చౌకబారు నూనెలు
- తేనెలో పంచదార పాకం (బెల్లం పాకం)
- మిరియాలలో బొబ్బాయి గింజలు

ఇటువంటి కల్తీలు సాధారణంగా రుచి, వాడుక అనుభవముల వల్ల తెలుసుకోవచ్చు. అటువంటి కల్తీ జరిగినట్టు అనుమానం కలుగగానే ప్రజల వ్రాతపూర్వకంగా ప్రభుత్వ యంత్రాగం చర్య తీసుకుంటుందో లేదో సంశయంతో నిర్లక్ష్యము చేయకుండా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌కుగాని, పంచాయితీ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కుగాని, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు గాని తెలియబరచాలి. అట్టి కంప్లైంటు యొక్క కాపీలు ఫుడ్‌హెల్త్ ఆథారిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్, నారాయణగూడ, హైదరాబాద్ పంపాలి.

బాగా కళాయిపెట్టని పాత్రలో వండిన ఆహారము నిలువ వుంచినా ప్రాణాపాయం.

**2. అజాగ్రత్త వల్ల కలిగే కల్తీలు**

- ఆహార పదార్థాలు కలుషితమై ప్రజలను ప్రమాదాలకు గురి చేసిన ఎన్నో ప్రమాదకరమైన సంఘటనలు తరచూ, వార్తా పత్రికలో చదువుతూ వుంటాం. వీటిలో చాలా భాగం కళాయి సరిగా పెట్టని రాగి, ఇత్తడి ప్రాతలలో పులిహోర, పలావు, పులుసు వంటివి వండుట వల్ల అంతే కాకుండా ఇటువంటి పాత్రలలో నిమ్మరసం, నిమ్మ ఉప్పు, చింతపండు, చింతకాయలు, మామిడికాయ ముక్కలు వంటి ఆమ్లజనితాలైన దినుసులు వేసిన పదార్థాలు వండటం వల్ల కూడా ఇట్టి ప్రమాదాలకు ఆస్కారముంది. అందువల్ల అటువంటి పాత్రలకు దట్టంగా కళాయి పట్టించుకోవాలి.

  న్యూలు బయట సాధారణంగా తినుబండారాలు మూతమూయకుండా రోడ్ల మీద అంగళ్ళలోనూ పెట్టి అమ్ముతుంటారు. వాటి మీద దుమ్ము, ఈగలు సూక్ష్మక్రిములు వాలి. అంటు రోగాలకు దారి తీస్తాయ. వీటిని కొని తినకుండా పిల్లలను పెద్దలు హెచ్చరించాలి.
- వంట వండేటప్పుడు వంట అయిన వెంటనే పదార్థాల మీద మూతలు పెట్టి వుంచాలి. పిల్లులు, నళికెళ్ళపాములు, జిర్రెలు ఆహార పదార్థాలలో పడి ఉడికి ప్రమాదాలు తెచ్చిన సందర్భాలున్నాయి.
- వ్యవసాయదారులు, క్రిమీ కీటక సంహరులయిన ఎండ్రిన్ మాలాథియాన్ వంటి విషపదార్థాలను కొని తెచ్చిన గోనె సంచులను, అవి ఖాళీ అయిన వెంటనే వాటిని పరిశుభ్రంగా దులిపి నీటిలో బాగా నానబెట్టకుండా వచారీ దుకాణందారులకు విక్రయిస్తారు. ఆ సంచుల్లో గోధుమపిండి వంటి వాటిని వర్తకులు నింపి ప్రజలకు అమ్మగా ఆ కలుషిత ఆహారం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నవి. ఇది వ్యవసాయదారులు, వర్తకులూ గుర్తించవలసిన హెచ్చరిక.

మనం సాధారణంగా వాడే ఆహార పదార్థాలను కల్తీ చేయడం కోసం వాటిలో ఉపయోగించే పదార్థాలు కలవడం వల్ల ఆరోగ్యానికి కలిగే నష్టాలను దిగువ తెలియజేయడం జరిగింది.

## కల్తీ పదార్థాల వలన కలిగే వ్యాధులు

| ఆహారపదార్థాలు | కల్తీకై ఉపయోగించే పదార్థాలు | నష్టాలు |
|---|---|---|
| 1. ఆవనూనె | బ్రహ్మదండి గింజనూనె | కంటిచూపు పోవడం, గుండెజబ్బులు, చెమ్మ బెరిబెరీని పోలిన పారిశ్రామిక జలోదరం కాలేయానికి హాని కలగడం క్యాన్సర్‌కు దారితీసే కార్సినోజినల్ వ్యాధులు |
| 2. కొబ్బరినూనె, బాదంనూనె వంటనూనెలు | ఖనిజాల నూనె | |
| 3. కంది, శనగపిండి<br>పసుపు | కేసరిపప్పు<br>పసుపుపచ్చని లెడ్‌క్రోమెట్ | పక్షవాతం<br>రక్తహీనత, మూర్ఛరోగం, గుడ్డితనం |
| 4. తీపి వస్తువులు<br>పానీయలు ఆల్కహాలు | తినదగని రంగులు<br>విషపూరితమైన పదర్థాలు | కాలేయానికి హాని క్యాన్సర్ |
| 5. మిరపపొడి | రంపంపొట్టు మొదలైనవి | గుడ్డితనం మరణం |
| 6. ఇతర మసాలా దినుసులు | | ఉదరకోశవ్యాధులు |

### కల్తీని కనుగొనే పరీక్షలు

ఆహారపదర్థాల కల్తీని కనుగొనడానికి కొన్ని చిన్న పరీక్షలు ఉన్నాయి. ఆహార పదార్థాలు స్వచ్ఛంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకోవడానికి ఈ పరీక్షలు సహాయపడతాయి. కానీ ఆహార పదార్థాలను ప్రయోగశాలలో శాస్త్రీయ పరంగా పరీక్ష జరపవలసిన అవసరముంది ప్రయోగశాలల నుండి అందిన నివేదిక ఫలితాల ఆధారంగా మాత్రమే ఆ వ్యాపారస్తులపై కేసు పెట్టవచ్చు మన మామూలు ఆహార పదార్థాలు ఏవైనా కల్తీ అయ్యాయో, లేవో అనే విషయాన్ని చిన్న పరీక్షలు తెలియజేస్తాయి. అటువంటి పరీక్షలలో కొన్నింటిని దిగువ చూపడం జరిగింది. ఈ పరీక్షలను ఇంట్లోనే సులభంగా చేయవచ్చు.

| ఆహారపదార్థం పేరు | కల్తీ ఉపయోగించే పదార్థాలు | కల్తీనుగొనడానికి పరీక్ష |
|---|---|---|
| 1. నెయ్యి, వెన్న | వనస్పతి | ఒక టీస్పూన్ నిండా కరిగిన నెయ్యి లేదా వెన్నను అంతే పరిమాణం గల హైడ్రోక్లోరిక్ ఒక నిమిషం పాటు బాగాకలపండి దానిని ఆ తర్వాత అయిదు నిమిషాల పాటు ఉండనివ్వండి. పరీక్ష నాళిక క్రింద భాగంలో ఎరుపు రంగు కనబడినట్లయితే నెయ్యి లేదా వెన్నలో వనస్పత్తి కల్తీ అయిందన్నమాట. |
| 2. నూనెలు | | |
| ఎ. వంటనూనె | అర్జిమెన్ నూనె<br>బ్రహ్మదండి గింజల నూనె | శాంపిల్ నూనెకు గాఢనత్రజని ఆమ్లాన్ని కలిపి జాగ్రత్తగా కలపండి. ఆమ్లంపై భాగంలో ఎరుపు రంగులేక ఇటుక ఎరుపు రంగు కనబడితే దానిలో బ్రహ్మదండి నూనె వున్నట్లు తెలుస్తుంది. |
| బి. కొబ్బరి నూనె | ఖనిజాల నూనె | 2 మి.లీ. వంటనూనె తీసుకోండి. దానికి అంతే పరిమాణం గల ఎన్ / 2 ఆల్కహాలిక్ పొటాష్‌ను కలపండి. మరిగే నీటిలో ఈ రెండింటని కలపండి, దానికి 10 మి.లీ నీటని కలవండి. ఈ మిశ్రమము మడ్డిగా అయినట్లుయితే, ఖనిజాల నూనె వున్నట్లు తెలుస్తుంది. |
| సి. వంటనూనె | ఆముదం | కొంచెం నూనెను పరీక్ష నాళికలోని పెట్రోలియం ఈథర్‌లో పోయండి దానిని ఐస్ ఉప్పు మిశ్రమంలో ఉంచండి. అయిదు నిమిషాల లోపల మడ్డి ఏర్పడినట్లయితే ఆముదం వున్నట్లు తెలుస్తుంది. |
| 3. పాలు | నీరు | లాక్టోమీటర్ రీడింగ్ 1.026 కంటే తక్కువగా వుండరాదు. పాత్రలో నుండి ఒక పాల చుక్కను మీటర్ పైన నిటారు ప్రదేశంపై వుంచండి. అది తెల్లని మరకను చేస్తూ క్రిందికి జారిపోతుంది. |

| | | |
|---|---|---|
| | గంజి పిండి పదార్థాలు | కొన్ని పాలు తీసుకుని దానిలో టింక్చర్ అయోడిన్‌ను కలపండి. నీలిరంగు పైకి నూనె వున్నట్లు తెలుస్తుంది. పిండి పదార్థములు కలిపారని అనుకోవచ్చును. |
| 4. పప్పు పదార్థాలు | | |
| ఎ. కందిపప్పు | కేసరి పప్పు | సుమారు 10గ్రా కందిపప్పు 50.మి.లీ. సజల హైడ్రోక్లోరిన్ ఆమ్లమును వేసి కలిపి వాటర్ బాత్‌లో 15 నిముషముల సేపు వేడి చేయవలెను, ఎరుపు రంగు కనబడినట్లయితే కల్తీ ఉన్నట్లు తెలుస్తుంది. |
| | మిఠాయిరంగు | కొంచెము కందిపప్పు తీసుకొని కొద్దిగా గాఢ హైడ్రోక్లోరిక్లామము కలపండి, వైలేట్ రంగు మోటానిక్ ఎల్లో నీరు కలిపినా కూడా రంగు అలాగే నిలబడితే కల్తీ ఉన్నట్లు తెలుస్తుంది. |
| 5. మసాలా ద్రవ్యాలు | | |
| ఎ. పసుపు పొడి | జొన్నగోధుమ, కర్రపెండలం, లెడ్‌క్రొమేట్ | పసుపు పొడి యొక్క పిండి పదార్థపు కణములు ప్రత్యేక ఆకృతి కలిగి పసుపు పచ్చగా ఉంటాయి. ఇతర పిండి పదార్థాపు కణములు వేరు వేరు ఆకృతులు కలిగిఉంటాయి. బియ్యం పిండి ఇతర పదార్థములతో కలిపినట్లయితే మైక్రోస్కోప్ ద్వారా పరీక్షించి తేలికగా తెలుసుకొనవచ్చును. కొద్దిగా పసుపుపొడి పరీక్షనాళికలో వేసి దానికి 1:7 సల్ఫ్యూరికి ఆమ్లమును వేసి ఒకటి రెండు చుక్కలు, ఆల్కహాలులో కలిపిన 0.1% డైఫినైల్ కార్బజైడ్ వేయండి. వైలెట్ రంగు వచ్చినట్లయితే పసుపుపొడి ఉన్నట్లు తెలుస్తుంది. |
| బి. పసుపు, కారము కర్రీపౌడర్ | కృత్రిమ రంగులు | కొంచెము పొడిని తీసుకొని ఈథర్‌లో వేసి సల్ఫ్యూరి క్లామము కలపండి ఎరుపు రంగు కనబడినట్లయితే పదార్థంలో కల్తీ ఉన్నట్లు తెలుస్తుంది. కొంచెము నీరు కలిపిన తరువాత కూడా రంగు పోకుండా నిలిచి ఉన్నట్లయితే రంగు కలిపారని తెలుస్తుంది. |
| సి. కారము, ధనియాలపొడి, రంపపుపొట్టు పసుపు మొదలైనవి. | మెత్తటి తవుడు | కొద్దిగా పొడిని నీటిలో వేయండి. తవుడు మరియు రంపపు పొట్టు నీటిపై తేలుతాయి. |
| డి. మిరపపొడి | ఇటుకల పొడి, ఇసుక ధూళి | ఒక బీకరులో క్లోరోఫామ్, కార్బన్ టెట్రాక్లోరైడ్ తీసికొని దానికి కొద్దిగా మిరపపొడిని కలపండి. ఇటుకల పొడి, ఇసుక ధూళి ఉన్నట్లయితే బీకరు అడుగు భాగమున్న వచ్చి చేరతాయి. |
| ఇ. ధనియాల పొడి | గుర్రపు లద్దె | కొద్దిగా ధనియాల పొడిని నీటిలో వేయండి. గుర్రపు లద్దె, పేడ నీటిలో తేలుతాయి. |
| ఎఫ్. మిరియాలు | బొప్పాయి గింజలు | ఒక గాజు బీకరులో కొంచెము మిరియాలు తీసికొని దానిలో నీరు పోయండి. మిరియాలు బీకరులో అడుగునకు, బొప్పాయి గింజలు నీటిపై భాగమునకు తేలతాయి. |
| 6. పిండి పదార్థాలు | | |
| ఎ. గోధుమ పిండి | ఇసుక, ధూళి<br>- | కొంచెం పిండికి 10 మి.లీ కార్బన్ టెట్రాక్లోరైడ్‌ని కలపండి. కొంతసేపటికి పరీక్ష నాళిక అడుగు భాగములో ఇసుక, ధూళి చేరుతుంది. |
| | చాక్‌పొడి | కొంచెం గోధుమ పిండిని చిన్న గాజు పాత్రలో తీసికొని దానిలో కొంచెము గాఢ హైడ్రోక్లోరికామ్లము వేయండి. పిండిలో చాక్‌పొడి ఉన్నట్లయితే పాత్రలో బుస బుసమని పొంగు కనిపిస్తుంది. |
| బి. శనగపిండి | కేసరపిండి | కొంచెము పిండిని పరీక్ష నాళికలో తీసుకుని దానికి 50 మి.లీ. సజల హైడ్రోక్లోరికామ్లమును కలిపి 15 నిమిషాములు వేడి చేయండి. గులాబి రంగు నుండి ఎరుపు రంగు పరీక్ష నాళికలో కనిపించనట్లయితే శనగపిండిలో కేసరిపిండి కల్తీ కలిసినదని చెప్పవచ్చును. |

| | | |
|---|---|---|
| 7. అగ్‌మార్క గుర్తింపులేని వ్యవసాయ సంబంధిత ఉత్పత్తులు : | | |
| ఎ. కాఫీ | చికోరి | ఒక గ్లాసులో నీరు తీసుకొని కాఫీపొడి కొద్దిగా చల్లండి. కాఫీ పొడుము నీటిమీద తేలుతుంది. చికోరి ఉన్నట్లయితే నీటికి బ్రౌన్ రంగు వదులుకుంటూ క్రిందికి దిగటం కనిపిస్తుంది. |
| | వేయించిన ఈత గింజలు చితగింజల పొడి | కొద్ది కాఫీ పొడిని ఫిల్టరు పేపరు మీద 1% సోడియం కార్బనేట్ ద్రావణమును చల్లండి. ఈతగింజలు పొడిగాని, చింతగింజల పొడిగాని ఉన్నట్లయితే ఫిల్టర్ మీద ఎరుపు రంగు కనిపిస్తుంది. |
| బి. టీపొడి తేయాకుపొడి | చిన్న చిన్న ఇనుపరజను ముక్కలు | కొంచెము టీపొడిని కాగితముపై పోసి చిన్న అయస్కాంతమును కాగితము క్రింద ఉంచండి. ఇనుప రజను అయస్కాంతము వద్దకు ఆకర్షింపబడుతుంది. దానిని బట్టి టీపొడి ఇనుపరజనుతో కల్తీ చేయబడిందని తెలుస్తుంది. |
| సి. వక్కపొడి | రంపపు పొట్టు | కొంచెము పదార్థమును పరీక్షనాళికలో తీసికొని దానిలో నీరు కలిపిన రంపపు పొట్టులాంటి పదార్థము నీటి పైన తేలుతుంది. |
| డి. సుగంధ ద్రవ్యాలపొడి | ఇసుక, ధూళి, మట్టి | కొంచెము పదార్థమునకు 10 మి.లీ కార్బన్ టెట్రాక్లోరైడ్‌ను వేసి 10 నిమిషాలు బాగుగా కలిపి గమనించండి. 5 నిమిషాలు తరువాత పరీక్షనాళిక అడుగు భాగములో ఇసుక, దుమ్ము, మట్టి కనిపిస్తాయి. |
| ఎ. మిఠాయి ఐస్‌క్రీం షరబత్ | మెటానికల్‌ఎల్లో హానికరమైన కోల్టార్ డై | గోరు వెచ్చని వేడి నీటిలో వస్తువు నుండి రంగును సేకరించండి. దానికిగాఢ హైడ్రోక్లోరిక్ ఆమ్లం చుక్కలను కలపండి. మజెంటా ఎరుపు రంగు కనబడినట్లయితే మెటానిల్ యెల్లో వున్నట్లు తెలుస్తుంది. |
| 9. బెల్లం | మెటానిల్ ఎల్లో ఎరుపు | కొంచెము బెల్లం తీసుకొని దానికి 1 మి.లీ గాఢ హైడ్రోక్లోరికామ్లమును కలపండి మెజంటా ఎరుపు రంగు కనబడినట్లయితే దానిలో మెటానిల్ యెల్లో ఉన్నది తెలుస్తుంది. |
| 10. పీచుమిఠాయి | | రోడామిన్-బి పరీక్షనాళికలో కొంచెము శాంపిల్‌ను తీసుకుని కరిగించి దానికి కొద్దిగా హైడ్రోక్లోరికామ్లము రెండు చుక్కలు కలిపి దానికి సమాన పరిమాణములో ఇథైల్ ఎసిటేట్ కలపవలెను. |
| ఉసరిక బిళ్ళలు బిస్కట్లు | | ఆరు గ్రాములు కలిపినచో ఇథైల్ ఎసిటెట్ పైభాగములో రంగు తేలియాడి కనిపించినట్లయితే రోడామిక్ రంగు - బి కల్తీ ఉన్నదని తెలుస్తుంది. |

## ప్రజల అజాగ్రత్త అజ్ఞానం

బిస్కట్లు కేకుల మిఠాయి సరుకులు, ఐస్‌క్రీమ్‌లు, పుడ్డింగులు, కూల్‌డ్రింక్‌లు వంటి వాటిలో ఆకర్షణీయంగా వుండుటకు వాటిని తయారు చేయుటలో రంగులు కలుపుట ప్రపంచ మంతటా జరుగుతున్నది. అయితే మోటానిల్ ఎల్లో (పసుపు రంగు) రోడయమిన్ -బి (గులాబి రంగు) వంటి రంగులను ప్రమాదకరమగుటచే నిషేదించబడినవి. ఆహార పదార్థములో ఉపయోగించవలెనని రంగులకు ప్రత్యేకమైన "(ఐఎస్‌ఐ)" మార్కు ఉంటుంది. ఆ రంగులను మాత్రమే వర్తకులుపయోగించాలని చట్టబద్ధమైనరూల్సు ఉన్నాయి. ఆహార పదార్థాలలో వినియోగించకూడదని చౌకబారు రంగులను ఇండ్లలో ముఖ్యంగా విందులో ఉపయోగించిన సందర్భములు కూడా తెలియవచ్చాయి. ఇటువంటి రంగులు ఉపయోగించిన వర్తకులు చట్టరీత్యా శిక్షంచబడుతున్నారు. అయితే ప్రజలు కూడా ఈ హెచ్చరికను విధిగా పాటించాలి. చట్ట ప్రకారము ఐఎస్‌ఐ ఆహార వాడాలి. చౌకబారు మిఠాయి రంగులు హానికరము.

## విజ్ఞప్తి

ఆహార కల్తీ నిరోధక చట్టము 1954 అమలు జరుపుటకు ప్రభుత్వ యంత్రాంగానికి ప్రజల సహకారం అత్యవసరం. ఈ విధమైన నేరాలు పరిశోధించుటకు ప్రత్యేక రహస్య సిబ్బందిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లాల్లోను గ్రామాల్లోను ఆయా లోకల్ హెల్త్ ఆథారిటీలకు మరియు ఫుడ్ ఇనెస్పెక్టర్లకు లిఖిత పూర్వకముగా కాని టెలిఫోన్లలో కాని నేరములను సంబంధించిన సమాచారములనందజేయవచ్చును. ■

# బంజరు భూములను సస్య-శ్యామలం చేసే ఎత్తి పోతల పథకాలు



**బంజరు భూములను పంట పొలాలుగా మార్చినపుడే దేశ ప్రజలకు ఆహార భద్రత కల్పించటం సాధ్యమౌతుందని జాతీయ వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ డా॥ యం. యస్. స్వామినాథన్ పదే పదే అంటుంటారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి అందుకు దోహద పడే పథకాలను ప్రారంభించి, వేలాది ఎకరాలను సస్యశ్యామలంగా మార్చే ప్రయత్నం చేశారు. మే 5న ముఖ్యమంత్రి పశ్చిమ కృష్ణాలో ప్రారంభించిన ఎత్తి పోతల పథకాల వల్ల నీటిచుక్క కరవై, దిక్కులు చూస్తున్న బక్క రైతుల జీవితాలలో వెలుగులు విరజిమ్మే అవకాశం ఏర్పడింది.**

పశ్చిమ కృష్ణాలోని కంచిక చర్ల వద్ద గుడిమెట్ల -తుర్ల పాడు ఎత్తి పోతల పథకానికి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి స్విచ్ ఆన్ చేసి, నీటిని విడుదల చేసి, ఈ పథకాన్ని రైతులకు అంకితం చేశారు. ఈ ఎత్తి పోతల పథకం వల్ల సుమారు 2.15 లక్షల ఎకరాల ఆయ కట్టుకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ పథకం వల్ల కృష్ణా జిల్లా వాసులకు మాత్రమే లబ్ధి పరిమితం కాకుండా, ఖమ్మం జిల్లాలోని మధిర నియోజక వర్గంలోని గ్రామాలకు సాగు, తాగునీటి వసతి సమకూరుతుంది. కృష్ణా జిల్లాలోని తిరువూరు, నూజివీడు, నందిగామ, మైలవరం, విజయవాడ, గన్నవరం నియోజక వర్గాల్లోని సుమారు 20 మండలాలకు చెందిన గ్రామాలకు సాగు నీరు అందటంతో పాటు, ఆయా గ్రామాలకు తాగు నీరు అందించటానికి వీలు చిక్కుతుంది. ముఖ్యమంత్రి ప్రారంభించిన గుడి మెట్ల - తుర్లపాడు ఎత్తి పోతల పథకం 9,750 ఎకరాలకు తక్షణం సాగు నీరు అందించే అవకాశం వుంది.

గుడి మెట్ల - తుర్ల పాడు ఎత్తి పోతల పథకం ప్రారంభించటానికి ముందు ముఖ్యమంత్రి కంచికచర్ల, గని ఆత్కూర, మోగులూరు ఎత్తి పోతల పథకాలకు శంకుస్థాపన చేశారు. ఈ పథకాలు పూర్తి చేయటానికి రూ. 54 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా. ఎత్తి పోతల పతకాలను ప్రారంభించిన అనంతరం ఏర్పాటయిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి సుదీర్ఘ ప్రసంగం చేశారు. "కృష్ణా జిల్లా అభివృద్ధి చెందిన జిల్లాల జాబితాలో వున్నప్పటికీ, ఒక విధంగా వెనకబాటు తనంతో వుందన్నారు. పుష్కలంగా జల వనరులున్నప్పటికీ, వాటిని సద్వినియోగ పరచుకునే అవకాశాలు రైతులకు లేక పోవటం వల్ల, ఆ నీరు సముద్రం పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కళ్ళ ముందు పుష్కలంగా నీరు ప్రవహిస్తున్నా, వాటిని పంట పొలాలకు మళ్ళించుకోలేని



అసహాయతతో ఉన్న రైతులకు సాగు నీరు అందించి, మరింత విస్తీర్ణాన్ని సాగులోకి తెచ్చి, అన్న దాతలను ఆదుకొంటామన్నారు. రైతులకు అండగా నిలవటం కోసమే కోటి ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంతో రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఇప్పటివరకు 70 వేల కోట్లు ఖర్చు చేసి, 22 లక్షల ఎకరాలకు నీరందించినట్లు ప్రకటించారు. జూన్ చివరకు మరో 30 లక్షల ఎకరాలకు నీరందిస్తామంటూ, పోలవరం ప్రాజెక్టును కూడా పూర్తి చేసి, మరింత విస్తీర్ణాన్ని సాగులోకి తెస్తామని శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు.

కేంద్ర మంత్రి జైరామ్ రమేష్‌తో కలసి గుడి మెట్ల వద్ద కృష్ణా నది నీటి ప్రవాహాన్ని తిలకించారు. సహచర మంత్రులు శ్రీ టి.జి. వెంకటేశ్, శ్రీ కె. పార్థసారథి, శ్రీ డి. మాణిక్య వరప్రసాద్, ఎమ్.పి. శ్రీ లగడపాటి రాజగోపాల్, శాసన సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గుడి మెట్ల - తుర్లపాడు ఎత్తి పోతల పథక ప్రారంభాన్ని ప్రేక్షకులు తిలకించటానికి అధికారులు వినూత్న ఏర్పాట్లు చేశారు. ఎత్తి పోతలకు ఉపకరించే మోటార్లు ఎత్తైన ప్రదేశంలో వుండటం వల్ల, అక్కడకు వెళ్ళి తిలకించే అవకాశం వుండదు. ఒకే చోట నాల్గు మోటార్లు ఏర్పాటు చేయటం వల్ల స్విచ్ ఆన్ చేయగానే భారీ శబ్దం వచ్చే ప్రమాదం వుండటంతో, స్విచ్ బోర్డును దూరంగా ఏర్పాటు చేశారు. స్విచ్ ఆన్ కాగానే, కొండపై వున్న పంప్ వెల్‌లోకి నీరు చిమ్మే దృశ్యాలను తిలకించేందుకు అధికారులు భారీ ఏర్పాటు చేశారు.

**- దాసరి ఆళ్వార్ స్వామి**



**మ**న చుట్టూ ఉండే పరిసరాలే మన పర్యావరణం. జీవ జాలాన్ని ప్రభావితం చేసే బాహ్య పరిస్థితులు, ప్రభావాల మొత్తం కలయికే పర్యావరణం. పర్యావరణంలో అంశాలు జీవరహిత, సజీవ భాగాలుగా ఉంటాయి. మార్పు పర్యావరణపు ప్రాథమిక లక్షణం. కొన్ని మార్పులు వేగంగా జరుగుతాయి. మరికొన్ని మార్పులు వేలాది సంవత్సరాలుగా జరుగుతాయి. ప్రతి మార్పు కూడా పర్యావరణపు వ్యవస్థపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావం చూపుతుంది.

# మనం - మన పర్యావరణం - వాస్తవాలు

పలు రకాల సహజ మార్పులు ఒక క్రమ పద్ధతిన సాగుతాయి. ఒక చర్య అనేక ఫలితాలను కలిగించవచ్చు. ఉదాహరణకు ఇంధనాలు మండటం వలన ఆమ్ల వర్షాలు కురవడం, తద్వారా పంటలు, మన ఆరోగ్యం దుష్ప్రభావాలకు లోనవటం జరుగుతుంది.

భూమి ఆరంభ దశలో వాతావరణం మిథేన్, అమ్మోనియా, నీరులాంటి వాయువులను కల్గి ఉండేది. వాతావరణంలో అనేక మార్పులు, ప్రక్రియలు, ఘటనల వలన ప్రస్తుత పరిస్థితికి పరిణామం చెందిన తరువాత కార్బన్ - డై - ఆక్సైడ్ కిరణ జన్య సంయోగ క్రియకు, వాతావరణంలోని ఆక్సిజన్, శ్వాస క్రియలకు ఉపయోగపడే ప్రక్రియ ప్రారంభమైంది.

ఉష్ణోగ్రత, మేఘాలు, వర్షాలు లాంటి వాతావరణ స్థితిగతులు నిరంతరం మారుతూ ఉంటాయి. పగలు సూర్యుని వికిరణంలో 40% వాతావరణం బయటికి తిప్పి కొడ్తుంది. కొంత శక్తిని ఉష్ణ రూపంలో వాతావరణం గ్రహిస్తుంది. మిగతాది భూమి ఉపరితలానికి చేరుతుంది. ఇది రాత్రి సమయంలో మరలా ఉష్ణ రూపంలో పునర్వికిరణం చెందుతుంది. సూర్యుని నుండి వచ్చే అతి నీల లోహిత కిరణాలను ఓజోన్ పొర అడ్డుకుంటుంది. మానవ నిర్మిత రసాయనాలు ఓజోన్ పొర తగ్గుదలకు, రంధ్రాలకు కారణం అవుతున్నాయి.

తత్ఫలితమే గ్లోబల్ వార్మింగ్. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అందరూ ఆందోళన పడుతున్న అతి పెద్ద సమస్య గ్లోబల్ వార్మింగ్. దీని నుంచి బయట పడాలంటే, ప్రతి ఒక్కరూ పర్యావరణానికి అనుకూలమైన పనులు అనగా కాలుష్య రహిత సమాజాన్ని నిర్మిస్తూ, పర్యావరణానికి దగ్గరగా జీవించాలి.

అన్ని వృక్ష జాతులకు, జంతు జాతులకు నీరు అవసరం. నీటి సరఫరా సమృద్ధిగా వున్న ప్రాంతాలు జంతు, వృక్ష ఆవాసాలుగా ఉంటాయి. ప్రాణులన్నింటికీ నీరు అత్యవసరం. అయితే, భూగోళం మీద వున్న నీటిలో 99% కంటే ఎక్కువ శాతం మానవుల ప్రత్యక్ష వినియోగానికి పనికి రాదు. ఎందుకంటే, అది ఉప్పు నీటిగానో (సముద్రం నీరు), గడ్డకట్టో (మంచు పర్వతాలు) ఉంది. కాబట్టి మిగిలిన ఆ 1% నీటి పైననే మిగిలిన ప్రాణులన్నీ ఆధారపడి ఉన్నాయి. నీటిలో అనేక పదార్థాలు కరిగిపోతాయి కాబట్టి, అవి సార్వజనీన ద్రావణం. కనుక నీటిని, కరిగిపోయే వ్యర్థాలను వదిలించుకోడానికి, శుభ్రపరచడానికి ఉపయోగిస్తాము. కాని మనిషి విపరీత ధోరణి వలన నీరు కాలుష్యానికి గురి కావడమే కాకుండా నీటి వనరులు, భూగర్భ జలాలు అంతరించిపోతున్నాయి.

పచ్చని మొక్కలు జీవించడానికి, పెరగడానికి సూర్యరశ్మి, నీరు, ఖనిజాలు, నేల అవసరం. కొన్ని మొక్కలు నేల లేకుండా, నీటిలోనో, వేరే చెట్లను ఆధారం చేసుకుని పెరగ గలవు. వివిధ ప్రజాతుల మొక్కలు ఒకే చోట పెరుగుతూ ఉండటం వలన వృక్షజాల సముదాయాలు ఏర్పడతాయి.

వృక్షజాల రకాలు, వాటి వ్యాప్తి, అక్కడి స్థానిక, ప్రాంతీయ శీతోష్ణస్థితి, స్థలాకృతి, నేల రకాలపై ఆధారపడి ఉండాలి. ఎత్తు నుండి ప్రవహించే వర్షపు నీటికి నేల దెబ్బతినకుండా వుండటానికి, నేలకోతకు గురి కాకుండా ఉండటానికి వృక్షాలు, మొక్కలు రక్షణ కవచంలాగా పని చేస్తాయి. వృక్షాలు, మొక్కలు అనేక ప్రాణులకు ఆవాసాలుగా సహకరిస్తాయి. పర్యావరణంలో వృక్షాలు ప్రధానమైన భాగం. అవి గాలిలోని ధూళి కణాలను శుభ్రపరుస్తాయి. పగలు వేడిని తగ్గించి, రాత్రిపూట వేడిని కాపాడతాయి. అవి అద్భుతమైన శబ్దగ్రహణ మాధ్యమికంగా పనిచేస్తాయి. అడవులు విశాలమైన, సంక్లిష్టమైన జీవావరణ వ్యవస్థలు. అడవులు నేలను రూపొందించడంలోను, నేలకోతను అరికట్టడంలోనూ ప్రధాన భూమిక పోషిస్తాయి. అడవులు వాతావరణంలోని వేడిని తగ్గిస్తాయి. విస్తృత స్థాయిలో ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసి, గాలిలో అధిక కార్బన్ - డై - ఆక్సైడ్‌ను తొలగిస్తాయి. ప్రస్తుతం అడవులు అంతరించిపోతున్నాయి.

పూర్వం అడవులుగా ఉన్న ప్రాంతాలు ఎడారులుగా మారుతున్నాయి. గ్రామాలు, పట్టణాలలో చెట్ల ఆనవాళ్లే కరువు అయ్యాయి. దీని ఫలితమే ప్రకృతి వైపరీత్యాలు. ప్రకృతి సమతుల్యతని కాపాడంలో ప్రతి ప్రాణికి పాత్ర ఉంటుంది. ఉదాహరణకు పాములు, ఎలుకలలాంటివాటి సంఖ్యను నియంత్రించడానికి కొన్నిరకాల పక్షులు అవసరం. విత్తనాల వ్యాప్తి చెందడానికి కొన్ని రకాల పక్షులు అవసరం.

వ్యవసాయ భూముల్లో ఎలుకల సంఖ్యను నియంత్రించడానికి పాముల పాత్ర ముఖ్యమైనది. జంతువులు ప్రతికూల వాతావరణ పరిస్థితుల నుండి తప్పించుకోడానికి "చలనం" సహాయపడుతుంది. అనేక జంతువులు, పక్షులు, క్రిములు, చేపలు, క్షీరదాలు ఋతువులు మారినప్పుడు - ఆహారానికి, ప్రత్యుత్పత్తికి అనుకూలమైన వాతావరణం ఉండే సుదూర ప్రాంతాలకు వలసలు పోతాయి. ప్రస్తుతం మన పర్యావరణ వ్యవస్థలో ఉన్న అనేక జంతువులు, పక్షులు, చేపలు, క్షీరదాలు అంతరించిపోతున్నాయి.



అడవుల నరికివేతవల్ల పర్యావరణంపై తక్షణ, దీర్ఘకాలిక ప్రభావాలు పడతాయి.ఈ ప్రభావాలు వన్య ప్రాణుల ఆవాసాలనీ, సహజ వనరులనీ నశింపజేస్తాయి. దీర్ఘకాలిక ప్రభావాల్లో ఎడారీకరణ, శీతోష్ణస్థితుల్లో మార్పిడి కల్గవచ్చు. అడవుల నరికి వేతకు చిరపుంజి ఒక ఉదాహరణగా గమనించవచ్చు. ఒకప్పుడు ప్రపంచంలో అత్యధిక వర్షపాతపు ప్రదేశం ఇప్పుడు క్షీణించిన ప్రాంతం. సహజ వనరులు తగ్గుతున్న కొద్దీ, వాటి డిమాండ్ కూడా పెరుగుతూ వస్తుంది. సహజ వనరుల కొరత మన ప్రజలు,రాష్ట్రాలు, దేశాల మధ్య తగాదాలకు, ఘర్షణలకు దారితీస్తున్నది.

సహజ వనరుల అభివృద్ధి అనేక సాంఘిక, సాంస్కృతిక విలువలపైన, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలపైనా ఆధార పడి ఉంటుంది. పరిమితమైన వనరులు ఉన్నప్పుడు, జనాభా పెరిగిన కొద్దీ, వారి వినియోగస్థాయి పెరిగిన కొద్దీ అవసరాలకు, కోర్కెలకీ మధ్య వ్యత్యాసంతో తరచూ ఘర్షణలు రావచ్చు. జనాభా పెరుగుదల, పెరుగుతున్న వినియోగం. వనరుల లోపభూయిష్ట నిర్వహణ, ఇవన్నీ కలిసి సహజ వనరుల క్షీణతకు దారి తీస్తున్నాయి. పర్యావరణాన్ని సరైన రీతిలో నిర్వహించుకోడానికి, వనరుల అధ్యయనం, అవగాహన అత్యవసరం.

భూమి వయస్సుతో పోలిస్తే మానవుని ఉనికి, ఆరంభం అయి అతి స్వల్ప కాలమే అయినప్పటికీ, పర్యావరణ ప్రభావం మానవునిపై ఉన్నంత మరే దానిపై లేదు. మానవ సంక్షేమం పర్యావరణ సంక్షేమంపై ఆధారపడి ఉంటుంది. మనం మన పర్యావరణాన్ని క్షీణింపచేస్తే, అంతిమంగా మానవుల స్థితి గతుల నాణ్యతే క్షీణిస్తుంది.

ఈ క్షీణత నెమ్మదిగా జరగవచ్చు లేదా ఒక్కసారిగా జరగవచ్చు. తెలిసేటట్లు జరగవచ్చు లేదా మనం గుర్తించలేనంత జరగవచ్చు. ఈ క్షీణత శాశ్వతం కావచ్చు లేదా బాగు చేయుడానికి అవకాశం ఉండొచ్చు. కాబట్టి బాగు చేయడానికి అవకాశం ఉన్న వాటి గురించి ఆలోచిద్దాం. మన పర్యావరణాన్ని బాగు చేసుకోవడం మన చేతుల్లో ఉందని గుర్తిద్దాం, బాగు చేయడానికి పూనుకుందాం.

**రాపాక ఝాన్సీరాణి, అపార్డ్**

# ప్రపంచం మరువలేని మేడమ్ క్యూరీ



**జీవితం అంతలో వికసించి, అంతలో వాడిపోయే అడవిగడ్డి పువ్వు వంటిది. క్షణకాలం వికసించే ఆ పువ్వు చూసే కన్నులకు ఆనందాన్ని నింపుతుంది. భూమ్మీద గొప్ప కార్యాలు చేసేందుకు దేవుడు ఎప్పుడూ గొప్పవారి కోసం అన్వేషించడు. డబ్బున్నవారిని, తెలివితేటలు, అందం, చందం వంటి భౌతిక వనరుల సదుపాయాలున్న వారిని ఏర్పాటు చేసుకోడు. ఒక మంచి పని చేయాలి. ఆ మంచి పని నలుగురికి ఉపయోగపడేదిలా ఉండాలని తపించే మనసు ఎవరికి ఉంటుందో వారినే తన పనుల కోసం నియమించుకుంటాడు. అందుకు కేన్సర్ వ్యాధి వచ్చి, ఇక మరణం తప్పని పరిస్థితుల్లో ఉన్న ఒక మహిళను దేవుడు ఎన్నుకున్నాడు. ఆమే మేరీక్యూరీ.**

భర్తతో కలిసి సాధారణ జీవితాన్ని అనుభవిస్తూనే, కనీస వసతులు లేని లేబొరేటరీలో ప్రయోగాలు చేయడం ఆమె ఉన్నతికి బాటలు వేసింది. ప్రభుత్వ సహాయం కూడా ఉండేది కాదు. ఒకవైపు యూనివర్శిటీలో ఎక్కువ పని గంటలు బోధనలో గడుపుతూనే, మరోవైపు పలు ప్రయోగాలు చేస్తుండేవారు. ప్రభువు ఇచ్చిన జీవితం కూడా ఇంతే స్వల్పమైనదని క్యూరీ లేత వయసులోనే గ్రహించింది. ఆ జీవితం మానవాళి ప్రయోజనాలకు తోడ్పడేదిగా లేకపోతే మనమెంత కాలం బతికినా అది వృధానే అని క్యూరీ భావన.

అందుకే బాల్యం నుంచే కష్టపడే తత్వాన్ని అలవర్చుకుంది. నిరంతరం ఓ అన్వేషణ ఆమెలో రగిలే జ్వాలగా ప్రజ్వరిల్లుతుండేది. కొత్తగా వచ్చిన ఏ వస్తువునైనా ఆమె నిశితంగా గమనించేది. ఇందులో భాగంగానే ఫ్రెంచ్ భౌతిక శాస్త్రవేత్త 'బెక్వెరెల్' 1896 లో 'ప్రతిదీప్తి' మీద ప్రయోగాలు చేస్తూ కొన్ని ఖనిజాలు రేడియోధార్మికతను కలుగజేస్తాయని అప్రయత్నంగా కనుగొన్నాడు. ఈ ప్రయోగాలు మేరీ దంపతులను విపరీతంగా ఆకర్షించాయి. ఆమె తన భర్తతో కలిసి ప్రయోగాలు చేసి 'పోలోనియం' అనే కొత్త రేడియో ధార్మిక మూలకాన్ని ఆవిష్కరించింది. మాతృదేశమైన 'పోలెండ్' మీద ప్రేమతో 'పోలోనియం' అని పేరు పెట్టింది.

### లేత వయసులోనే శాస్త్రీయ భావాలు

పోలెండ్‌లోని వార్సా పట్టణంలో నవంబరు 7,1867 లో ఒక ఉపాధ్యాయ కుటుంబంలో జన్మించారు మేరీక్యూరీ, ఆమె అసలు పేరు 'మేరీ స్లొడోల్ స్కా'. స్థానిక పాఠశాలలోనే చదువుకుంటూ తండ్రి ద్వారా శాస్త్రీయ భావనలను పొందగలిగింది. విప్లవ భావాలు గల విద్యార్థి సంఘంలో చేరి పోలెండ్‌ను ఆక్రమించిన రష్యాకి వ్యతిరేకంగా

ఉద్యమాలలో పాల్గొనడం వలన ఆమెను బహిష్కరించింది అప్పటి ప్రభుత్వం. ఆమె ప్యారిస్ చేరుకొని అక్కడి ప్రఖ్యాత 'సొబర్న్' యూనివర్సిటీలో గణితం, భౌతిక శాస్త్రాలందు పట్టా పొందారు. అక్కడే సొంతంగా చిన్నచిన్న ప్రయోగాలు చేయడం ఆరంభించారు. కాని ప్రయోగాలకు ఆమెకున్న వసతి సరిపోలేదు.

## వివాహంతో ప్రయోగాలకు పదును

1894 లో ఆమెకు పియరీ క్యూరీ అనే ఫిజిక్స్ ప్రొఫెసర్‌తో పరిచయం ఏర్పడింది. ఆయనకు సొంత ప్రయోగశాల వుండేది. ఇద్దరూ కలిసి పనిచేయడం, ఒకే విధమైన భావాలు కలిగి వుండడం వలన వారి సాన్నిహిత్యం ప్రేమ నుంచి 1895లో వివాహానికి దారితీసింది. అప్పటి నుండి ఆమె 'మేరీ క్యూరీ' గా పిలవబడింది. పియరీ క్యూరీ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందటం వలన, ఆయన స్థానంలో మేరీ క్యూరీని ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా నియమించింది సొబర్న్ యూనివర్సిటీ. దీంతో ఆమె భర్తతో కలిసి ఎన్నో ప్రయోగాలు చేయడం ఆరంభించారు.

## నోబెల్ బహుమతి తెచ్చిన ప్రయోగం


పిచ్‌బ్లెండ్ నందు యురేనియం ఒక్కటే కాకుండా ధార్మిక మూలకాలుండవచ్చని మేరీ దంపతులు ఊహించారు. 1898 నవంబరులో ఒకరోజు ప్రయోగశాలలో ఒక పరీక్ష నాళికలో కొంత పిచ్‌బ్లెండ్ వదిలిపెట్టి మర్నాడు వచ్చి చూశారు. పరీక్ష నాళికలో ఒక మూలనుంచి నీలికాంతి రావడం గమనించిన క్యూరీ ఆనందంగా భర్తకు అది చూపించింది. ఆ విధంగా రేడియం కనిపెట్టబడింది. ఫలితంగా 1903 లో భౌతిక శాస్త్రంలో బెక్వరల్‌తో పాటు వారిద్దరికి నోబెల్ బహుమతి వచ్చింది. ఒక మహిళ నోబెల్ బహుమతి అందుకోవడం అదే ప్రథమం.

క్యూరీ ఒక రోజు భర్తతో యూరప్ మ్యాప్ చూస్తూ ఉండగా 'బొహోమియా' అనే చిన్న దేశంలో యురేనియం పుష్కలంగా దొరుకుతుందని గమనించింది. ఆ ప్రభుత్వ సహకారం పొంది 'పిచ్‌బ్లెండ్' ఖనిజాన్ని సంపాదించి పరిశోధనలు చేసింది. చిల్లులు పడిన ఒక

## రేడియో ధార్మికతను కనిపెట్టడం

పరమాణు సంఖ్య 83 కన్నా ఎక్కువగా గల కొన్ని పరమాణువుల కేంద్రకాలు అస్థిరత్వం వల్ల వికిరణాలను ఉద్గారం చేస్తూ, బాహ్య బలాల అవసరాలు లేకుండానే స్వచ్ఛందంగా స్వయం విఘటనం చెందే దృగ్విషయాన్ని సహజ రేడియోధార్మికత అంటారు. ఉదాహరణకు యురేనియం, ఆక్టియం, థోరియం, రేడియం, పోలోనియం. ఆవేశపూరిత ఈ వికిరణాలు విపరీతమైన వేగంతో, గతిజ శక్తితో, వాయువులను అయనీకరణం చేస్తూ దళసరి వస్తువులు, మానవ శరీరం గుండా కూడా దూసుకుని పోగలవు. శరీర కణాలను నాశనం చేయగలవు.

ఈ లక్షణాన్ని బట్టి క్యూరీ దంపతులు కేన్సర్ కణాలను నాశనం చేయడానికి రేడియో ధార్మికతను ఉపయోగించే విధానం కనిపెట్టారు. 1898వ సంవత్సరంలో 'థోరియం' కూడా రేడియోధార్మిక లక్షణాలను ప్రదర్శిస్తుందని మేరీ దంపతులు కనుగొన్నారు. సాధారణంగా యురేనియం అనేది అందరికీ తెలిసిన రేడియో ధార్మిక పదార్థం. దీనిని 'పిచ్‌బ్లెండ్' అనే ఖనిజం నుండి వెలికి తీస్తారు.



చిన్నరేకుల షెడ్డే వీరికి నివాసం, పరిశోధనశాలలు. వీరు ఎంత కష్టపడ్డారంటే కొన్ని టన్నుల 'పిచ్‌బ్లిండ్' నుండి 100 మి.గ్రాల 'రేడియం'ను వేరు చేయగలిగారు. ఇది యురేనియం కన్నా శక్తివంతమయినది.

రేడియం తెల్లగా చాలా బరువుగా వుంటుంది. దీని వెల బంగారు కన్నా కొన్ని వేలరెట్లు అధికంగా వుంటుంది. ఇది ప్రపంచంలో అతి తక్కువగా లభ్యమవుతుంది. కాని ఇది శరీరానికీ చాలా ప్రమాదకరం. దీనినుండి తయారు చేసిన ఐసోటోపులు రేడియం 622 కేన్సర్‌ను నయం చేస్తుంది. ఇంకా వైద్యరంగంలో దీని ప్రయోజనాలు చాలా ఎక్కువ. సరియైన జాగ్రత్తలు తీసుకోకపోతే రక్తాన్ని నిర్వీర్యం చేసి ఇది మరణానికి దారి తీస్తుంది.

## భర్త మరణంతో కృంగిపోలేదు

1906వ సంవత్సరంలో దురదృష్టవశాత్తు ఒక యాక్సిడెంట్‌లో ఆమె భర్త మరణించాడు. మేడమ్ క్యూరీ పరిశోధనలు మొదలుపెట్టిన నాటి నుండి ఆమెకు తోడుండి ముందుకు నడిపించిన మార్గదర్శకుడు. ఆమె సాధించిన విజయాలలో సహచరి, ఎల్లవేళలా నేనున్నాను అంటూ ధైర్యం చెప్పిన భర్త మరణంతో ఆమె హతాశురాలయింది. అయినా ధైర్యాన్ని పోగుచేసుకుని ముందుకు సాగింది.

భర్త స్థానంలో ఆమెను ప్రొఫెసర్‌గా నియమించింది 'సొబర్న్' యూనివర్శిటి. ఒక మహిళ ప్రొఫెసర్ కాగలడం చరిత్రలో అదే ప్రథమం, అపూర్వం. ఆమె ప్యారిస్ యూనివర్శిటీలో 1914 లో ఏర్పడిన 'రేడియం లేబోరేటరీ'కి డైరెక్టర్‌గా నియమింపబడింది. తమ పుట్టిన వార్సా పట్టణంలో రేడియం పరిశోధనలకై ఒక లేబోరేటరీ నిర్మించాలనుకుంది క్యూరీ. అది కాని చాలా ఖరీదైన విషయం. వెన్ను తట్టే భర్త లేడు. అయినా ప్రయత్నాలు అపలేదు.

అమెరికాలోని క్యూరీ స్నేహితులు, ఇతర శాస్త్రవేత్తలు, పూర్వ విద్యార్థులు కలిసి 50 డాలర్లను ప్రోగు చేసి అప్పటి అమెరికా అధ్యక్షుడు 'హూవర్' చేతుల మీదుగా ఆమెకు అందజేశారు. అది చరిత్రలో సువర్ణక్షరాలతో లిఖించవలసిన రోజు. మహిళల ప్రాథమిక స్థాయి విద్యాభ్యాసం శాతం 20 కు మించని, ఎన్నో నిబంధనలుండే ఆ రోజులలో ఆమె సాధించిన విజయం ఎంతో స్ఫూర్తిదాయకం.

## పత్రికలు, రచనలు

ప్రపంచంలోని శాస్త్రవేత్తలందరూ ఆమెను గౌరవించేవారు. ఆమె రచనలు అనేక పత్రికలలో, సైన్స్ జర్నల్స్‌లో ప్రచురించబడ్డాయి. ప్రపంచంలోని పత్రికలన్నీ ఆమె గురించి తమ పత్రికలలో రాయడానికి పోటీలు పడేవారు. ఆమె 1904 లో 'రేడియోధార్మిక పదార్థాలపై పరిశోధన' అనే పుస్తకాని, 'ఐసోటోపులు, ఐసోటోపిక్ పదార్థాలు' 'రేడియోధార్మికత ద్వారా చికిత్స' అనే పుస్తకాలను 1910 లో రచించారు.

## ఆదర్శమైన తల్లి

శాస్త్ర పరిశోధనలలో ఆమె ఎంత తలమునకలుగా ఉన్నప్పటికీ, తన పిల్లలను జాతి రత్నాలుగా తీర్చిదిద్దగలిగింది మేడమ్ క్యూరీ. ఇద్దరు కూతుళ్లలో పెద్ద కూతురైన ఐరిన్ క్యూరీ, మొదటి ప్రపంచయుద్ధకాలంలో తల్లికి రేడియో గ్రాఫర్‌గా, నర్స్‌గా పనిచేసింది. ఆమె ప్యారిస్ యూనివర్శిటీ నుండి సైన్స్‌లో డాక్టరేట్ సాధించాగలిగింది. ఆమె భర్త ఫ్రెడరిక్ జోలియట్‌తో కలిసి 'పోలోనియం' నుండి వెలువడే ఆల్ఫాకణాల మీద పరిశోధన చేసింది. కృత్రిమ రేడియో ధార్మికత మీద న్యూక్లియర్ ఫిషన్ మీద ఆమె పరిశోధనలకు 1935 లో రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతిని అందుకున్నారు. 1948లో సంవత్సరంలో ఫ్రాన్స్‌కు మొట్టమొదటి న్యూక్లియర్ రియాక్టర్‌ను నిర్మించిపెట్టింది. ఆ విధంగా అదరించిన దేశం రుణాన్ని తీర్చుకుంది. తన తల్లికి నిజమైన వారసురాలిగా నిరూపించింది.

యుద్ధభూమిలో గాయపడిన వారిమీద పరిశోధనలు సాగించిన వారే మేడమ్ క్యూరీ, ఐరిన్‌క్యూరీ. రెండవ కూతురైన 'ఈవ్' అమెరికాకు చెందిన 'లెబెస్సీ' అనే సోషల్ వర్కర్‌ను పెళ్లి చేసుకుంది. ఇద్దరూ సామాజిక సమస్యలపై పోరాడి మంచిపేరు తెచుకున్నారు. లెబెస్సీ ఐక్యరాజ్య సమితిలోని యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్ ఫండ్‌కు డైరెక్టర్‌గా అద్భుత సేవలు అందజేసినందుకు 1965లో అతనికి నోబెల్ శాంతి బహుమతి లభించింది. ఈవ్ తన తల్లి జీవిత కథను రచించింది. అది అనేక భాషలతో తర్జుమా అయి రికార్డు స్థాయిలో అమ్ముడుపోయింది. అ విధంగా తన పిల్లలను ఉన్నతస్థానంలో నిలబెట్టింది మేడమ్ క్యూరీ.

## అవార్డులు

క్యూరీ చేసిన అసమాన పరిశోధనలకు తగిన గుర్తింపు లభించింది. 1903 లో ఫిజిక్స్ విభాగంలో నోబెల్ అవార్డు వరించింది. ఇదే సంవత్సరంలో డేవ్ మెడల్, 1904లో మెట్యూస్సీ మెడల్, 1911 లో కెమిస్ట్రీలో నోబెల్ బహుమతి రెండవసారి వరించింది. మేరీక్యూరీ సైన్స్‌కు చేసిన అసమాన సేవలకు ఫ్రాన్స్ ప్రభుత్వం ఆమె పేరుతో పోస్టల్ స్టాంపులను 1921 లో విడుదల చేసింది.

## మరణంతో సహవాసం

రేడియోధార్మిక పదార్థాలతో ప్రమాదం అని తెలిసి కూడా మేడమ్ క్యూరీ తన పరిశోధనలలో రేడియోధార్మిక పదార్థాలతో అతి సమీపంగా ప్రయోగాలు చేయడం వలన ఆమెలోని తెల్లరక్తకణాలు దెబ్బతిని ఆమెను బ్లడ్ కేన్సర్ వచ్చింది.

ప్రమాదమని తెలిసి కూడ కేన్సర్ బారి నుండి ప్రపంచాన్ని రక్షించాలని తన మరణ శాసనాన్ని తనే రచించుకున్న మేడమ్ క్యూరీ మరణించినప్పటికీ, ఆమె ప్రయోగాలకు, ఆమె అందించిన స్ఫూర్తికి మరణం లేదు. మేడమ్ క్యూరీ జూలై 4, 1934 న మరణించారు. ■

**మాతృభూమి రుణం తీర్చుకుంటున్న భారత్ నిర్మాణ్ వాటంటీర్లతో కలసి నేను సహితం పనిచేస్తానంటూ, ముందుకొచ్చి, ఎర్రని మండే ఎండను లెక్క చేయకుండా సేవా కార్యక్రమాలల్లో మమేకమయ్యారు నెల్లూరు జిల్లా కావలి మండలం, (యమ్.పి.డి.ఓ.) మండల అభివృద్ధి అధికారి టి. 'వసుంధర'.**

నెల్లూరు జిల్లాలో కావలి కేంద్రంగా డివిజన్‌ల (కావలి-గుంటూరు-నెల్లూరు) స్థాయిలో భారత్ నిర్మాణ పౌర సమాచార ఉత్సవాన్ని కావలిలోని ఏ.బి.యమ్. కాంపౌండ్ నందు నిర్వహించారు. అయితే, ఈ కార్యక్రమంలో జలదంకి, కావలిలోని గౌరవరం, సిరిపురం భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ఎండలో వచ్చే ప్రజానీకానికి 'మంచినీరు' అందించేందుకు ఓ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. భారత్ నిర్మాణ్ వాలంటర్లు త్రాగు నీరు స్టాల్‌ను ఏర్పాటు చేసి, ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కాంపౌండ్ లోని ప్రజలందరికీ నీటి ప్యాకెట్‌లు, గ్లాసులు, క్యాన్‌ల ద్వారా త్రాగు నీరు అందించారు.

ఈ సేవా కార్యక్రమాన్ని స్థానిక యమ్.పి.డి.ఓ. వసుంధర అధ్వర్యంలో నిర్వహించారు. మొదటి రోజున ఉదయం 09:30 గంటలకు శిబిరానికొచ్చిన వసుంధర అక్కడ ప్రజల నీటి కష్టాలు చూసి మండుటెండలో వీరి దాహార్తి తీర్చాలనే సంకల్పంతో, తాను సహితం, వాలంటీరుగా మారి పోయింది. నీటికోసం వచ్చే వారందరికీ ఆమె స్వయంగా నీరు పోయటం, మరో ప్రక్క సభావేదిక వద్ద జనాలకు







# బిఎన్‌విగా మారిన ఎంపిడివో

నీరందించే చర్యలను బిఎన్‌విల ద్వారా మానిటరింగ్ చేయటం, బయట నుంచి వాటర్ క్యాన్‌లు, మునిసిపల్ వాటర్, వాటర్ ప్యాకెట్‌లను తెప్పించే పనులను పర్యవేక్షిస్తూ, ఉదయం నుంచి సాయంకాలం వరకు ఆమె వాలంటీర్‌గా మారి, ఈ ప్రోగ్రాం జరిగిన 3 రోజులూ నేను సహితం వాలంటీర్‌నంటూ 'త్రాగునీరు' అందించే సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మేడమ్ స్ఫూర్తితో వాలంటీర్లు, మండల సిబ్బంది, జిల్లా ట్రైనింగ్ మేనేజర్లు, సేవా కార్యక్రమంలో మునిగారు. ఈ సేవ చేయటం తనకెంతో సంతోషాన్ని, తృప్తినీ ఇచ్చిందని ఆమె తన సేవాభావాన్ని వ్యక్తం చేశారు.

అనంతరం కావలి మండలంలో యువజన సంక్షేమ శాఖ, జిల్లా ప్రజాపరిషత్‌లు సంయుక్తంగా నిర్వహించిన భారత్ నిర్మాణ్ వాలంటీర్ల ఓరియంటేషన్ వర్క్‌షాపులో ఆమె పాల్గొన్నారు. భారత్ నిర్మాణ్ వాలంటీర్లు తమ తమ గ్రామాలకు చేసే సేవను ఒక వరంలా భావించాలని, ఇలాంటి అవకాశం మరెవ్వరికీ రాదని, కావలి మండలంలోని భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సేవా కార్యక్రమాలకు తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఆమె అన్నారు. తాను సహితం పాల్గొని, గ్రామాల అభివృద్ధి భాగస్వామ్యంలో తన వంతు సహాయ సహకారాలను అందిస్తానని, వాలంటీర్లంతా గ్రామాలలో సైనికుల్లా మారి, మంచి పనులకు శ్రీకారం చుట్టాలని పిలుపు నిచ్చి ప్రోత్సహిస్తున్న ఈ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఇతర అధికారులకు స్ఫూర్తి ఇస్తారనటంలో సందేహం లేదు.

*- ఏ.వై. శివ, జిల్లా శిక్షణా మేనేజర్, నెల్లూరు*









Sthanika_Color_Oct13.indd 31 17/10/13 5:27 PM



గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారము అందజేస్తున్న
కర్నూలు జిల్లా డోన్ మండలం కన్నపుకుంట భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.






గ్రామ సభలో పాల్గొన్న పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డి గూడెం
మండలం పగిడి గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.



విజయనగరం జిల్లా మెంటాడ మండలం ఇద్దనవలస గ్రామ బి.ఎన్.విలకు, ఎస్.హెచ్.జి మహిళలకు పిల్లల మనుగడ, ఎదుగుదల పై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్న ఇ.టి.సి ఫ్యాకల్టీ సభ్యులు మరియు అపార్డ్ డి.టి.ఎమ్.

# భారత్ నిర్మాణ్ వాలంటీర్ల



కె.ఎల్.ఆర్ లెనోరా దంత వైద్య కళాశాల సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించిన తూర్పు గోదావరి జిల్లా గండేపల్లి మండలం సుబ్బాయమ్మపేట గ్రామ బి.ఎన్.విలు.



సామాజిక అంశాలపై నల్గొండ జిల్లా నాంపల్లి గ్రామ బి.ఎన్.వి.లు ఏర్పాటు చేసిన సదస్సులో బి.ఎన్.వి లకు గుర్తింపు కార్డులను అందజేస్తున్న స్థానిక ఎమ్మెల్యే శ్రీ ఉజ్జిని యాదగిరి రావు సి.ఇ.ఓ. శ్రీ డి. కోటి రెడ్డి, అపార్డ్ సలహాదారు శ్రీ జి. జయపాల రెడ్డి.



ఉన్నత పాఠశాల ఆవరణలో శుభ్రం చేస్తున్న కర్నూలు జిల్లా రుద్రవరం గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.



పిల్లల మనుగడ, ఎదుగుదలపై మహిళలకు శిక్షణ నిర్వహిస్తున్న కడప జిల్లా కోపోల్లు గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.



ప్రొబెషనరీ డిప్యూటీ కలెక్టర్స్‌తో సమావేశమైన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం దేవునిఎర్రవల్లి గ్రామ బి.ఎన్.వి.లు



విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం సారిపల్లి గ్రామంలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించిన దృశ్యం.

# అపూర్వ విజయాలు



గ్రామసభపై అవగాహన సదస్సు నిర్వహించిన శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం కొమర్తి గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు




నీరు మరియు పారిశుద్ధ్యంపై గ్రామస్థులకు ర్యాలీ ద్వారా అవగాహన కల్గిస్తున్న తూర్పు గోదావరి జిల్లా రావుల పాలెం మండలం రావుల పాడు గ్రామ బి.ఎన్.విలు.



పోషక విలువలు నశించకుండా నిల్వ ఉండే పచ్చళ్ళు, సరబత్‌లు మొదలగు వాటిపై ఫుడ్ & న్యూట్రిషన్ వారు నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ గ్రామ బి.ఎన్.వి లు.

# కూలీ కుటుంబాలు రైతుకుటుంబాలుగా...
# బీడు భూములు సాగు భూములుగా...









'60 వసంతాల' స్వతంత్ర భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ నిరుపేదలకు అందించిన ఒక గొప్ప వరం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం. నైపుణ్యం లేని, జాబ్ కార్డు పొందిన కూలీ కుటుంబాలకు కనీసం 150 రోజులు జీవన భృతి కల్పించి, వారికి సకాలంలో వేతనాలు చెల్లించడం జరుగుతుంది. గ్రామ వికాసానికి, గ్రామాభివృద్ధికి ఈ పథకం మణిమకుటం లాంటిది. పల్లెల్లో, పట్టణాల్లో అంతరించిపోతున్న సహజ వనరులను సంరక్షించడమే కాకుండా, వనరులను తిరిగి సృష్టించే విధంగా గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధి హామీ పథకం ద్వారా కృషి చేస్తున్నది.

## ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ రూపు రేఖలు మార్చగలం

'దేశానికి పట్టుకొమ్మలు పల్లెలు' అని మహాత్మా గాంధీ అన్నట్లుగా, పల్లెల్లో అంతరించిపోతున్న వనరులను, జీవన ప్రమాణాలను పెంపొందించడానికి ఉపాధి హామీ చట్టంలో పొందుపరచబడిన రాజీ లేని సూత్రాలను పాటిస్తూ, 75% పనులను, ప్రతిపాదనలను ఆయా గ్రామ సభల ఆమోదం ద్వారా చేపట్టడం జరుగుతుంది. శ్రమశక్తి సంఘాలు, ప్రజల భాగస్వామ్యంతో గ్రామ పంచాయితీ రూపు రేఖలు మార్చగలమనే నమ్మకాన్ని ఉపాధి హామీ పథకం నిలువెత్తు నిదర్శనంగా రుజువు చేస్తున్నది.

కరీంనగర్ జిల్లా, కొడిమ్యాల మండలంలో రాంసాగర్ అనే గ్రామ పంచాయితీ ఉంది. ఈ గ్రామం పరిధిలో రెండు ఆవాసాలున్నాయి. అవి హిమ్మత్‌రావుపేట, శనివారంపేట. ఈ ఊరిలో వ్యవసాయ పనులు ఉన్నప్పటికీ, కూలి దొరకడం అంతంత మాత్రమే. పనులు లేక కూలీ కుటుంబాలు ఎండా కాలంలో ఉపాధి కోసం వలస పోతుండేవి. తునికాకు సేకరణ, బీడీలు చుట్టడం వంటి పనులతో పాటు, అడపాదడపా ఇతర పనులు చేసుకుంటూ కుటుంబ భారాన్ని మోసుకుంటూ వెళ్లేవారు.

అయితే, రాంసాగర్ గ్రామ పంచాయితీ వాసులు ఉపాధి హామీ పథకాన్ని అందివచ్చిన అవకాశంగా భావించారు. రాంసాగర్ కాస్త ఉపాధి (రాం)సాగర్‌గా మారింది. 669 కుటుంబాల వారు, గ్రామ పంచాయితీ కార్యదర్శి ద్వారా జాబ్ కార్డులు పొందారు. వేసవి కాలంలో దాదాపు ప్రతి రోజూ 300 మంది ఉపాధి కూలీలు పనిచేసుకుంటూ, తమ జీవనభృతి మెరుగు పరుచుకుంటున్నారు. అంతే కాకుండా, పల్లెవాసులను 'శ్రమశక్తి సంఘాలు'గా అక్కున చేర్చుకున్నది ఈ ఉపాధి హామీ పథకం.

2006 నుండి 2013 వరకు రాంసాగర్ గ్రామ పంచాయితీ పరిధిలో (7 సంవత్సరాల కాలంలో) మూడు కోట్ల ప్రభుత్వ నిధులను వెచ్చించడం



Sthanika_Color_Oct13.indd 24 17/10/13 5:27 PM







జరిగింది. ఉపాధి కూలీలకు వేతన రూపంలో చెల్లింపులు రూ. 147.27 లక్షలు, సామగ్రి రూపంలో చెల్లింపులు రూ. 145.59 లక్షల మేరకు జరిగాయి. ఉపాధి కూలీలకు జీవన భృతి ద్వారా 1,38,644 పని రోజులు (మ్యాన్ డేస్) కల్పించడమే కాకుండా, గ్రామంలో నిర్మాణాత్మకమైన కార్యక్రమాలను చేపట్టడం జరిగింది.

భూగర్భ జలాల సంరక్షణ, నీటి నిల్వలు, కరువు నీటి ఎద్దడిని సమర్ధవంతంగా ఎదుర్కొనడానికి వృక్ష సంపదను, టేకు మొక్కల ను పెంచడం, 40 ఎకరాలలో మామిడి తోటలు, వన సంరక్షణ, వ్యవసాయానికి అనుబంధ పనులు, నీటి కాలువల (వనరుల) పునరుద్ధరణ, ఎస్సీ, ఎస్టీ, సన్నకారు / చిన్నకారు రైతులు 195 ఎకరాల భూముల్లో ఒండ్రు మట్టి రవాణా చేయించడం, ఉత్పాదకతను పెంపొందించడం, చెరువుల పునరుద్ధరణ, నీటి సామర్థ్యం పెంచడం, ప్రభుత్వ సంస్థలకు, పంట పొలాలకు, శ్మశాన వాటికలకు గ్రామీణ రహదారి వ్యవస్థను అభివృద్ధి పరచడం, సమగ్ర భూమి అభివృద్ధి పథకం క్రింద బీడు భూములను సాగులోకి తీసుకురావడం వంటి పనులు చేపట్టారు. అంతేకాకుండా, రాంసాగర్ గ్రామ ప్రజల భాగస్వామ్యంతో శ్రమశక్తి సంఘాల ద్వారా ఎక్కువ (మ్యాన్ డేస్) పని రోజులు కల్పించడం జరిగింది. అందుకు ప్రభుత్వం గుర్తించి ప్రతిఫలంగా ఎస్సీ / ఎస్టీ కమ్యూనిటీలో రూ. 28 లక్షలతో సిసి రోడ్లను మంజూరు చేయగా, వాటి పనులు కూడా పూర్తి కావడం జరిగింది. ఉపాధి హామీ పథకంలో మరుగుదొడ్ల నిర్మాణంలో పరిసరాల పరిశుభ్రతలో రాంసాగర్ ప్రజలు అందె వేసిన చెయ్యి లాగా భాగస్వాములవుతున్నారు.

ఎ. జలజ, (జాబ్ కార్డ్ నెంబర్ 20074) అనే ఉపాధి కూలీ మాట్లాడుతూ, "100 రోజులు పని మా కుటుంబానికి భరోసా ఇవ్వడం వల్ల మా ఊరిలోనే ఉపాధి పొంది, గత 7 సంవత్సరాల్లో రూ. 85,000 సొమ్మును మా కుటుంబ అవసరాలకు వినియోగించుకున్నాం" అని ఆనందం వ్యక్తం చేశారు.

'ఇందిర' శ్రమశక్తి సంఘం నుండి మేట్ గంగారాం, (జాబ్ కార్డ్ నెంబర్ 10003) స్పందిస్తూ, "సార్! నేను ఉపాధి కూలీగా పని చేసుకుంటున్నాను. మాకు ఉన్న 2-20 ఎకరాలలో ఉపాధి హామీ ద్వారా 2008-09లో సేద్యపు బావి మంజూరు చేయించుకున్నాను. నిరుపయోగంగా ఉన్న భూమిని సాగులోకి తీసుకురావడం జరిగింది. 40 నల్ల మట్టి ట్రిప్పులు మాకు మంజూరు కావడంతో, ఎకరాకు 5 బస్తాలు అదనంగా దిగుబడి రావడం జరిగింది. ఈ పథకం మా కుటుంబానికి ప్రతి సంవత్సరం జీవన భృతి కల్పిస్తుంది" అని పేర్కొన్నారు.

పి. వినోద్‌కుమార్, క్లస్టర్ సాంకేతిక సహాయ క్షేత్ర సహాయకులు, ఎం. రవీందర్‌లు అన్ని శ్రమశక్తి సంఘాలకు పనులు కేటాయిస్తూ. మేట్ల ద్వారా అవగాహన కల్పిస్తూ, మార్కవుట్ ఇవ్వడం జరుగుతుంది. సంఘాలను సమన్వయ పరుస్తూ స్థానిక సి.ఎస్.పి.తో సహకరించి జాప్యం లేకుండా కూలీల వేతన చెల్లింపులు సకాలంలో అందజేయడం జరుగుతుంది.

పునుగొట్టి కృష్ణారావు, సింగిల్ విండో ఛైర్మన్, రాంసాగర్ మాట్లాడుతూ, 'కూలీ కుటుంబాలను రైతు కుటుంబాలుగా, బీడు భూములను సాగు భూములుగా అభివృద్ధి చేయడానికి ఉపాధి హామీ పథకం బాసటగా నిలిచింది. రాంసాగర్ గ్రామ పంచాయితీ పరిధిలో నీటి వనరులను పెంచడానికి, ముఖ్యంగా సర్క్యులేషన్ ట్యాంకులు, చెక్ డ్యాంలు వంటి శాశ్వత నిర్మాణాలు చేయడం ద్వారా దాదాపుగా ఒక లక్ష క్యూబిక్ మీటర్ల మట్టి (40 వేల ట్రాక్టర్ ట్రిప్పులు), తీయడం జరిగింది. 3 మీటర్ల భూగర్భ జల వనరులు పెరిగాయని భూగర్భ శాఖ గణాంకాలు తెలుపుతున్నాయి. (19 మీటర్ల లోతులో ఉన్న నీటి వనరులు 16 మీటర్ల లోతులో లభిస్తున్నాయి.) తిరిగి నీటి ఎద్దడి ఏర్పడకుండా అడుగంటి పోయిన నీటి వనరులను ఉపాధి హామీ పథకం ద్వారా పెంపొందిస్తూ, గ్రామాభివృద్ధికి దోహదపడటం జరుగుతుంది.

ఉపాధి హామీ పథకం సమర్ధవంతంగా అమలు కావడానికి ఇంకా గ్రామ ప్రజలను పూర్తి స్థాయిలో భాగస్వాములను చేయాలి. 60:40 ఉన్న వేజ్ కాంపోనెంట్, మెటీరియల్ కాంపోనెంట్స్‌ను దామాషా పద్ధతిన 50:50 అమలు జరిపినట్లయితే, గ్రామ పంచాయితీ ప్రజలకు పది కాలాల పాటు నిలిచే సుస్థిర ఆస్తులు ఏర్పడతాయి. శాశ్వత నిర్మాణాల ద్వారా ఎక్కువ అభివృద్ధి జరుగుతుంది.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని గ్రామ స్థాయిలో సమర్ధవంతంగా అమలు చేయడానికి క్షేత్రస్థాయి సిబ్బంది నుండి రాష్ట్రస్థాయి సిబ్బంది వరకు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ ఆదర్శ పథకంలో కొన్ని లోటుపాట్లు ఉన్నాయని చెప్పుకున్నప్పటికీ, మరింత పటిష్టవంతంగా అమలు జరగాల్సిన అవసరం ఉంది.

*- శ్రీనివాస్ దుర్గం, కార్యక్రమ అధికారి*
*మండల ప్రజాపరిషత్ కొడిమ్యాల,*
*కరీంనగర్ జిల్లా*



Sthanika_Color_Oct13.indd 25 17/10/13 5:27 PM

# గ్రామీణ మహిళలు చేపట్టదగిన ఆహార, కుటీర పరిశ్రమలు

**గ్రామాలలో పండే పంటల ఆధారంగా గ్రామీణ మహిళలు ఎన్నో వ్యవసాయ అనుబంధ కుటీర పరిశ్రమలు నెలకొల్పుకొని ఆదాయం పొందవచ్చును. అదనపు ఆదాయం ఆర్జించగల ఆహార, కుటీర పరిశ్రమలు గ్రామీణ మహిళలకు అనుకూలంగా ఉంటాయి. ఇంటి వద్దే వీటిని తయారు నిర్వహించుకొనవచ్చు.**



## ముత్యపు చిప్ప పుట్ట గొడుగులు

పుట్ట గొడుగులు శిలీంధ్ర జాతికి చెందిన మొక్కలు. వీటిలో ముత్యపు చిప్ప పుట్ట గొడుగులు, వరిగడ్డి పుట్ట గొడుగులు, తెల్ల గుండీ పుట్టగొడుగులు (White button Mushrooms), పాల మీగడ లాంటి (Milky White) పుట్ట గొడుగులు మొదలైన అనేకరకాలు ఉన్నాయి. ముత్యపు చిప్ప పుట్ట గొడుగులు సమశీతోష్ణ, ఉష్ణ మండలాల్లో పెంచటానికి అనువైనవి.

### *కావలసిన వసతులు/వస్తువులు*

పాక/గడి, వెదురు/చెక్క/ ఇనుముతో చేసిన అరలు, విత్తనం సంచులు (60 సెం.మీ, 30 సెం.మీ వెడల్పు, 70-100 గేజ మందం గలవి). దారం, ప్లాస్టిక్ ట్రేలు, గోతం పట్టాలు, డెట్టాల్, ద్రావణం, పాలిడాల్ లేదా లిండేన్ పొడి.

### *పుట్ట గొడుగుల విత్తనం (స్పాన్) తయారు చేసే విధానం*

పుట్ట గొడుగుల పెంపకానికి కావలసిన విత్తనాలను స్పాన్ అంటారు. ఇందులో ముఖ్యంగా తెల్లని దారం లాంటి పదార్థం, జొన్నలు మొదలైనవి ఉంటాయి. మామూలుగా పొలంలో విత్తనాలను విత్తి, మొక్కలను వచ్చేటట్లు చేసినట్లుగా ఇక్కడ పుట్ట గొడుగుల పెంపకానికి స్పాన్ చాలా అవసరం. మనం వాడే స్పాన్ స్వచ్ఛత మీద పంట దిగుబడి ఆధారపడి ఉంటుంది.

### *కావలన వస్తువులు*

తల్లి స్పాన్ (పరీక్ష నాళికలోని స్పాన్), ప్రెషర్ కుక్కర్ లేదా ఆటోక్లేవ్, ఇనాక్యులేషన్ చాంబర్ (5'6'7'), అతి నీల లోహిత బల్బు, జొన్నలు లేదా గోధుమలు, జొన్నలు ఉడక బెట్టేందుకు స్టవ్ లేదా పొయ్యి, పెద్ద పాత్ర, గ్లుకోజ్ లేదా సెలైన్ సీసాలు (ప్లాస్టిక్ సంచులు), నీటిని పీల్చని దూది, సారా దీపం, ఇనాక్యులేషన్ నీడిల్, కాల్షియం కార్బోనేట్, లేదా చాక్ పొడరు, లిండేన్ పొడి, దారం, రబ్బరు బాండ్స్.

### *స్పాన్ తయారీ*

పగిలిన గింజలు గాని, రాళ్లు, మట్టి పెడ్డలు లేని, ఏ విధమైన తెగుళ్ళు ఆశించని ఆరోగ్యవంతమైన జొన్నలు లేదా గోధుమలు లేదా మొక్కజొన్నలు ఎంచుకొని వీటిని మంచి నీటిలో కడగాలి. కడిగిన పదార్థాలను 30 నిమిషాలు ఉడక బెట్టి ఎక్కువగా ఉన్న నీటిని తీసివేయాలి. ఒక కిలో ఉడక బెట్టిన పదార్థానికి 20 గ్రా. కాల్షియం కార్బోనేట్ పొడిని కలపాలి. పై మిశ్రమాన్ని స్పాన్ సీసాలో లేదా ప్లాస్టిక్ సంచులలో మూడో వంతు వరకు నింపి శుభ్రమైన దూదితో గట్టిగా మూత పెట్టాలి. నలుచదరంగా ఉన్న నాలుగు కాగితపు ముక్కలను దూదిపై ఉంచి, సీసాను లేదా ప్లాస్టిక్ సంచిని దారంతో గట్టిగా కట్టాలి. ఇలా కట్టిన సీసాలను ఆటోక్లేవ్‌లో 15 పౌండ్ల పీడనం వద్ద ఒకటిన్నర గంట పాటు ఉంచి, తర్వాత గది ఉష్ణోగ్రత వద్ద ఉంచాలి. శుభ్ర పరిచిన స్పాన్ సీసాలను ఇనాక్యులేషన్ చేయటానికి అతి నీలలోహిత బల్బు అవసరం. ఇది లేకపోతే, సారాదీపం వద్ద ఇనాక్యులేషన్ చేయవచ్చు. సీసాలను ఆటోక్లేవ్‌లో నుండి తీసిన తర్వాత 24 గంటల పాటు అలానే ఉంచి, తర్వాత వాటిలోని పరీక్ష నాళికలోని తల్లి స్పాన్ ఇనాక్యులేషన్ నీడిల్ సహాయంతో సీసాలోకి కొద్దిగా వేసిన వెంటనే, శుభ్రమైన దూదితో మూసివేయాలి.

ఈ విధంగా ఇనాక్యులేట్ చేసిన తర్వాత, కాగితంతో కప్పి, దారంతో బిగించాలి. ఇనాక్యులేట్ చేసిన సీసాలను గది ఉష్ణోగ్రతలో అంటే 24-28 డిగ్రీల మధ్య 10-15 రోజుల పాటు ఉండనివ్వాలి. వారం రోజుల తర్వాత, సీసాలను బాగా గుండ్రంగా, వేగంగా తిప్పితే, శిలీంధ్ర దారాలు ముక్కలు, ముక్కలుగా అయి, సీసాలోని గింజలన్నింటికి అంటుకుంటుంది. సీసాలను ఉంచిన గది చల్లగా ఉండాలి. మూడు వారాల్లో శిలీంధ్రం పెరిగి, వాడటానికి సిద్ధంగా ఉంటుంది.

### *స్పాన్ తయారు చేసేవారు, కొనేవారు గమనించ వలసినవి*

స్పాన్ ఎప్పుడు సిల్కులాగా నిగనిగలాడుతూ ఉండాలి. అంతేగాని, దూదిలాగా ఉండకూడదు. దీని వలన పుట్ట గొడుగుల దిగుబడి అధికంగా వస్తుంది. స్పాన్ సీసాలోని గింజల చుట్టూ శిలీంధ్ర దారం ఉండేలా చూసి ఎన్నిక చేయాలి. గింజల చుట్టూ మైసీలియం లేకపోతే,



Sthanika_Color_Oct13.indd 26 17/10/13 5:27 PM

స్పాన్ పెరిగేటప్పుడు కలుషతమయ్యే అస్కారముంది. మంచి స్పాన్ ఎప్పుడూ తెల్లగా ఉంటుంది. స్పాన్ పెరిగే కొద్ది గోధుమ రంగుకు మారుతుంది. తాజా స్పాన్ ఎప్పుడూ అధిక దిగుబడినిస్తుంది. స్పాన్ సీసాలో ఆకు పచ్చ, నల్ల చుక్కలు ఉంటే తీసి వేయాలి. ఎందుకంటే, వేరే ఇతర శిలీంద్రాల వలన అవి చెడిపోయినవిగా గుర్తించాలి. స్పాన్ సీసాలో మెరిసే పసుపు రంగులో చిక్కటి ద్రావణం ఉన్నట్లయితే, అవి బ్యాక్టీరియా వలన చెడిపోయినట్లుగా గుర్తించాలి. పాత స్పాన్ వాడటం వలన దిగుబడి తగ్గుతుంది.

### *గుర్తించుకోవలసిన అంశాలు*

రవాణా చేసే సమయంలో స్పాన్ ఉంచిన కంటైనర్‌లో ఉష్ణోగ్రత 35 డిగ్రీల సెల్సియస్ కన్న ఎక్కువగా ఉండకూడదు. స్పాన్‌ను 5-10 డిగ్రీల సెల్సియస్ వద్ద దాదాపు నెల రోజులు నిల్వ ఉంచవచ్చు. వరిగడ్డి పుట్టగొడుగుల స్పాన్‌ను ఎప్పుడు ఫ్రిజ్‌లో ఉంచరాదు. ఒకసారి స్పాన్ సీసాను తెరిచిన తర్వాత మొత్తం స్పాన్‌ను వాడాలి. అంతే కాని మిగల్చడం చేయకూడదు.

### *పెంచే విధానం*

ఎండు గడ్డిని 3 నుండి 4 సెం.మీ పొడవు ముక్కలుగా చేసి మంచి నీటిలో 12-14 గంటలు నాన బెట్టాలి. తర్వాత నీటిని తీసివేసి గడ్డి ముక్కలను మరిగే నీటిలో 20-30 నిమిషాలు ముంచి తీయటం ద్వారా శుద్ధి చేయాలి. నీటిలో నుంచి ముక్కలను బయటకు తీసి నీడలో ఆరబెట్టాలి. విత్తనాన్ని, శుభ్రపరచిన ట్రేలోకి తీసుకొని మైనపు సంచుల్లో 5 సెం.మీ ఎత్తున శుద్ధి చేసిన గడ్డిని పరిచి, దానిపైన పిడికెడు విత్తనాన్ని చల్లాలి. ఈ విధంగా నాలుగైదు వరుసల్లో నాల్గు ముక్కలను, విత్తనాన్ని వేసిన తర్వాత సంచి మూతిని దారంతో కట్టివేయాలి. ఈ దశలో మైనపు సంచులను దిండ్లు (దీవన్) అంటారు. ఇలా తయారు చేసిన దిండ్లను చెక్క అరల్లో లేదా తాళ్ళతో చేసిన ఉట్లలో అమర్చాలి. గదిలో ఉష్ణోగ్రత, తేమ సరిగా ఉంచడం కోసం గది గోడల చుట్టూ గోతాలను వ్రేలాడ దీసి వాటిని క్రమం తప్పకుండా నీటితో తడుపుతూ ఉండాలి. దిండ్లు తయారు చేసిన 12-15 రోజుల్లో శిలీంద్రం గడ్డి ముక్కలనంతా అల్లుకొని తెల్లటి ముద్దలాగా అవుతుంది. ఈ దశలో మైనపు సంచులను తీసివేయాలి. ఆ తర్వాత 3-4 రోజుల్లో గుండు సూది తలలాగా పుట్టగొడుగులు బయటికి వచ్చి మరో 2-3 రోజులకు బాగా ఎదుగుతాయి. ఒక్కొక్క దిండు నుండి మూడు నాలుగు సార్లుగా 1 నుండి 1 1/2 కిలోల పుట్ట గొడుగులు వస్తాయి. పంట అయిపోయిన తర్వాత దిండ్లను ఎరువుగా వాడుకోవచ్చు.



### *తీసుకోవలసిన జాగ్రతలు*

దిండ్లను చీమలు పట్టకుండా చూడాలి. గదిలోనికి ఎండ, వాన పడకుండా చూడాలి. గదిలో ఉష్ణోగ్రత, తేమ సరిగా ఉండేటట్లు చూడాలి. దిండ్లు నలుపు లేదా పసుపురంగులోనికి మారిన ఎడల నాటిన వెంటనే తీసివేయాలి. పుట్ట గొడుగులు సరిగా ఎదిగిన తర్వాతనే కోయాలి.

### *లాభాలు*

పెంచే విధానం తేలిక. తక్కువ స్థలంలో, తక్కువ ఖర్చుతో అధిక ఉష్ణోగ్రతలుండే వేసివిలో తప్ప మిగతా అన్ని రుతువుల్లోను పండించవచ్చును. కూరగాయలతో, పండ్లతో పోల్చిన ఎడల పుట్ట గొడుగుల్లో ఎక్కువ మాంసకృత్తులు, విటమిన్లు, ఖనిజ లవణాలు ఉంటాయి. శాఖాహారం కనుక అందరూ తినవచ్చును. క్రొవ్వు పదార్థాలు, చక్కెర లేని ఆహారం కనుక గుండె జబ్బు, చక్కెర వ్యాధి, ఊబకాయం గలవారికి సురక్షితమైన, శ్రేష్ఠమైన ఆహారం. వీటిని కూరలాగా వండుకొనవచ్చును. పచ్చళ్ల రూపంలో వాడుకొనవచ్చు. పుట్ట గొడుగులను ఎండబెట్టి పొడి చేసి సూప్ (Soup) లాగా లేదా, మసాలా పొడిలాగా వాడుకోవచ్చు.

## పండ్ల ద్వారా తయారు చేసే ఉత్పత్తులు

మామిడి : స్క్వాష్, జామ్‌లు, టాఫీ, తాండ్ర, జెల్లీ, కాయ రూపంలో పచ్చళ్ళు, అమ్‌చూర్, వొరుగులు తయారు చేసుకొనవచ్చును.

అరటి : జామ్, టాఫీ, కాయలుగా చిప్స్, వొరుగులు.

బొప్పాయి : జామ్, టాఫీ, నెక్టార్, తాండ్ర, కాయలుగా టూటీ ఫ్రూట్, పపయిన్ సేకరణ.

జామ : జామ్, చీస్, టాఫీ, జెల్లీ.

బత్తాయి : ఆరంజ్, స్క్వాష్‌లు, నిల్వరసం, పచ్చళ్ళు

నిమ్మ, దబ్బపండు : స్క్వాష్‌లు, నిల్వరసం, పచ్చళ్ళు

చింతపండు : చింతపండు రసం, టాఫీలు.

ఉసిరి : ఉసిరి కాయలో విటమిన్ 'సి'. అధిక శాతంతో ఉంటుంది. ఇది అమ్లాలతో కలిసి ఉండడం వల్ల ఏడాది పొడవునా నిలువ చేసినా విటమిన్ 'సి' ఎక్కువ నష్టపోవటం జరగదు. అందువల్ల పచ్చళ్ళు, మురబ్బాలాంటివి చేసుకొని రోజూ వాడుకొనవచ్చు.

మారేడు పండ్లు - స్క్వాష్.

నల్ల ద్రాక్ష - స్క్వాష్.

తెల్లద్రాక్ష - స్క్వాష్, ఎండు ద్రాక్ష.

సపోటా - జామ్, టాఫీ

పైనాపిల్ - స్క్వాష్, జామ్, నిల్వ ముక్కలు.

### *కూరగాయలను ఉపయోగించి చేసేఉత్పత్తులు*

టమాటా, వంకాయ, దోస, మునగ, క్యారెట్, ఆలు, క్యాబేజీ, కాలిఫ్లవర్, పచ్చి మిర్చి, ఉల్లి పాయ, గోంగూర,



Sthanika_Color_Oct13.indd 27 17/10/13 5:27 PM

కొత్తిమీర మొదలైన వాటితో పచ్చళ్ళు, వొరుగులు తయారు చేసి అమ్మవచ్చు. ఊర బెట్టిన మిర్చి, ఇతర కూరగాయలు, ఆలు చిప్స్, గుమ్మడి కాయ వడియాలు కూడ పరిశ్రమలకు అనువుగా ఉంటాయి. పప్పు పొడులు, ఆకుకూరల పొడులు, మసాలా పొడులు తయారు చేసుకొవచ్చు.

కూరగాయలలో టమాటా చాలా ముఖ్యమైనది. టమాటా ఉపయోగించుకోని వంటకాలు చాలా తక్కువని చెప్పవచ్చును. టమాటాలు ఎరుపురంగును, పులుపును కలిగి వంటకాలకు రంగును, రుచిని కలిగిస్తాయి. టమాటాలోని 'లైకోపీన్' అనే రసాయనిక పదార్థం వలన ఇది ఎరుపు రంగులో ఉంటుంది.. టమాటాలు విటమిన్ 'సి', పోలిక్ ఆమ్లం, బీటా కెరోటెన్ మొదలైన యాంటీ ఆక్సిడెంట్లు, సోడియం, ఫాస్పరస్ వంటి ఖనిజ లవణాలను సమృద్ధిగా, క్యాలరీలను తక్కువగా కలిగి ఉంటాయి. 10 గ్రాముల టమాటాలో సుమారు 26 కిలో క్యాలరీల శక్తి, 23 గ్రా. విటమిన్ 'సి', పోలిక్ ఆమ్లం ఉంటాయి.

టమాటాలు గుండె జబ్బుల వారికి మేలు చేస్తాయని చెప్తారు. టమాటాలను పచ్చి, పండు రూపాల్లో ఉపయోగించవచ్చు. మార్చి - ఏప్రిల్ మాసాల్లో ఎక్కువగా కోతకు రావడం వలన చాలా తక్కువ ధరకు అమ్ముడు పోతాయి. అలాంటి సమయాలలో టమాటాలను కూరల్లోనే కాకుండా, నిల్వ పదార్థాలను తయారుచేసి కొన్ని నెలల వరకు ఉపయోగించుకోవచ్చు. ఈ టమాటా ఉత్పత్తులను టమాటాలు అధికంగా పండించే ప్రాంతాలలో మహిళలకు కుటీర పరిశ్రమగా స్థాపించే అవకాశముంది. టమాటాలతో జామ్, కెచప్, పచ్చడి, గుజ్జు, టాఫీ వంటి పదార్థాలను తయారు చేసుకోవచ్చును. టమాటా నిల్వ పదార్థాలు, తయారీ విధానం తెలుసుకుందాం.

### *టమాట జామ్*

**కావలసిన పదార్థాలు**

టమాటా గుజ్జు - 1 కిలో, లిక్విడ్ గ్లూకోజ్ -50 గ్రాములు, సోడియం బెంజోయెట్ : 295 మి.గ్రా / కేజి టమాట జామ్‌కి

**తయారు చేసే విధానం :**

ఎర్రగా ఉండి, పుచ్చులు లేని టమాటాలను తీసుకోవాలి. నీటితో శుభ్రంగా కడగాలి. టమాటాలను నాలుగు ముక్కలుగా కోసుకోవాలి. మెత్తగా ఉడికించి గుజ్జును వడ్డ కట్టాలి. చెక్కరను, గ్లూకోజ్‌ను కలిపి మెత్తగా గుజ్జును ఉడక నివ్వాలి. ఉడుకుతున్నప్పుడు పొంగును తీసివేసి అడుగంటకుండా గరిటెతో కలుపుతూ ఉండాలి. గుజ్జు మూడవ వంతుకు చిక్క బడిన తరువాత లేదా టోటల్ సాల్యుబుల్ సాలిడ్స్ 68-70 శాతానికి వచ్చినప్పుడు జామ్‌ను దించి వేయాలి. చివరిగా జామ్‌కు సోడియం బెంజోయెట్‌ను కలిపి చల్లార్చాలి. తడిలేని గాజు సీసాలలో లేదా పాలిథిన్ కవర్లలో నిల్వ ఉంచుకొవచ్చు.

గమనిక : 2 నుంచి 3 నెలల వరకు ఉంటుంది.

దిగుబడి : కిలో గుజ్జు 700 గ్రాముల జామ్‌ను ఇస్తుంది.

ఉపయోగం : చపాతీ, బ్రెడ్, పుల్కాలతో జామ్‌ను వాడవచ్చును.

### టమాట కెచప్

*కావలసిన పదార్థాలు*

టమాట గుజ్జు - 1 కిలో, చక్కెర - 53 గ్రాములు

ఉప్పు పొడి - 15 గ్రా॥ ఉల్లిపాయలు ု 10 గ్రాములు (తరిగినవి). వెల్లులి - 10 గ్రాములు, జాపత్రి- 10 ఆకులు, మిర్చిపొడి-20 గ్రా॥, వెనిగర్ 50 మి.లీ, జీలకర్ర-10 గ్రా॥, మిరియాలు-5 గ్రాములు, యాలకులు-5 గ్రా॥ చెక్క-5 గ్రా॥, సోడియం బెంజోయెట్ 295 మి.గ్రా॥/ కెజి టమాట కెచప్.

*తయారీ విధానం*

దోరగా పండిన తాజా టమాటాలను తీసుకోవాలి. నీటితో శుభ్రంగా కడిగి, తడిలేకుండా బట్టతో తుడవాలి. నాలుగు ముక్కలుగా కోసుకోవాలి. మెత్తగా ఉడికించి గుజ్జు వడగట్టాలి. గుజ్జుకు మూడు వంతుల చక్కెరను కలిపి, మిగిలినది ప్రక్కన పెట్టుకోవాలి. ఉల్లి పాయలు, వెల్లుల్లి తరుక్కొని, మసాలాలను కలిపి దంచుకొని తెల్లటి బట్టలో మూట కట్టాలి. మసాలా మూటను గుజ్జులో మునిగేటట్లు ఉంచి గరిటెతో కలుపుతూ ఉడికించాలి. టమాటా గుజ్జు మూడవ వంతుకు మరిగిన తర్వాత మసాలా మూటను తీసివేసి రసాన్ని గుజ్జులో బాగా పిండాలి. మిగిలిన చక్కెరను, ఉప్పును గుజ్జుకు కలిపి కొన్ని నిమిషాల పాటు ఉడికించాలి. చివరగా వెనిగర్‌ని కలిపి కొన్ని నిమిషాల పాటు ఉడికించి దించి వేయాలి. చల్లారిన తర్వాత సోడియం బెంజోయెట్‌ను కలిపి గాజు సీసాలలో, ప్లాస్టిక్ కవర్లలో గాని వేసి నిల్వ వుంచుకోవచ్చు.

నిల్వ : గాలి, వెలుతురు రాని సీసాలలో 3 నెలల వరకు ఉంటుంది.

దిగుబడి : కిలో టమాటా గుజ్జు నుంచి 35 గ్రా॥ కెచప్ తయారవుతుంది.

ఉపయోగం : టమాట కెచప్‌ను, సమోసా, పిజ్జా, చపాతీలు, వడలు, బ్రెడ్ తోస్టుతో కలిపి తీసుకోవచ్చు.

### టమాట గుజ్జు / ప్యూరీ

టమాట గుజ్జు -1 కిలో, చక్కెర - 5 గ్రా॥లు, వెనిగర్ - 5 మి.లీ, ఉప్పు-5 గ్రా॥ లు, సోడియం బెంజోయెట్ - 300 మి.గ్రా॥/ కెజి.

*తయారు విధానం :*

ఎర్రగా, పుచ్చులు లేని టమాటాలను తీసుకోవాలి. నీటితో శుభ్రంగా కడగాలి. టమాటాలను నాలుగు ముక్కలుగా కోసుకోవాలి. మెత్తగా ఉడికించి గుజ్జును వడగట్టాలి. గుజ్జుకు చక్కెరను, ఉప్పును, వెనిగర్‌ను కలిపి ఉడకనివ్వాలి. ఉడుకుతున్నప్పుడు పొంగును తీసివేసి అడుగంటకుండా గరిటెతో కలుపుతూ ఉండాలి. గుజ్జు మూడవ వంతుకు చిక్కబడిన తర్వాత లేదా టోటల్ సాల్యుబుల్ సాలిడ్స్ 15-18 శాతం వచ్చినప్పుడు గుజ్జును దించి వేయాలి. చివరగా గుజ్జుకు సోడియం బెంజోయెట్ కలిపి చల్లార్చాలి. తడిలేని గాజు సీసాలలో లేదా పాలిథిన్ కవర్లలో నిల్వ ఉంచుకోవచ్చు.

నిల్వ : 2-3 నెలలు వరకు ఉంటుంది.

దిగుబడి : కిలో గుజ్జు నుంచి 450 గ్రా॥ ప్యూరీ తయారవుతుంది.

ఉపయోగం : కూరలలో వాడుకోవచ్చు.

గ్రామాలలో ఉన్న గ్రామీణ మహిళలు వ్యవసాయంతో పాటు ఖాళీగా ఉన్న సమయాలలో అనేక రకాలైన ఆహార, కుటీర పరిశ్రమ ద్వారా పలు ఉత్పత్తులు చేపట్టి కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవడానికి మంచి అవకాశంగా భావించుకొనవచ్చు.

*- యమ్. మొగలయ్య*
*ఫ్యాకల్టీ, సి.ఎస్.ఆర్.ఎం.*
*అపార్డ్*



Sthanika_Color_Oct13.indd 28 17/10/13 5:27 PM

# విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగంపై పెరుగుతున్న అవగాహన

**రాష్ట్రంలోని వివిధ ప్రదేశాల నుండి నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాలలో పని చేస్తున్న కెమిస్టులు, మైక్రో బయాలజిస్టులు అవగాహన, పునశ్చరణ శిక్షణా తరగతుల నిమిత్తమై ఇటీవల అపార్డ్‌కు వచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణపై జరిగిన చర్చలో ఒక పేపర్ క్లిప్పింగ్, మరో ఫొటోపై లోతైన చర్చ జరిగింది.**

### క్లిప్పింగ్ సారాంశం

మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో ఆవులు గడ్డి దొరక్క వీధుల్లో పడిన ప్లాస్టిక్ కవర్లను, కాగితాలను తింటున్నాయి. ఇటీవల 'విశ్వక్ సేన' అనే స్వచ్ఛంద సంస్థ 60 ఆవులను దత్తత తీసుకోగా, గడ్డి తిని నెమరు వేయలేక 20 ఆవులు చనిపోయాయి. ఇందుకు కారణం వాటి కడుపులో 40 నుండి 50 కేజీల ప్లాసిక్ పేరుకు పోవటమే.

### ఫొటో సారాంశం

చిలుకూరు దేవస్థానం దగ్గర రెండు మేకలు ఓ కారుకు వేలాడదీసిన పూల దండలోని పూలను తినడానికి అష్ట కష్టాలు పడుతున్నాయి. కారణం పూలదండను అందంగా చేయడానికి చుట్టిన మెరిసే తీగలు, తీగల నుండి పూలదండను వేరు చేయాలనుకొని ఎంత ప్రయత్నించినా పూలు / ఆకులతో పాటు, తీగలు కూడా మేకల నోట్లోకి చేరుతున్నాయి. అయినా తప్పదు. ఆకలి తీరాలంటే వాటిని తినాల్సిందే. ఫలితం కొంత కాలం తర్వాత అకాల మృత్యువు కబళిస్తుంది.

## ఆశాకిరణాలుగా యువతీ యువకులు

### ఇందుకు కారణం ఎవరు ?

ఇంకెవరు మనమే. 'పరోపకారార్థమిథం శరీరం'. అంటే ఈ శరీరం ఉన్నదే పరులకు మేలు చేయడానికి. కానీ తెలిసీ తెలియక (ఈ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు ఇబ్బడి ముబ్బడిగా వాడడం వల్ల) మేలు కంటే కీడు ఎక్కువ చేసున్నామేమో. ఫలితం నోరు లేని మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి.

ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడకంపై కొంతమంది యువకులు, యువజన సంఘాలు చూపిస్తున్న చొరవ వెలుగులోకి వచ్చింది. వీటి వివరాలు ఇలా ఉన్నాయి.



**ప్లా**స్టిక్ వాడకం వల్ల ఇంత అనర్థం ఉందని నాకు తెలియదు. అయినా నేను నా బ్యాగ్‌లో ఓ గుడ్డ సంచి పెట్టుకునే నిత్యం ఆఫీసుకు వెళతాను. ఫలితం ప్లాస్టిక్ కవర్‌లో సరుకులు తీసుకెళ్ళవలసిన అవసరం ఉండదు. ఇంతకుముందు కొన్ని సందర్భాలలో ప్లాస్టిక్ కవర్లు వాడేదాన్ని. ఈ రోజు నుండి ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు వాడొద్దని నిర్ణయించుకున్నాను. నేనే కాదు. నా ఫ్రెండ్స్‌కి, బంధువులకి తెలియ చెప్తాను.

*– జి. శ్వేత, హన్మకొండ, వరంగల్ జిల్లా*



**మా**ది లక్కారం గ్రామం. ఉట్నూరు మండలం. అదిలాబాద్ జిల్లా, మా గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు ఇబ్బడి ముబ్బడిగా వాడి, అలాగే పడేయడం వలన పశువులు వాటిని తిని చనిపోయాయి. ఇలా ఇంటికి ఒకటి లేదా రెండు చొప్పున పశువులను కోల్పోయారు. అందుకు కారణం ఏమిటో నిదానంగా కానీ మాకు అర్థం కాలేదు. అదెలా జరిగిందంటే ఓ చనిపోయిన పశువును ఊరికి దూరంగా పడేశారు. ఓ నెలరోజులకు శరీరమంతా కుళ్ళి పోయి భూమిలో కలిసింది కానీ. దాని ఎముకల మధ్య ఒక పెద్ద ఉండ లాంటిది మిగిలిపోయింది. ఏమిటా అని పరిశీలిస్తే, అదంతా ప్లాస్టిక్ వ్యర్థం. అప్పటి నుండి మా గ్రామస్తులలో కొంత వరకు మార్పు వచ్చింది. అయితే అది నామమాత్రమే. అందుకే ఈ రోజు నుండి ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించేలా నేను కంకణం కటుకుంటా.

*– కృపాకర్*



Sthanika_Color_Oct13.indd 29 17/10/13 5:27 PM



**మా**ది కడప జిల్లా రాయచోటి. మా రాయచోటిలో 'వీరభద్ర స్వామి' దేవాలయం ప్రసిద్ధమైనది. ప్రక్క రాష్ట్రాల నుండి కూడా భక్తులు వస్తారు. అయితే దేవాలయానికి దానం చేసిన గోవులు గత రెండు సం.లలో చాలా చనిపోవడం జరిగింది. కారణం ప్లాస్టిక్ వాటి కడుపులలోకి చేరడమే. అందుకే మేము 30 యువకులం 'కెఎవిఎస్ఎస్' సంస్థను ఏర్పాటు చేసుకుని దేవాలయం ఇఓ గారితో మాట్లాడాము. ఆవులకు ఒక షెడ్ ఏర్పాటు చేశారు. రాయచోటిలోని టీ స్టాల్స్, హోటళ్లకి పేపర్ కప్పులు. ప్లేట్లు, గ్లాసులు తయారు చేసి లాభం నష్టం లేని విధంగా పంపిణీ చేస్తున్నాం. బాల కార్మికులు, అనాధ పిల్లలు, రోగగ్రస్తులు వంటి వారికి మేలు చేసే విధంగా, అనేక విషయాలపై పని చేస్తున్నాం. ఈ రోజు నుండి ప్లాస్టిక్ రహిత రాయచోటికోసమై ఉద్యమిస్తాం.

*– వి. శివానందరెడ్డి, డైరెక్టర్, క్రాంతి అభివృద్ధి సేవా సంఘం*

**మా**ది ములుగు గ్రామం మరియు మండలం. వరంగల్ జిల్లా... నేను ఈ రోజు నుండి నా దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తా. అంతేకాక మాకు ఒక స్కూలు ఉంది. అది వివేక వర్ధిని ఉన్నత పాఠశాల. మా పాఠశాలలోని విద్యార్థులకు పారిశుద్ధ్యం గురించి, ప్లాస్టిక్ వాడితే వచ్చే నష్టాల గురించి అవగాహన కల్పిస్తాం.

*– వేలుపురి భరత్ కుమార్*





**మా**ది హైదరాబాద్. నేను స్టేట్ లేబోరేటరీలో పని చేస్తాను. ఈ రోజు వరకు మనం ప్లాస్టిక్ వాడితే ఆవులు చనిపోతాయనే విషయం నాకు తెలియదు. ఇది వింటే చాలా బాధ వేస్తున్నది. నేను ఈ రోజు నుండి 99% ప్లాస్టిక్ కవర్లు వాడకుండా జాగ్రత్త పడతాను.

*– వి.వి. సాయి ధృవ*

**మా**ది కర్నూలు జిల్లా. గతంలో నేను షాపింగ్‌కి వెళ్ళినప్పుడు దుకాణాలలో మున్సిపాలిటీ వారు జారీ చేసిన నోటీసులు చదివాను. వాటి సారాంశం ప్లాస్టిక్ సంచులు వాడవద్దని. నేను దాని గురించి పెద్దగా ఆలోచించకుండానే గుడ్డ సంచి వాడడం మొదలు పెట్టాను. అయితే ఈ రోజు నేను ఏమంటున్నానంటే – మా ఇంటి ప్రక్కనే ఒక ఫంక్షన్ హాలు ఉంది. అక్కడ చాలా పెళ్ళిళ్ళు, పేరంటాలు జరుగుతూ ఉంటాయి. ప్రతి ఫంక్షన్‌లో విపరీతంగా ప్లాస్టిక్ వాడుతున్నారు. నేను ముందుగా మేనేజ్‌మెంట్ వారితో మాట్లాడి వారిని ఒప్పిస్తా. అవసరమైతే, ఫంక్షన్ నిర్వహించుకునే వారితో కూడా చర్చిస్తా. చేతనైనంత వరకూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించేలా నేనూ శాయశక్తులా తోడ్పడతాను.

*– ధనుంజయ కృష్ణ*





**మా**ది అంబేద్కర్‌నగర్ కాలనీ. కల్లూరు మండలం. ఖమ్మం జిల్లా. మా కుటుంబ శుభకర్యాలలో వీలయినంత వరకు ప్లాస్టిక్ వాడని విధంగా ముందుగానే మా కుటుంబ సభ్యులతో కలిసి ప్రణాళిక సిద్ధం చేసుకుంటా.

*– డి. బాబూరావు*

ఇదండీ యువతీ, యువకుల స్పందన. శిక్షణకు హాజరైన ప్రతి ఒక్కరూ తాము షాపుకి వెళ్ళేటప్పుడు ఈ రోజు నుంచి ఓ కర్ర సంచి / గుడ్డ సంచి తీసుకు వెళ్తామని, ముందు తాను పాటించి, మిగతా వారికి స్ఫూర్తిగా నిలుస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఇలాగే అందరం ఆలోచిస్తే, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని చూడగలుగుతాం.

*– వి. మాధురి, అపార్డ్*



Sthanika_Color_Oct13.indd 30 17/10/13 5:27 PM

# మెల్లగా పుంజుకుంటున్న జీరో టిల్లేజ్ సేద్య విధానం

**అంతర్జాతీయ వ్యవసాయరంగంలో జీరో టిల్లేజ్ సేద్యపు విధానం క్రమక్రమంగా పుంజుకుంటోంది. దేశీయంగా కూడా ఈ విధానం పట్ల రైతుల్లో ఆసక్తి మొదలైంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా రాష్ట్రాలు ఇప్పటికే ఆ విధానం ద్వారా మంచి ఫలితాలు సాధించాయి. ఇక మన రాష్ట్రంలో అయితే గుంటూరు, కృష్ణా, ప్రకాశం, ఖమ్మం జిల్లాల్లో రెండవ పంటగా, రబీ సమయంలో కొందరు మూడవ పంటగా, మరి కొందరు జొన్న, మొక్కజొన్నను జీరో టిల్లేజ్ పద్ధతిలో నాటి అధిక దిగుబగులు సాధిస్తున్నారు.**

జీరో టిల్లేజ్ ఒక సాంప్రదాయక వ్యవసాయ పద్ధతి. పోడు వ్యవసాయ దశ తర్వాత సుస్థిర సేద్య విధానంలో ఈ పద్ధతి చాలా కాలం పాటు కొనసాగింది. తర్వాత ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యాంత్రీకరణ అధిక దిగుబడుల మోజు కారణంగా కొంతకాలం తెరమరుగైంది.

తిరిగి భూసార పరిరక్షణ సేంద్రియ వ్యవసాయంపై రైతులు మొగ్గుచూపుతున్న తరుణంలో మెల్లగా మొదలై క్రమంగా వేగం పుంజుకుంది. ముఖ్యంగా 1962లో అమెరికాలోని కెంటకీ రాష్ట్రానికి చెందిన హర్రే - లారెన్స్ అనే రైతులు జీరో టిల్లేజ్‌తో మంచి ఫలితాలు సాధించారు. దాంతో అక్కడ 1966 నాటికి మొక్కజొన్న పంటలో ఈ విధాన విస్తీర్ణత పెరిగింది.

1967లో సోయా పంటకు విస్తరించింది. 1990వ సంవత్సరం నుండి జీరో టిల్లేజ్ పునఃప్రారంభం పొందింది. భూమిని దున్నకుండా విత్తటం లేదా నేరుగా విత్తనం జల్లే పద్ధతినే జీరో టిల్లేజ్ అంటారు. భూమిని పదే పదే లోతుగా దున్నటం వల్ల భూములు త్వరగానే చౌడుబారి పోతున్నాయి.

వాటిలోని ఆర్గాన్స్ నశించిపోతున్నాయి. దీని నివారణకు అధికంగా రసాయన ఎరువులు వాడుతున్నారు. దీనివల్ల మరికొంత కాలానికి మరింతగా భూములు నిస్సారమవుతున్నాయి. దీనికి పరిష్కారంగా జీరో టిల్లేజ్ విధానాన్ని వ్యవసాయ శాస్త్ర వేత్తలు ప్రోత్సహిస్తున్నారు. వర్షాలు తక్కువ కురిసే ప్రాంతాల భూములకు ఈ విధానం మరింత మేలు చేస్తుంది. దున్నిన భూమిలోని తేమ వారం రోజులకే ఆవిరైపోగా, దున్నని భూమి నెలరోజుల వరకు తేమను నిలుపుకుంటుంది. దున్నిన భూమిలో నాటిన మొక్కలు సరైన వేరు వ్యవస్థను కలిగి ఉండటం



లేదు. దీనివల్ల మొక్కజొన్న, జొన్న, సజ్జలు పొద్దుతిరుగుడు లాంటి పొడుగుజాతి మొక్కలు గాలికి పడిపోతుంటాయి.

జీరో టిల్లేజ్ విధానంలో గట్టి వేరు వ్యవస్థ వల్ల ఆ సమస్య ఉండదు. వరి సేద్యంలో ఆకుమడులు పెంచి, నారు ఊడ్చేపద్ధతి కంటే నేరుగా విత్తనం వెదజల్లిన పద్ధతిలో ఏ విధంగా అధిక దిగుబడులు వస్తున్నాయో, అదే విధంగా జీరో టిల్లేజ్ విధానంలో దున్నకుండా నాటిన వాటిలో దిగుబడిలో తేడా కనిపిస్తోంది. ఈ విషయంలో తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ, సీతానగరం, గోకవరం, రైతుల అనుభవాలు ఆ విషయాన్నే ధ్రువపరుస్తున్నాయి. ఈ విధానం వల్ల దున్నటానికి అయ్యే ఖర్చులు కలిసి వస్తున్నాయి. దీనివల్ల నికర ఆదాయం పదిశాతం పెరుగుతోంది.

1973లో జీరో టిల్లేజ్ గురించి అమెరికాలో ప్రచురితమైన ఆంగ్ల పుస్తకం విపరీతంగా అమ్ముడుపోయింది. జీరో టిల్లేజ్ విధానం వల్ల భూమి సంసిద్ధత కార్యక్రమానికి పెద్దగా ఖర్చు చేయనవసరం ఉండదు. భూమిని దున్నటం వలన మేలుచేసే వానపాములు, నక్షత్ర పురుగులు మొదలైనవి పెద్ద సంఖ్యలో చనిపోతున్నాయి. విలువైన భూమిపై పొర నశించిపోతోంది. ఎన్నో ఆర్గాన్స్ కూడా నశించిపోతున్నాయి. దున్నకపోవటం వల్ల కార్బన్ సంబంధమైన కాలుష్యం తగ్గుతుంది. భూమిని దున్నటం వల్ల కంటికి కనిపించని దూళిరేణువులు పెద్ద ఎత్తున గాలిలోకి లేచి గాలిని కలుషితం చేస్తున్నాయి.

ఇటీవల కాలంలో మన రాష్ట్రంలో మొదటి పంటగా వేసే వరిని డిసెంబర్ మొదటి వారం నాటికి కోసేసి భూమిని దున్నకుండా భూమిలో తేమ ఉండగానే నేరుగా రెండవ పంట (వరికాదు) విత్తనాలు నాటుతున్నారు. దీనివల్ల ఎండలు ముదరకుండా రెండవ పంట ఫల సాయాన్ని పొందగలుగుతున్నారు. దున్నే పద్ధతిలో అయితే వరి కోసిన తర్వాత కనీసం 15 రోజులు సమయం పడుతోంది, జీరో టిల్లేజ్ విధానంలో కలుపు బెడద ఎక్కువ అని కొందరు అంటున్నా వరి నాటిన భూముల్లో రెండవ పంటగా వేసే వాటిలో అటువంటి సమస్య కనిపించటం లేదని మరి కొందరంటున్నారు.

దురదృష్టవశాత్తు అమెరికాలో విస్తరించినంతగా ఈ విధానం యూరప్‌లో విస్తరించలేదు. ముఖ్యంగా దక్షిణ అమెరికాకు చెందిన బ్రెజిల్, అర్జెంటీనా, పెరుగ్వే దేశాలు అగ్రగామిగా ఉన్నాయి. ఆఫ్రికా, ఆసియాకు చెందిన 30 శాతం దేశాలలో ఈ విధానం మెల్లమెల్లగా పుంజుకొంటోంది. ఈ విధానంలో విత్తనాలు నాటటం కోసం యంత్రాలు ప్రవేశించటం శుభ సూచకం, ముఖ్యంగా మొక్కజొన్న, ప్రత్తి, జొన్న, సజ్జ పంటలకు యాత్రీకరణ మంచి ఫలితాలను ఇస్తోంది.

2000వ సంవత్సరం నాటికి 17 శాతం అమెరికా భూమి ఈ విధానం కిందకు రాగా, ఇప్పుడు 20% శాతానికి పెరిగింది. మన దేశంలో జీరో టిల్లేజ్ విస్తీర్ణత 10 శాతానికే పరిమితమైంది. అయితే ఇది వేగంగా విస్తరించే అవకాశం కనిపిస్తున్నది. సేంద్రియ వ్యవసాయ విధానంలో ఇదొక ముఖ్య భాగంగా వ్యవసాయశాఖ ప్రచారం చేయాలి. అప్పుడే తగిన ఫలితం ఉంటుంది. మొత్తం మీద జీరో టిల్లేజ్ విధానం వల్ల ఎకరానికి 5,000 నుండి 6,000 రూపాయలు వరకు అదనపు ఆదాయం పొందవచ్చు.

*- పుట్టా సోమన్న చౌదరి, కాకినాడ*



Sthanika_BW_Oct13.indd 25 17/10/13 5:25 PM

# చిన్నరేవల్లి గ్రామంలో స్వయం సహాయక సంఘాలు (ఐ.డబ్ల్యు.ఎం.పి)

**మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం చిన్నరేవల్లి గ్రామంలో, ఐ.డబ్ల్యు.ఎం.పి. పథకం 2009 నుండి 2016 సంవత్సరం వరకు మంజూరు అయింది.**

చిన్నరేవల్లి గ్రామంలో మొత్తం 36 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. గ్రామంలో ఈ విధంగా ఏర్పడిన సంఘాల సభ్యులు పొదుపు చేసుకొని వసూలు చేయబడిన డబ్బును ఆ సంఘం సభ్యుల అవసరాల నిమిత్తం వాడుకొంటున్నారు. కావున ఈ స్వయం సహాయక సంఘాల వలన గ్రామంలో నివసించే మహిళలలో ఎంతో చైతన్యం, ధైర్యం ఏర్పడ్డాయి.

**యస్.హెచ్.జి. (స్వయం సహాయక సంఘాలు) అంటే ఏమిటి?**

నిరుపేద కుటుంబానికి చెందిన మహిళలు 10 మంది కలిసి ఒక జట్టుగా ఏర్పడి ఒకరికొకరు సమన్వయంతో సహాయం చేసుకుంటూ ఉండేవారిని స్వయం సహాయక సంఘం అంటారు.

ఇలా ఏర్పడిన నిరుపేద మహిళలు రోజుకి రెండు రూపాయల చొప్పున పొదుపు చేసుకుంటూ ప్రతి నెల 60 రూపాయల చొప్పున అందరు కలిసి సమావేశం ఏర్పాటు చేసుకొని పొదుపు చేస్తారు. ఇలా చేసిన పొదుపు మొత్తం వారిలోనే ఇద్దరు సభ్యులను ఎన్నుకొని బ్యాంకులో ఆ ఇద్దరి పేరు మీద బ్యాంక్‌లో ఖాతాతెరచి వచ్చిన పొదుపులను బ్యాంకులో జమచేస్తారు. ఇలా జమ చేసిన డబ్బును 6 నెలలకు ఒకసారి ఖాతా నుండి తీసి అవసరమైన సభ్యులకు తక్కువ వడ్డీకి అప్పుగా ఇచ్చి సహాయం చేస్తారు.

**స్వయం సహాయక సంఘాలు ఏర్పరచిన విధానం**

ఈ గ్రామంలో 1996 సంవత్సరంలో డ్వాక్రా గ్రూపులు ఏర్పడడం జరిగింది. తర్వాత ఈ డ్వాక్రా గ్రూపులే క్రమంగా ఎస్.హెచ్.జి. గ్రూపులుగా మారడం జరిగింది. ఈ సంఘంలో ముఖ్యంగా సగటున 13 మంది సభ్యులతో ఈ సంఘాలు ఏర్పడడం జరిగింది.

గ్రామంలో ఏర్పడిన చిన్న సంఘాలు కలిసి గ్రామస్థాయిలో సమాఖ్యగా ఏర్పడే వ్యవస్థాగత ఏర్పాటే గ్రామైక్య సంఘం. ఆయా చిన్న సంఘాలు, తద్వారా వాటి సభ్యుల ఉమ్మడి అవసరాలు, బతుకు తెరువులకు తోడ్పడే ఆదాయ కార్యక్రమాలకు గ్రామైక్య సంఘం ఆసరా అవుతుంది.

వాటర్‌షెడ్లలో ఉత్పాదకత పెంపుదల, జీవనోపాధుల పెంపుదల కోసం కేటాయించబడిన నిధులను గ్రామైక్య సంఘం రివాల్వింగ్ ఫండ్ రూపేణ స్వయం సహాయక సంఘాలకు అందించి తయారు చేసుకొన్న ప్రణాళికల ఆధారంగా వివిధ ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా చూస్తుంది. కార్యక్రమాల సక్రమ అమలును పర్యవేక్షిస్తుంది.

- ★ ఈ స్వయం సహాయక సంఘంలో ఉన్న సభ్యులకి ఒక్కొక్కరు రూ. 50 నుండి రూ. 100 వరకు వసూలు వేసుకొని తమ సంఘం ఖాతాలో జమ చేసుకొని ఆ సంఘం సభ్యుల అవసరాల నిమిత్తం రుణ రూపేణ వాడుకుంటారు.
- ★ ఈ విధంగా సంఘం సభ్యులు తీసుకొన్న డబ్బులు రోజుకు రూ. 2 చొప్పున తిరిగి ఆ డబ్బును చెల్లిస్తారు.
- ★ చిన్నరేవల్లి గ్రామంలో 14 గ్రూపులు దాదాపు 1.50 నుండి 3.0 లక్షల వరకు, ఆ గ్రూపు సభ్యులు తీసుకుని, పిల్లల చదువులు, పెళ్ళిళ్లు, పశువుల కొనుగోలు మొదలైన చిన్న వ్యాపారాలను చేయటానికి వాడుకుంటున్నారు.

**యస్.హెచ్.జి. బాధ్యతలు**

- ★ స్వయం సహాయక బృందాల సమావేశాలలో వాటర్‌షెడ్ గురించి కూడా చర్చించాలి.
- ★ పేదలు / నిరుపేదలను గుర్తించి జీవనోపాధుల ప్రణాళికలు తయారు చేసుకొని అమలు పరచాలి.
- ★ ఉత్పాదకత పెంపుదల అంశాలకు సంబంధించిన కార్యక్రమాలను గుర్తించి, అమలు పరచుకొని విధులను నిర్వర్తించాలి.
- ★ మహిళలు వాటర్‌షెడ్ కమిటి సమావేశాలలో, వాటి అమలులో ప్రముఖ పాత్ర పోషించే విధంగా ప్రోత్సహించాలి.
- ★ గ్రామంలో పేదలను గుర్తించి వారు సంఘాలలో ఉండేవిధంగా చూసుకోవాలి.

చిన్నరేవల్లి గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు బి.నాగమణి మాట్లాడుతూ, "మా గ్రామంలో 36 సంఘాలుగా ఏర్పడిన తరువాత, మేము డబ్బులు నెలకు రూ. 50 నుండి 100 వరకు పొదుపు చేసుకొని మా అవసరాలకు తీసుకుంటున్నాం.


ఉదాహరణకు పిల్లల చదువులు, పెళ్ళిళ్ళు, కిరాణాషాపు / చికెన్‌షాపు పెట్టుకోడానికి, ఆవులు కొనుక్కోవడానికి ఎవరికి అవసరమైతే వాళ్ళు, రూపాయి వడ్డీకి తీసుకొని (రూ. 1.50 నుండి 3.0 లక్షల వరకు) చక్కగా వాడుకొంటున్నాం. మాకు ఈ వాటర్‌షెడ్ పథకం కింద కూడా డబ్బులు వచ్చినందుకు మేమంతా కృతజ్ఞతలు తెలుపుతున్నాం" అన్నారు.

*- యస్. హరిప్రియ, ఫ్యాకల్టీ*
*- పి. మధువెంకట కృష్ణ, ఇంజనీరింగ్ కన్సల్టెంట్*


Sthanika_BW_Oct13.indd 23 17/10/13 5:25 PM

# సులబ్ జనకుడు - బిందేశ్వర్ పాఠక్

**సాధారణంగా పల్లె ప్రజలు తమకు కావాల్సిన వస్తువుల కొనుగోలు కోసమో, ఇతర వ్యవహారాల కోసమో పట్నాలకు, నగరాలకు వెళ్లి వస్తుంటారు. అక్కడ తమ పనులు ముగిసిన తర్వాత దేహబాధ (మలమూత్ర విసర్జన)కు తగిన స్థలం దొరకటం ఒక సమస్యగానే వుండేది. ప్రజల సమస్య పరిష్కార మార్గం కోసం గత 70 ఏళ్లుగా పని చేసిన బిందేశ్వర్ సులువైన పద్ధతి కనుగొన్నాడు. ఇంతకు ముందే పాకీ పనివారలు చేసే అనిష్ట పద్ధతి నుండి విముక్తుల కావించి వారికి సమాజంలో సముచిత గౌరవం లభించేసే పద్ధతిని గురించి పలు పథకాలు ఆలోచించాడు. అతని ఆలోచనల పరిణామమే 'సులభ్' నిర్మాణం. నగర వాసులు కూడా ఉదయాన్నే చెంబు నీళ్లతో వెళ్లి కొంత మరుగు వున్న చోట మలవిసర్జన చేసి వచ్చేవారు. మలాన్ని చేతులతో ఎత్తుకొని, తలపై మోసుకొని వెళ్లటం గమనించి వారికి పాకీ పని బాధ లేకుండా చేయాలని నిశ్చయించుకున్నాడు.**



బిందేశ్వర్ పాఠక్ బీహార్‌లోని రామ్‌పూర్‌లో నంవన్న బ్రాహ్మణ కుటుంబంలో 1943 ఏప్రిల్ 2వ తేదీన జన్మించాడు. 1964లో సమాజ శాస్త్రం (సోషియాలజి)లో ఎం.ఏ. పట్టా అందుకొన్నాడు.1983లో పాకీ పని వారున్న కాలనీలలో వారితో వుంటూ, వారి స్థితిగతులపై పరిశోధన సాగించి పి.హెచ్.డి. పట్టా అందుకొన్నాడు.

1968లో, బీహార్‌లోని గాంధీ సెంటినరి సెలెబ్రేషన్స్ కమిటీ విభాగానికి చెందిన భంగి విముక్తి సెల్ సభ్యుడుగా చేరాడు. ఇది బిందేశ్వర్ జీవితంలో ఒక గొప్ప మలుపు.

భంగీలకు (పాకీ పనివారు, ఎందుకీ దుస్థితి, వారిని సమాజ ప్రధాన స్రవంతిలో చేర్చడానికి ఏమి చేయాలన్న ఆలోచనతో సతమతమయ్యే వాడు. మొదట భంగీలను పాపాత్ములుగా పరిగణించే తీరును గమనించాడు. మన ధార్మిక గ్రంథాల్లోను ఇందుకు తగిన పరిష్కార మార్గమేమిటో తెలుసుకోవటానికి దేశమంతటా పర్యటించి, సమస్యల మూలాన్ని కనుగొనటానికి శ్రమించాడు.

పలు పర్యటనలు, అధ్యయనాల ఫలితంగా 1970లో 'సులభ్ ఇంటర్నేషనల్ సర్వీస్ ఆర్గనేషన్' అన్న ప్రభుత్వేతర సేవా సంస్థను ప్రారంభించాడు. ఈ సంస్థ స్థాపనోద్దేశం భంగీల విముక్తి. అనగా పాకీ పనివారు (భంగీలు) మలాన్ని నెత్తిపై మోసుకొని వెళ్లే అనిష్ట పద్ధతి నిర్మూలనకు పర్యాయ పద్ధతుల అన్వేషణ, మానవ హక్కుల పరిరక్షణ, పరిసరాల పారిశుద్ధ్యం కోసం శౌచాలయాల స్థాపన కూడా ఈ సంస్థ లక్ష్యాలు సులభ్ శౌచాలయ నిర్మాణం ద్వారా సామాజిక మార్పునకు శ్రీకారం చుట్టాడు. రెండు గుంటలను త్రవ్వించి, ఒక గుంట నిండిన వెంటనే దాని మూసి వేయించి మరొక గుంటలో మలం వేయటం. మొదటి గుంటలోని మలం అంతలో ఎరువుగా మారుతుంది. ఈ రీతిగా 'సులభ్' శౌచాలయాల నిర్మాణం సులభమైంది.

సులభ్‌ను మొదట ఎవరూ అంతగా గమనించలేదు. బిందేశ్వర్ తమ ఇంజనీర్ మిత్రులు, శాస్త్రవేత్తల బృందంతో చర్చించి, ఈ పద్ధతికి మంచిపేరు సాధించాడు. తక్కువ ఖర్చుతో కూడిన శౌచాలయాలు, అంతర్జాతీయ సంస్థల గుర్తింపునందు

**పాట్నా నగరం నుంచి ప్రారంభం**

పాట్నా నగరంలో ప్రారంభమైన సులభ్ క్రమంగా 25 రాష్ట్రాలకు వ్యాపించింది 50 వేల మంది శిక్షణ పొందిన వారి బృందంతో 1075 నగరాల్లో కార్య నిర్వహణ చేస్తున్నది. 5500 సార్వ జనిక్ శౌచాలయాలను, స్నానపు గదులను సులభ్ నిర్మించింది. కొన్ని చోట్ల క్లాక్ రూమ్ (సామానులు భద్ర పరచుకొనే గది), టెలిఫోన్ సౌకర్యం కల్పించింది. ప్రభుత్వ సహకారంతో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కూడా 'సులభ్'ల నిర్మాణం జరిగింది. నగరపాలక సంస్థలు నిండు మనసుతో సహకరిస్తున్నాయి.

ఇప్పుడు ఆఫ్ఘనిస్థాన్, దక్షిణ ఆఫ్రికా, చైనా, భూటాన్, నేపాల్, ఇథియోపియా మొదలైన 10 దేశాలు, సులభ్ పద్ధతినవలంబిస్తున్నాయి. 50కి పైగా అభివృద్ధి చెందిన దేశాలు ఈ పద్ధతికి స్వాగతం పలికాయి. ఫ్రాన్స్ దేశం సులభ్ గురించిన చిన్న డాక్యుమెంటరీ నిర్మించింది.

భంగీలను మలం మోసే పని నుండి విముక్తులను కావించి, వారి కోసమే అనేక కేంద్రాలను ప్రారంభించారు. బిందేశ్వర్ పాఠక్ వారిని స్వతంత్రులుగా, స్వావలంబులుగా మార్చింది. ఢిల్లీలో ఒక ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రారంభించింది. సంపన్న కుటుంబాలు బీద భంగీల కుటుంబాలను దత్తత తీసుకొంటున్నాయి. సులభ్ శౌచాలయాల నిర్మాణాన్ని భారత మాజీ ప్రధాని కె. గుజ్రాల్ ప్రోత్సహించారు.

సమాజ సర్వతో ముఖాభివృద్ధి కోసం శ్రమించిన బిందేశ్వర్ నైర్మల్య సులభ్ కార్యక్రమం ఒకనాటి శ్రమ ఫలితం కాదు. 43 ఏళ్లు బిందేశ్వర్ ఈ రంగంలో శ్రమించారు. ప్రజానీకంలో నైర్మల్యం గురించిన జాగృతి కోసం ఆరోగ్య, శుచిత్వ సంస్థనే నెలకొల్పాడు.

నైర్మల్య శాస్త్రవేత్తగా బిందేశ్వర్ చేసిన కృషికిగాను ఇందిరా ప్రియదర్శిని పురస్కారమందుకొన్నారు బిందేశ్వర్. గ్లోబల్ 500 రోల్ ఆఫ్ ఆనర్ (2003), ఎనర్జీ గ్లోబల్ ప్రశస్తి, దుబాయ్ ఇంటర్నేషనల్ అవార్డు, స్టాక్ హోమ్ వాటర్ ప్రైజ్, వీటన్నిటికీ మించిన ఫ్రాన్స్ ప్రభుత్వం నుండి 'లెజెండ్ ఆఫ్ ప్లానెట్' అందుకొన్నారు. బిందేశ్వర్ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ డిబేటింగ్ సొసైటీ ఆహ్వానమందుకొన్నారు.


బిందేశ్వర్ గొప్ప వక్త. దేశంలోనే కాక విదేశాల్లో కూడా ఉపన్యాసాలిచ్చారు. రోడ్ టు ఫ్రీడమ్ అన్న గ్రంథం రాశారు బిందేశ్వర్. భారత ప్రభుత్వం 'పద్మభూషణ్'తో గౌరవించింది.

సులభ్ జనకుడు మరికొన్నేళ్లు ఈ నైర్మల్య పద్ధతిని విస్తరించాలని ఆశిస్తూ, అభినందిద్దాం.

*- జానమద్ది హనుమచ్ఛాస్త్రి*



Sthanika_BW_Oct13.indd 30 17/10/13 5:25 PM



స్పీడ్‌గా బైక్‌మీద వస్తూ ఎదురుగా కుర్రాడు. సడన్ బ్రేక్ వేశాడాయన. 'క్రీచ్' మని శబ్దం చేస్తూ కారాగింది.

బైక్‌ని స్టాండు వేసి, కుర్రాడొచ్చాడు. కోపంగా కార్ డోర్ తట్టాడు. తెరిచాయన.

అంతే! కాలర్ పట్టుకున్నాడు కుర్రాడు.

"ఇడియట్" అన్నాడు.

''సారీ'' వణికి పోతూ చెప్పాడాయన.

"చూడ్డానికేమో పెద్ద మనిషిలా ఉన్నావు. సిగ్నల్ చూసుకోవా!" అని అరిచాడు కుర్రాడు.

"సారీ" మరోసారి చెప్పాడాయన.

రెండు సార్లు తనకి సారి చెప్పేసరికి కుర్రాడి కోపం తగ్గిపోయింది.

"పో" అని వదిలేశాడు. కారుని వేగంగా డ్రైవ్ చేసుకుంటూ ఆసుపత్రికి చేరాడాయన.

# మనకేం తెలుసు?

''నమస్తే డాక్టర్'' ఎదురయింది నర్స్.

''అంతా రెడీనా?'' అడిగాడాయన.

''రెడీ డాక్టర్'' అంది నర్సు.

గబగబా ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్తుంటే ఆయనను అడ్డుకున్నాడో వ్యక్తి.

''ఎప్పుడనగా ఫోన్ చేశాం, ఇప్పుడా రావడం? అవతల నా కొడుకు చావు బతుకుల్లో వున్నాడయ్యా. డాక్టర్‌వి, బాధ్యత లేదా నీకు?''

''సారీ, సిటీకి కొంచెం దూరంలో ఉన్నాను, దాంతో రావడం లేటయ్యింది. ఆస్పత్రి నుంచి ఫోన్ రాగానే బయల్దేరాను. నా తప్పు లేదు'' అన్నాడాయన.

''నిన్ను...'' అంటూ ఆ వ్యక్తి అతని కాలర్ పట్టుకోబోయాడు.

''ప్లీజ్ ఆవేశ పడకండి'' వారించాడతను.

''ఆవేశపడకుండా ఎలా ఉండనయ్యా? ఇదే నీ కొడుకు చావు బతుకుల్లో ఉంటే నా బాధేంటో నీకు తెలిసేది''.

సమాధానంగా సన్నగా నవ్వాడాయన. తరువాత ఇలా అన్నాడు.

''ధూళి నుంచి పుడతాం. ధూళిలోకే కలిసిపోతాం. ఎక్కణ్నుంచి వచ్చామో అక్కడికే ప్రయాణం. ఈ ప్రయాణం ఉందే, ఇదంతా ఆ భగవంతుని కృప ఉంటే చల్లగా, చక్కగా సాగుతుంది. లేదంటే లేదు. ఇందులో డాక్టర్లుగా మేము చేసేదేమీ ఉండదు. డాక్టర్లు దేవుళ్ళు కారు. ఇలా మాట్లాడుతున్నానని మీరు వేరే రకంగా అనుకోవద్దు. వెళ్ళండి. వెళ్ళి, సర్జరీ సక్సెస్ కావాలని దేవుణ్ణి ప్రార్థించండి''.

''ఒడ్డున వుంటే, నేనూ చెప్తాను మాటలు'' అన్నాడా వ్యక్తి.

ఆ మాటల్ని పట్టించుకోలేదాయన. నర్స్ తొందర చేస్తే, ఆమెతో పాటుగా ఆపరేషన్ థియేటర్‌లోకి నడిచాడు.

నాలుగైదు గంటలు గడిచాయి. ఆపరేషన్ థియేటర్‌లోంచి బయటికి వచ్చాడాయను. ఆనందంగా కనిపించాడు. ఆయననుకోపంగా కసిగా చూస్తున్న వ్యక్తిని దగ్గరగా పిలిచాడు. ఇలా చెప్పాడు.

''దేవుడు చల్లగా చూశాడు. మీ అబ్బాయికిప్పుడు ఎలాంటి ప్రాణభయం లేదు''.

''థాంక్యూ'' అని చేయి ఇవ్వబోయాడు ఆ వ్యక్తి.

పట్టించుకోలేదాయన. పరుగు లాంటి నడకతో అక్కణ్నుంచి వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతూ, వెళ్ళిపోతూ ఇలా అరిచాడు.

''మీకేమన్నా డౌట్స్ వుంటే నర్సుతో మాట్లాడండి'' అని.

చిర్రెత్తుకొచ్చింది ఆ వ్యక్తికి. 'పేషెంట్ మంచి చెడ్డలు గురించి మాట్లాడదామంటే క్షణం కూడా నిలబడకుండా పరిగెడుతున్నాడే, ఏం డాక్టరితను? బుద్ధుందా అసలితనికి? ఛీఛీ!' అనుకున్నాడా వ్యక్తి. తన మనసులో అనుకున్న మాటల్నే, డాక్టర్ వెళ్ళిన వైపు జాలిగా చూస్తున్న నర్స్‌తో అన్నాడు.

సమాధానంగా కన్నీళ్ళు పెట్టుకుంది నర్స్.

''నిన్న రాత్రి వాళ్ళబ్బాయి రోడ్డు యాక్సిడెంటులో చనిపోయాడు. ఈ రోజు దహనం. డాక్టర్‌గారు శ్మశానంలో ఉన్నారు. ఇంతలో ఇలా అర్జంట్ అని ఫోన్ చేస్తే కొడుకు శవ దహనం తర్వాతంటూ పరిగెత్తుకొచ్చారు. ఇప్పుడక్కడికే... శ్మశానానికే వెళ్తున్నారు. అందుకే ఆ పరుగు....''

నర్సు మాటలకి అచేతనమయిపోయాడా వ్యక్తి.

... చూసీ చూడగానే ఎదుటి వ్యక్తిని అంచనా కట్టడం పొరపాటు. వాళ్ళ కష్ట నష్టాలు మనకి తెలియవు. ఆశ, నిరాశలు అంత కన్నా తెలియవు. కాబట్టి దయచేసి మొదటి చూపులోనే అంతా తెలుసు అని అనుకోకండి!!

*- సునీత, ఎన్‌టిఆర్‌సి*



Sthanika_BW_Oct13.indd 31 17/10/13 5:25 PM

చిత్తూరు జిల్లా కలకడ మండలంలో 2011 జనాభా లెక్కల ప్రకారం కేవలం 50% మాత్రమే అక్షరాస్యులుగా వున్నారు. అక్షరాస్యత అభివృద్ధికి నాంది అనే విషయం దృష్టిలో వుంచుకొని సాక్షర భారత్ కార్యక్రమం ద్వారా మంచి ఫలితాలను ఆశిస్తూ ఇతర శాఖల సమన్వయముతో కార్యాచరణ ప్రణాళిక తయారు చేయడం జరిగింది.



# చిత్తూరు జిల్లా, కలకడ మండలంలో సాక్షర భారత్

### సాక్షర భారత్ లక్ష్యాలు

- 2012 సంవత్సరం నాటికి దేశంలో 80 శాతం అక్షరాస్యత సాధించడం.
- స్త్రీ, పురుషుల అక్షరాస్యతలో వ్యత్యాసాన్ని 10 శాతానికి తగ్గించడం.
- ప్రాంతీయ, సామాజిక వివక్షతలను.
- 15 సంవత్సరాల వయస్సు నిండిన వారందరికీ ఈ కార్యక్రమాన్ని విస్తరించడం.

మండలంలోని 15 గ్రామ పంచాయితీలకు గ్రామ పంచాయతీ కో-ఆర్డినేటర్లు నియమితులై, 01.08.2010 నుండి విధులు నిర్వర్తిస్తున్నారు. మొదటగా స్వయం సహాయక సంఘాలోని యస్.సి/ యస్.టి./ బిసి/ మైనారిటీల నిరక్షరాస్యులు సుమారు 1050 మందిని గుర్తించి, వారికి పంచాయతీ పరిధిలో కేంద్రాలు ప్రారంభించి కేంద్రానికి 10 మంది చొప్పున నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తయారు చేయడమైనది. తరువాత రెండవ విడతలో 900 మంది నిరక్షరాస్యులను ఎంపిక చేసుకొని వారందరిని అక్షరాస్యులుగా చేయడమైనది. మూడవ విడత కార్యక్రమం ద్వారా 2770 మంది నిరక్షరాస్యులను లక్ష్యంగా చేసుకోవడమైనది.

| 2011 జనాభా లెక్కల ప్రకారం | పురుషులు | స్త్రీలు |
|---|---|---|
| జనాభా | 17182 | 17180 |
| నిరక్షరాస్యులు | 6327 | 8720 |
| నిరక్షరాస్యుల శాతం | 36.8% | 50.7% |

కనుక ఇతర శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి రూపొందించిన మండల స్థాయి కార్యాచరణ ప్రణాళిక:

### విద్యాశాఖ

మండలం నందు జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలలో విద్య నభ్యసించుచున్న విద్యార్థిని విద్యార్థులచే నిరక్షరాస్యులైన వారి తల్లిదండ్రులను మొబిలైజేషన్ చేయటానికి ప్రేరణ కల్పించినచో సఫలీకృతం కావచ్చును. దీనికి సంబంధించిన ఉపాధ్యాయులు, నిరక్షరాస్యులైన తల్లిదండ్రుల వివరాలను పిల్లల ద్వారా తెలుసుకొని, వారిని అక్షరాస్యతా అభ్యసన కేంద్రాలకు వెళ్ళేటట్లు వారి పిల్లల ద్వారా ప్రేరణ కల్పించాలి. దీనిపై తరచుగా సంబందిత ఉపాధ్యాయులు పిల్లలతో సమీక్షిస్తుంటే పోటీ పడే మనస్తత్వం ఉన్న పిల్లలు వారి తల్లిదండ్రులను సిద్ధం చేసే సాధనాలుగా ఉపయోగపడతారు.

### ఇందిరా క్రాంతి పథం

స్వయం సహాయక సంఘాలలో ప్రతి గ్రామంనందు 99% మహిళలు సభ్యులుగా వుంటూ, తమ సమైక్యతను చాటుతున్నారు. ఈ రోజు ప్రభుత్వ కార్యక్రమాలలో స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యం విస్మరించలేనిది. సాక్షర భారత్ కుటుంబ సర్వే కూడా స్వయం సహాయక సంఘాలచే చేపట్టిన విషయం విదితమే కనుక, సభ్యులైన వారు తాము కాని, తమ కుటుంబ సభ్యులు కాని, తమ బంధువులలో నిరక్షరాస్యులుగా ఉన్న వారిని అక్షరాస్యత, అభ్యసనా కేంద్రాలకు పంపడంలో సఫలం కాగలరు.

### ఆరోగ్యశాఖ

ప్రతి మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పర్యవేక్షకులు, ఎ.ఎన్.యం.లు, ఆశా వర్కర్లు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది అన్ని గ్రామాలలో పని చేస్తున్నారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతి నెలా గ్రామంలోని అన్ని కుటుంబాలను సందర్శించి ప్రజలకు ఆరోగ్యపరమైన సలహాలు మరియు సేవలను అందిస్తూ రోగాల వ్యాప్తిని నిరోధించడానికి ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవటానికి, మూఢనమ్మకాలను విస్మరించడానికి అక్షరాస్యత ఉపయోగకారిగా వుంటుందనే విషయాన్ని ఆరోగ్య కార్యకర్తలు / సిబ్బంది ద్వారా వారు సందర్శిస్తున్న కుటుంబాలలోని నిరక్షరాస్యులకు తెలియపరచినట్లయితే, వారిని అక్షరాస్యత వైపు మళ్ళించడం సాధ్యమవుతుంది.

### మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమాలలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఒకటి. ఈ పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ ఉపాధి అందుతున్నందున వలసలు నివారించబడ్డాయి. గత నాలుగు సంవత్సరాలుగా ఈ పథకం ద్వారా యస్.సి./యస్.టి. మరియు ఇతర బలహీన వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. క్షేత్ర స్థాయిలో ఈ పథకం అమలుకు క్షేత్ర సహాయకులు వున్నారు. వారు పని అవసరమైన కుటుంబాలను గుర్తించి, వారికి ప్రతి రోజూ జీవనోపాధి కల్పిస్తున్నందున గ్రామాలలో జాబ్ కార్డులు పొందిన కూలీలకు క్షేత్ర సహాయలపై విశ్వసనీయత వున్నది. జాబ్ కార్డు పొందిన నిరక్షరాస్యులైన కూలీలకు అక్ష్ర్యాస్యత వలన కలిగే ప్రయోజనాలు అనగా మస్టర్‌లో వ్రాసిన పేర్లను తెలుసుకోవడం, పనికి రాని పేర్లు నమోదు కాకుండా చేయడం, కొలతల నమోదును గుర్తించడం, బ్యాంకులు / పోస్టాఫీసులలో జరిగే లావాదేవీలపై అవగాహనకు దోహద పడటం వంటి ఉపయోగాలను తెలియపరచి, మస్టర్‌లో వేలి ముద్రలకు స్వస్తి పలికి అందరూ సంతకాలు చేసి మస్టర్‌లోని వివరాలు చదవకలిగే స్థాయికి రావలంటే, అక్షరాస్యతా కేంద్రాలకు వెళ్ళాలనే దృక్పధాన్ని కల్గించినట్లయితే, మంచి ఫలితాలను ఆశించవచ్చును.

### కార్యక్రమ విజయానికి మండల స్థాయి అధికారులు చేయదగ్గ పనులు

- **మండల విద్యాశాఖాధికారి :** ప్రతి నెల జరిగే ఉపాధ్యాయుల మండల స్థాయి మరియు క్లష్టర్ స్థాయి సమావేశాలలో పాఠశాలల వారీగా, విద్యార్థుల ద్వారా మొబిలైజ్ కాబడి అక్షరాస్యతా కేంద్రాలకు వెళ్తున్న నిరక్షరాస్యుల వివరాలపై సమీక్షించాలి.
- **ఇందిరా క్రాంతి పథం :** ప్రతి నెలా జరిగే గ్రామ సమాఖ్య సమావేశాలలో స్వయం సహాయక సంఘ సభ్యుల ద్వారా మొబిలైజ్ కాబడి అక్షరాస్యత కేంద్రాలకు వెళ్తున్న నిరక్షరాస్యుల వివరాలపై సమీక్షించాలి.
- **ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు :** ప్రతి నేల జరిగే ఆరోగ్య కార్యకర్తలు / ఆరోగ్య సిబ్బంది సమావేశాల ద్వారా మొబిలైజ్ కాబడి, అక్షరాస్యత కేంద్రాలకు వెళ్తున్న నిరక్షరాస్సుల వివరాలపై వైద్యాధికారులు సమీక్షించాలి.
- **అదనపు కార్యక్రమాధికారి :** ప్రతి వారం జరిగే సమావేశాలలో క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా మొబిలైజ్ కాబడి అక్షరాస్యత కేంద్రాలకు వెళ్తున్న నిరక్షరాస్యుల వివరాలపై సమీక్షించాలి.
- **పంచాయతీ కార్యదర్శి :** గ్రామ పంచాయితీ పరిధిలో పని చేస్తున్న పై శాఖలకు చెందిన క్షేత్రస్థాయి సిబ్బందితో మొబిలైజేషన్ టీము ద్వారా మొబిలైజ్ చేసి నెలకు ఒక్కసారి సర్పంచ్ అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని కార్యక్రమంపై సమీక్షించాలి. ఈ సమావేశాలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి హాజరుకావాలి.
- **మండల కో ఆర్డినేటరు :** అక్షరాస్యతా కేంద్రాలలో నమోదైన ప్రతి నిరక్షరాస్య వ్యక్తి ఎవరి ద్వారా ప్రభావితం కాబడి అక్షరాస్యత కేంద్రానికి వస్తున్నారని విషయాలను గ్రామ పంచాయితీ కో ఆర్డినేటర్ల ద్వారా సేకరించి, శాఖలవారీగా క్రోడీకరించి మండల పరిషత్ అభివృద్ధి అధికారికి ప్రతి నెలా 5వ తేదీన సమర్పించినట్లయితే వివిధ శాఖల సహకారం సాక్షర భారత్ విజయానికి ఏ విధంగా దోహదపడినదనే విషయం సంబంధిత అధికారులలో ప్రతి నెలా సమీక్షించటానికి అవకాశం కల్గుతుంది.

**మండల పరిషత్ అభివృద్ధి అధికారి,**

**కలకడ, చిత్తూరు జిల్లా**

# మహిళా ప్రజాప్రతినిధుల్లో చైతన్యం రావాలి!

**మన రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతానికి చెందిన 5.5 కోట్ల ప్రజలలో సుమారు 2.25 లక్షల మంది పంచాయతీరాజ్ సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సదరు సభ్యులలో కొంతమంది జిల్లా పరిషత్ ఛైర్మన్లుగా, జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులుగా, మండల పరిషత్ అధ్యక్షులుగా, మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులుగా, సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్లుగా ఉన్నారు. ఇందులో సుమారు మూడవ వంతు, అంటే సుమారు 70 వేల మంది మహిళా ప్రజాప్రతినిధులున్నారు. అందులో ఇంకా 60 శాతం స్థానిక ప్రభుత్వ విషయాల పై చైతన్యం కాలేకపోయినారంటే చాలా బాధాకరమైన విషయం.**

పలు రంగాలలో అభివృద్ధి జయకేతనం ఎగరవేస్తున్న మహిళలు స్థానిక పరిపాలనకు వచ్చేసరికి వెనుకంజలో వున్నారంటే చాలా ఆశ్చర్యకరం, బాధాకరం.

ప్రతి మగవాడి విజయానికి మహిళ సహకారం వుంటుందని సామాన్య ప్రజలు భావించినప్పటికీ స్థానిక పరిపాలన వచ్చేసరికి మహిళా ప్రజా ప్రతినిధుల పరిస్థితి ఇందుకు విరుద్ధంగా వుంది. ఈ పరిస్థితిలో మహిళా ప్రజా ప్రతినిధులు తమ విధులు స్వతంత్రంగా, నిర్భయంగా ఎందుకు నిర్వహించలేకపోతున్నారని పరిశీలిస్తే, పలు కారణాలు కన్పిస్తున్నాయి.

**అక్షరాస్యత:** మహిళా ప్రజాప్రతినిధులలో అధికశాతం నిరక్షరాస్యులవడం వల్ల తమ విధులను, నిబంధనలను తెలుసుకోలేక చాలా ఇబ్బంది పడుతున్నారు.

**కుటుంబ పరిస్థితి :** బీదరికంతో కుటుంబ జీవనం గడుపుతున్న వారు ధనికుల అభీష్టం మేరకు తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇంటి కార్యకలాపాలకే పరిమితి అవుతున్నారు.

**అల్పసంఖ్యాక వర్గాలు :** మన రాష్ట్రంలో ఉన్న మహిళా ప్రజాప్రతినిధులలో కూడా 15 శాతం షెడ్యూల్డు కులాలు, 6 శాతం షెడ్యూల్డు తెగల వారున్నారు. ముఖ్యంగా వీరందరూ వెనుకబడిన ప్రాంతాలలో ఉండడం వల్ల పరిపాలనానుభవం లేక ధనిక / కండబలం గల వర్గాలకు దాసోహమై, తమ విధులను నిర్వహిస్తున్నారు.

**భర్తల పాలన :** చాలా చోట్ల మహిళా ప్రతినిధుల బదులు వారి భర్తలు అధికార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అధికారిక సమావేశాలప్పుడు కూడా మహిళా ప్రతినిధుల ప్రక్కనే వారి భర్తలు కూర్చుని పరిపాలనకు సంబంధించిన ఆదేశాలిస్తున్నారు. అంతేకాక, తమ పరిధిలో గల పలు సంస్థల పర్యవేక్షణను కూడా మహిళల భర్తలే నిర్వహిస్తున్నారు. స్థానిక సంస్థలకు సంబంధించిన వాహనాలు కూడా మహిళా ప్రతినిధుల కంటే వారి భర్తలే అధికంగా వాడుతున్న సందర్భాలున్నాయి.

**అవగాహనా లోపం :** స్థానిక సమస్యల పరిపాలనకు సంబంధించి పంచాయతీరాజ్ చట్టంలో నిర్దేశించిన వివిధ నిబంధనలు, తమ అధికారాలు, బాధ్యతలు తెలియక, పరిపాలనలో భాగస్వాములు కాలేకపోతున్నారు.

**లైంగిక వేధింపులు :** కొన్నిచోట్ల మహిళా ప్రజాప్రతినిధులు పలు లైంగిక వేధింపులకు గురవుతున్నారు. మరి ఇటువంటి దుస్థితి నుంచి మహిళా ప్రజాప్రతినిధులు బయటకు రావలసి వుంది.

ఈ పరిస్థితులు మెరుగుపడాలంటే, వివిధ రకాలుగా మహిళలు చైతన్యవంతులు కావాలి. అవి :

**మహిళా సంఘాలు :** గ్రామీణ ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు కనీస విద్యను అభ్యసించాలి. అందుకు మహిళా సంఘాలు గ్రామీణ ప్రాంతాలలో వారి అక్షరాస్యతకు కృషి సల్పాలి.

**మహిళా ప్రజాప్రతినిధులు :** మహిళా ప్రజాప్రతినిధులు కూడా శ్రద్ధతో అక్షరాస్యత విలువ తెలుసుకొని, పంచాయతీరాజ్ చట్టంలోని అంశాలు తెల్సుకోవటానికి చొరవ చూపాలి. ప్రభుత్వం, మహిళా సంఘాలు నిర్వహించే అవగాహనా సదస్సులకు తప్పక హాజరవ్వాలి. ఆదాయ వ్యయాలను ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించాలి. మహిళా ఆక్రందనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.



**అవగాహన సదస్సులు :** మహిళా ప్రజాప్రతినిధులకు చట్టపరమైన అంశాలు తెలియజేయడానికి ప్రతి నెలకొకసారి మండల, డివిజనల్, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో అవగాహనా సదస్సులను సంఘంలో ప్రాముఖ్యత గల మహిళల ద్వారా నిర్వహించాలి. తద్వారా మహిళలు త్వరగా చైతన్యవంతులు కాగలరు. ఇందుకు ప్రభుత్వం చొరవ చూపాలి.

**బాధ్యతలు :** మహిళా ప్రజాప్రతినిధులు చైతన్యం కావాలి. తమ భర్తలకు తాము హాజరయ్యే అధికార సమావేశంలో చర్చలకు, సందేశాలకు అవకాశమివ్వరాదు. ఇట్లా అవకాశమిస్తే, అది మహిళా ప్రజాప్రతినిధులను అవమానించినట్లుగా భావించాలి. ఎట్టి పరిస్థితులలోను ధనిక/ అనైతిక ఒత్తిడులకు లోనై తమ విధులను నిర్వహించరాదు.

**చట్ట పరిరక్షణ :** మహిళా ప్రజాప్రతినిధులు లైంగిక వేధింపులకు గురి అయిన సందర్భంలో మహిళా పోలీసు అధికార్ల, సంఘం సహకారం తీసుకోవడానికి వెనుకంజ వేయరాదు.

పై విధంగా మహిళా ప్రజాప్రతినిధులు చైతన్యవంతులయినప్పుడే, ప్రజలు తమకు అందించిన అధికార పగ్గాలను స్వేచ్ఛగా, నిర్భయంగా చట్టపర నిబంధనల మేరకు నిర్వహించడంలో సఫలీకృతుల వుతున్నారనటంలో సందేహం లేదు. మరి మహిళా ప్రజాప్రతినిధులు చైతన్యవంతులు కండి. స్థానిక సంస్థల పరిపాలనను పురుష ప్రతినిధుల కంటే సమర్థవంతంగా నిర్వహించడానికి సమాయత్తం కావాలని, అందుకు మహిళా కమిషన్, ప్రభుత్వం సహకారం అందజేస్తామని ఆకాంక్షిద్దాం.

*- సిఎంపి*



Sthanika_BW_Oct13.indd 22 17/10/13 5:25 PM

# భరోసా!

– సి.వి. సర్వేశ్వర శర్మ

**ఊరంతా సందడిగా ఉంది. బ్యానర్లతో కళకళలాడి పోతోంది. ముఖ్యంగా గరల్స్ హైస్కూలు చాలా మంది దృష్టిని ఆకర్షించేదిగా తయారయ్యింది. అనేక మంది మహిళలు ఎన్నో రకాలయిన డిజైన్లు, రంగులు గల చీరలు ధరించి గరల్స్ హైస్కూలులో హడావిడిగా తిరుగుతున్నారు. ఆ రోజు ఆదివారం. అసలు సంగతి ఏమిటంటే కొత్తగా ఏర్పడిన మహిళా మండలి ప్రారంభోత్సవ వేడుక జరపబోతున్నారు ఆ రోజు.**

చిన్న సైజు టౌనుగా తయారయిన ఆ ఊళ్లో రామదాసు ఒక వ్యాపార వేత్తగా గుర్తింపు తెచ్చుకున్నాడు. రామదాసు సతీమణి అంజలి ఈ మహిళా మండలికి అధ్యక్షురాలిగా ప్రమాణస్వీకారం చేయబోతోంది. అంజలికి ఆ జిల్లాకు కొత్తగా వచ్చిన మహిళా కలెక్టర్‌తో గతంలోనే పరిచయం ఉంది. ఆమెచేత మహిళా మండలి ప్రారంభోత్సవం చేయిస్తోంది అంజలి.

కొత్త కలెక్టర్ గారు తమ టౌన్‌కు వస్తున్నారని తెలియడంతో టౌన్‌లో కొంతమంది ప్రముఖులు కలెక్టర్ గార్ని కలిసేందుకు గరల్స్ స్కూలుకి వచ్చారు. గరల్స్ స్కూలులోని ఆడిటోరియంను మహిళలు బాగా ముస్తాబు చేశారు.

ఆడిటోరియంకు సమీపంలో వున్న హెడ్‌మిస్ట్రెస్ గదిని కూడా బాగా అలంకరించారు. కలెక్టరు రాగానే ఆమెను ఆ గదిలోకి తీసుకు వెళ్లి కూర్చోబెట్టి మర్యాదల అనంతరం ఆడిటోరియంలోకి తీసుకు వెళ్లవచ్చునని అంజలి ఆలోచన. అంతేగాకుండా తనకు తెలిసిన కొంతమంది స్థానిక మహిళలను కలెక్టరుకు పరిచయం చేయాలని ఆమె కోరిక.

ఉదయం పదిగంటలయ్యింది. అనుకున్న సమయానికి కలెక్టరు నందిని వచ్చేసింది. అంజలితోపాటు ఇతర మహిళలు, ఇతర ప్రముఖులు ఆమెకు స్వాగతం పలికారు. అంజలి ఆశించినట్లు కాకుండా నందిని సరాసరి ఆడిటోరియం వైపు అడుగులు వేయడం ప్రారంభించింది.

కలెక్టరు రాకతో ఆడిటోరియం కరతాళధ్వనులతో మారు మ్రోగి పోయింది. మహిళా మండలి సభ్యురాలు జలజ అతిథులను వేదిక మీదకు ఆహ్వానించింది. క్లోజుడు ఆడిటోరియం కావడం వల్ల ఆడిటోరియంలోని సీట్లలో ఎక్కువమంది మహిళలు ఉండడం వల్ల కొత్త కళ ఉట్టిపడుతున్నట్లుంది.

సభ ప్రారంభమయ్యింది. మహిళా మండలిని కలెక్టరు లాంఛనంగా ప్రారంభించింది. అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర కార్యవర్గ సభ్యుల ను సభకు అంజలి పరిచయం చేసిన తరువాత వారి చేత ప్రమాణ స్వీకారాలు చేయించారు. ఆ టౌనులో ఇటువంటి మహిళా సదస్సు జరగడం అదే ప్రథమం కావడం వల్ల మీడియా ముందుకు వచ్చి కవరేజ్ బాగా చేసే ప్రయత్నంలో ఉంది.

కలెక్టరు నందిని తన సందేశంలో 'మహిళా శక్తి సమాజ ప్రగతికి వినియోగపడాలని' పిలుపునిచ్చింది. వక్తలు పలువురు క్లుప్తంగా మాట్లాడారు. సభానంతరం సాంస్కృతిక కార్యక్రమాలు మొదలయ్యాయి. పాటలు, నృత్యాలు, సంగీత రూపకాలు వంటి వాటిని ప్రదర్శిస్తున్నారు.


కలెక్టరు కొంత సేపు వినోద కార్యక్రమాలను తిలకించి ఆడిటోరియం నుండి బయటకు వచ్చింది. అంజలి సమయాన్ని కనిపెట్టి కలెక్టరును హెడ్‌మిస్ట్రెస్ రూమ్ వైపునకు రమ్మని ఆహ్వానించింది.

కలెక్టరు అటువైపు వెడుతుంటే నలభయి అయిదేళ్ల ఆసామీ "నమస్కారమండి" అన్నాడు. కలెక్టరు అతనిని పట్టించుకున్నట్లు కనపడక ముందుకు అడుగులు వేసింది.

ఆ ఆసామీ కలెక్టరు వెనుక వేగంగా అడుగులు వేసుకుంటూ "మేడమ్! మిమ్మల్ని కలవడానికి ఇందుమతి వచ్చింది" అన్నాడు.

నందిని ఆగింది. "ఇందూ వచ్చిందా?" అప్రయత్నంగా అంది. ఆ ఆసామీ కేసి అసహనంగా చూసింది.

ఆడిటోరియం అరుగుమీద నుంచున్న ఇందుమతి కేసి వెనుతిరిగి చూసిన నందిని. ఆమెను రమ్మని చేతితో సైగ చేసింది. తరువాత గబగబా అడుగులు వేసుకుంటూ హెడ్‌మిస్ట్రెస్ రూమ్‌లోకి వెళ్లి కూర్చుంది నందిని.




కలెక్టరుతో మాట్లాడాలని చాలా మంది ఉబలాట పడుతున్నారు. కొంతమంది మహిళలు అడిగే ప్రశ్నలకు నందిని జవాబులు చెబుతూ, ఇందుమతి రాకకోనం ఎదురు చూస్తోంది. ఇందుమతిని తీసుకుని ఆ ఆసామీ వచ్చాడు. వారిద్దరూ రూమ్ బయట అరుగుమీద నుంచున్నారు.

కలెక్టరు పి.ఎ.తో ఏదో చెప్పడంతో వెంటనే గదిలోని వారంతా బయటకు



Sthanika_BW_Oct13.indd 26 17/10/13 5:25 PM




వెళ్లమని పి.ఎ. చెప్పాడు. గదిబయట నుంచునివున్న ఇందుమతిని గదిలోకి రమ్మని ఆహ్వానించాడు.

గదిలో కలెక్టరు నందిని, ఇందుమతి వున్నారు. ఆ చుట్టు పక్కల ఎవరూ లేకుండా చేశాడు పి.ఎ. గది తలుపులు దగ్గరకు వేశాడు. ఇందుమతిని కూర్చోమని కూర్చీ చూపించింది నందిని. ఇందుమతి కూర్చోలేదు.

ఇందుమతిని తీసుకువచ్చిన ఆసామీ ఎవరు అడ్డుపెట్టినా ఆగకుండా గదిలోకి వచ్చాడు. "మేడమ్! నాపేరు గణపతి. ఇందుమతి నా భార్య" అని పరిచయం చేసుకున్నాడు.

అతని మాటలను పట్టించుకోకుండా "ఇందూ! కూర్చో!! మీ అమ్మగారు, నాన్నగారు ఎలా ఉన్నారు? నీకు పిల్లలు ఎంతమంది?" ఆప్యాయంగా అడిగింది నందిని.

ఇందుమతి కన్నీళ్లు పెట్టుకుంది.

"వారిద్దరు కాలం చేశారు" గణపతి జవాబు చెప్పాడు. గణపతి మాటలు కలెక్టరు వింటున్నట్లు లేదు. ఆమె దృష్టి ఇందుమతి మీదనే ఉంది.

"మాకు ఇద్దరు కుమారులు. పెద్ద వాడు టెన్త్, రెండవవాడు సెవన్త్" గణపతి మళ్లీ చెప్పాడు.

ఇందుమతిని చూస్తూంటే నందినికి ఎంతో ఆశ్చర్యంగా ఉంది. ఇందుమతిలో హుందాతనం ఏమయ్యింది? ఆమె అందం ఏమయి పోయింది? ఇందుమతికి కళ్ల భాషే తప్ప నోటి భాష మరచినట్లుంది. నందిని పి.ఎ.ను పిలిచి ఏదో చెప్పింది. పి.ఎ. వెళ్లిపోయాడు.

నందినికి గతం గుర్తుకు రాసాగింది.

* * * * *

**తా**నూ, ఇందూ ఇదే గరల్స్ హైస్కూలులో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుకున్నారు. అప్పట్లో ఇందూ అమ్మగారు, నాన్నగారు అక్కడ చాలా పేరున్న డాక్టర్లు. తను స్కూలుకు కార్లో వచ్చేది. మొత్తం స్కూలుకు ఇందూ పెద్ద ఆకర్షణగా ఉండేది. టీచర్లు అందరూ ఇందూను ఎంతో గౌరవంగా, మర్యాదగా చూసేవారు.

తన తండ్రి స్కూలు టీచరు. తండ్రి తనకు ఏ విషయంలోను సహాయం చేయగల స్థితిలో ఉండేవారు కాదు. సమస్యలు ఎదురయినపుడు అంత చిన్న వయసులోనే తానే పరిష్కరించు కోవలసి వచ్చేది.

ఇంటిదగ్గర పని ఉండి రెండు రోజులు స్కూలు మానేస్తే ఆ రెండు రోజులు చెప్పిన పాఠాలు, టీచర్లు చెప్పిన నోట్సులు రాసుకుని చదువుకోవలసి వచ్చేది. టీచర్లు తిట్టే తిట్లు భరించాల్సి వచ్చేది.

ఇందుమతి స్కూలుకు రాకపోతే నోట్సులు బాగా రాసేవారి చేత రాయించి ఆమెకు ఇచ్చేవారు. ఆమె వినని పాఠాల ను ఆమెకు చెప్పేందుకు టీచర్లు ఇందుమతి ఇంటికి వెళ్లి చేప్పేవారు. ఇందుమతిని ఆమె తల్లిదండ్రులు చాలా గారంగా చూసేవారు. ఇందుమతి అంటే అందరికీ అంత ఇష్టానికి కారణం ఆమె ఎంత సౌందర్యవతో, అంత వినయశీలి. ఆపైన ఎంతో మర్యాదగా ప్రవర్తించే ఆమె నైజం.

తాము చదువుకున్న రోజుల్లో వున్న టీచర్లు ఎవరూ ఇప్పుడు ఆ స్కూల్లో లేరు. తమతో చదువుకున్న వారికి పెళ్లిళ్లు అయిపోయి ఎక్కడెక్కడో సెటిల్ అయ్యారు. తన చిన్ననాటి స్నేహితురాలు ఇందుమతిని చూడగానే ఎంతో అనుభూతికి లోనయ్యింది నందిని. ఇందుమతి ఎన్నడూ ఎటువంటి సమస్య ఎదుర్కోవలసిన అవసరం కలగకుండా తల్లిదండ్రులు ఆమెను పెంచారు.

టెన్త్ అయిపోయిన తరువాత తను హైదరాబాద్‌లో ఇంటర్, ఇంజనీరింగ్ చదివింది. ఎంతో పట్టుదలతో కృషి చేసి తన లక్ష్యం ఐ.ఎ.యస్. సాధించింది. ఇరవై అయిదేళ్ల తరువాత తను చదువుకున్న స్కూల్లోనే మళ్లీ ఇందుమతిని చూసింది నందిని.

ఇంతలో పి.ఎ. వచ్చాడు.

ఇందుమతి చేతిలో పి.ఎ. తీసుకువచ్చిన పళ్లు, పువ్వులు పెట్టింది నందిని. ఇందుమతి కళ్లల్లో ఆప్యాయత, కృతజ్ఞత కన్పించాయి నందినికి.

నందిని బయలు దేరబోతూంటే "మేడమ్! మీతో పనుండి వచ్చాము" అన్నాడు గణపతి.

"ఇందూ! నాకు చాలా అర్జంటు పనులువున్నాయి. వచ్చే ఆదివారం కారు పంపిస్తాను. కలెక్టరు బంగళాకు రండి" అని నందిని అంది. తలూపింది ఇందుమతి.

"తప్పకుండా వస్తాము!" గణపతి జవాబు ఇచ్చాడు.

కలెక్టరు నందిని వెళ్లిపోయింది.

* * * * *

**ఆ**దివారం రానే వచ్చింది. నందిని పంపిన కారులో ఇందుమతి, గణపతి కలెక్టరు బంగళాకు వెళ్లారు. ఎంతో ఆప్యాయంగా ఇందుమతిని ఆహ్వానించింది కలెక్టరు నందిని. ఇందుమతి ఎప్పుడూ పెద్దగా చురుగ్గా ఉండేది కాదు. కాని మరీ ఇంత స్తబ్దతగా తయారవ్వడం నందినికి ఎంతో ఆశ్చర్యంగా అన్పించింది.

బంగాళాలో హాల్లో కూర్చున్నారు. ఒక పెద్ద సోఫా. దాని ఎదురుగా రెండు చిన్న సోఫాలు ఒక దాని పక్కన మరొకటి వున్నాయి. పెద్ద సోఫాకు ఎడమ, కుడివైపున రెండేసి కూర్చీ తరహా సోఫాలు వున్నాయి. ఈ చదరపు అమరికలోకి వచ్చేందుకు, వెళ్లేందుకు సోఫాల మధ్య ఖాళీలు వున్నాయి.

పెద్ద సోఫాలో ఇందుమతి, ఆమె పక్కన నందిని కూర్చున్నారు.



Sthanika_BW_Oct13.indd 27 17/10/13 5:25 PM

వారి ఎదురుగా వున్న సోఫాలో గణపతి కూర్చున్నాడు. కాఫీ, టిఫిన్‌లు వచ్చాయి. నందిని బలవంతం చేసేసరికి ఇందుమతి కొద్దిగా కాఫీ తాగింది. గణపతి కాఫీ, టిఫిన్‌లు తీసుకున్నాడు.

చిన్ననాటి కబుర్లు నందిని గుర్తు చేస్తుంటే ఇందుమతి వింటోంది. కళ్లతో అవును, కాదు అనే భావాలు ప్రదర్శిస్తోంది. అప్పుడప్పుడు తలూపుతోంది. ఇందుమతి ధోరణి చూస్తే ఆమె జీవితంలో అంత ఆనందంగా ఉన్నట్లు అన్పించలేదు నందినికి.

కొద్ది సమయం వారి మధ్య నిశ్శబ్దం. నందిని టైం చూసుకుంది. "నాతో పని అన్నారు. ఏమిటి?" అని నందిని అడిగింది. ఇందుమతి వింటోంది. గణపతి మాట్లాడడం మొదలు పెట్టాడు.

"మా టౌన్‌కు నీరు గోదావరి నుండి కాలవ ద్వారా వస్తుంది. ఆ కాలువ రివిటింగ్‌కు కాంట్రాక్టు టెండర్లు పిలిచారు. అది మాకు వచ్చేటట్లు మీరు కొంచెం సిఫార్సు చేయాలి"

"అది ఇంజనీరింగ్ డిపార్టు మెంట్ పని" నందిని గణపతి కేసి చూసి కొంచెం అసహనం ప్రదర్శిస్తూ చెప్పింది.

"మేడమ్! మీరు ఈ జిల్లా కలెక్టరు. మీరు ఒక మాట చెబితే వారు కాదనరు. ఈ కాంట్రాక్టు మాకు వస్తే ఇబ్బందులు కొంత తగ్గుతాయి" అభ్యర్ధనగా గణపతి అన్నాడు.

గణపతి మాటలు విన్న నందిని ఎంతో ఆశ్చర్యానికి గురయ్యింది.

హాల్లోనే పై అంతస్తుకి వెళ్లే మెట్లు వున్నాయి. పై అంతస్తులో గదులు వున్నాయి. గదులకు వెళ్లాలంటే మెట్లెక్కి బాల్కనీ వలె విస్తరించి వున్న దాని నుండి వెళ్లాలి. ఈ బాల్కనీ దాదాపు సోఫాలు వున్న ప్రదేశం వరకు విస్తరించి ఉంది.

నందిని ఇందుమతి కేసి చూసింది. ఆమె చెయ్యి పట్టుకుని తనతో పాటు పై అంతస్తులోకి తీసుకువెళ్లింది. గణపతి ఒక్కడు హాల్లో కూర్చుని ఉండిపోయాడు.

ఇందుమతిని తన ప్రయివేటు గదిలోకి తీసుకువెళ్లింది నందిని. ఇందుమతి ముఖంలో కొంత స్వేచ్ఛావాతావరణం కన్పించింది.

"నీ వ్యక్తి గత విషయాలు అడిగాననుకోకు! మీకు బోలెడంత ఆస్తి ఉంది కదా! మీ తల్లిదండ్రులకు నువ్వు ఏకైక సంతానం కదా! నీ భర్త ఆర్థిక ఇబ్బందులు అంటున్నాడేమిటి?" నందిని ఎంతో అభిమానంగా చనువుగా అడిగింది.

నందిని, ఇందుమతి ఎదురెదురుగా వున్న కుర్చీల్లో కూర్చున్నారు. గదిలో ఎక్కువగా సామాన్లు లేవు. ఒక వైపున డబుల్ కాట్, దానిమీద ఫోమ్ పరుపుపై ఆకర్షణీయంగా ఉండే దుప్పటి తలగడాలు. దానికి కొంచెం దూరంలో టీపాయ్. టీపాయ్‌కి ఎదురెదురుగా కుర్చీలు. టీపాయ్‌మీద రెండు మూడు ఫైల్స్. వాటి పక్కన తెల్ల కాగితాల ప్యాడ్ వంటివి ఉన్నాయి. పెన్నులున్న స్టాండ్, వాటిలో పెన్నులు.

ఇందుమతి కొంత సేపు మౌనంగా ఉంది. "ఇందూ! అలా మౌనంగా ఉన్నావేమిటీ? మన స్నేహం మరిచావా? మాట్లాడు" కొంచెం లాలింపు ధోరణిలో అంది నందిని.

"మా ఆస్తిలో చాలా భాగం ఆయన అమ్మేశారు. అంతా ఆయన చూస్తున్నారని ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెట్టేశాను' ఇందుమతి చెబుతుంటే ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

నందినికి ఎన్నెన్నో ఆశ్చర్యకరమైన సంగతులు చెప్పింది ఇందుమతి.

ఇందుమతికి మంచి సంబంధం చూసి పెళ్లిచేశారు. ఆమె తల్లిదండ్రులు. పెళ్లికొడుకు అమెరికాలో డాక్టర్. ఆర్నెల్లు గడిచిన తరువాత ఇందుమతి మీద విముఖత కల్గింది ఆ డాక్టర్‌కు. ఆ డాక్టర్ అలవాట్లు వేరు. ఇందుమతికి గల క్రమ శిక్షణ, సత్ప్రవర్తన అతనికి నచ్చలేదు. ఎవరికీ తెలియకుండా ఇందుమతి తల్లిదండ్రుల అనుమతితో ఇందుమతికి విడాకులు ఇచ్చాడు ఆ డాక్టర్.

తమ బిడ్డ బతుకు అల్లరి అయిపోతుందని, కుటుంబ గౌరవం బజారు పాలవుతుందని భయపడిన ఇందుమతి తల్లిదండ్రులు విడాకులకు అంగీకరించారు. తమ బిడ్డ మానసికంగా నలగడం వారు ఇష్టపడలేదు.

ఇందుమతి బోలెడంత ఆస్తికి వారసురాలు. ఆమె భవిష్యత్ తల్లిదండ్రులకు పెద సమస్యగా తయారయ్యింది. తమ బిడ్డ సంతోషమే జీవిత ధ్యేయంగా పెట్టుకున్న తల్లిదండ్రులకు 'ఇందుమతి' గురించి ఆందోళన మొదలయ్యింది.

ఇందుమతి తండ్రి డాక్టర్ రంగారావు. అతనికి పరిచయస్థుడు వెంకట్రావు. కోర్టులో గుమాస్తాగా పనిచేసి రిటైరయ్యాడు. వెంకట్రావు కొడుకు గణపతి ఇంజనీరింగ్ చదివాడు. పరీక్షలు రాయలేదు.

సమయం, సందర్భం చూసుకుని డాక్టర్ రంగారావుతో వెంకట్రావు తన మనసులోని మాటచెప్పాడు.

"మీరంటే నాకుఎంతో గౌరవం. మీ అమ్మాయి విషయంలో మీరు ఆందోళన పడనవసరం లేదు. మళ్లీ పెళ్లి చెయ్యవచ్చు. ఆమెకు కొత్త జీవితం ఇవ్వవచ్చు" అన్నాడు.

"మగవాడికి రెండవ పెళ్లి అయినంత సులువుగా ఆడపిల్లకు అవుతుందా? ఎవరు ముందుకు వస్తారు?" డాక్టర్ రంగారావు బదులిచ్చాడు.

"మీకు అభ్యంతరం లేకపోతే, ఆమెను కోడలిగా నేను అంగీకరిస్తాను" అన్నాడు వెంకట్రావు.

డాక్టర్ రంగారావు, తన భార్య డాక్టర్ భారతితో ఆలోచించాడు. వెంకట్రావు నెమ్మదస్తుడు. తనంతట తను ఇందుమతిని కోడలిగా చేసుకునేందుకు ముందుకు వస్తున్నాడు. అవకాశాన్ని జార విడుచుకోవడం వివేకం కాదనుకున్నారు దంపతులు.

ఫలితంగా ఇందుమతి గణపతి భార్య అయ్యింది. వీరి పెళ్లయిన కొద్ది నెలలకే కారు ప్రమాదంలో డాక్టర్ రంగారావు, డాక్టర్ భారతీలు దుర్మరణం పాలయ్యారు.

గణపతి ఇందుమతిని తల్లి చేశాడు గాని, భర్తగా, తండ్రిగా బాధ్యతలు స్వీకరించలేదు. అత్తవారి ఆగడాలు ఎక్కువ అయ్యాయి. వారి వారి స్వార్ధాలకు ఇందుమతి ఆస్తి కరిగిపోయింది. అత్తవారు ఆర్థికంగా బలపడ్డారు.

చదువుకునే రోజుల్లో ఇందుమతికి మంచి మార్కులు వచ్చేవి. ఆమె తెలివైనది. తల్లిదండ్రుల నీడలో పెరిగిన ఆమెకు సవాళ్లు అంటే తెలియ లేదు. వాటిని ఎదుర్కోవలసిన అవసరం కలుగలేదు. అన్నీ తన మంచికే జరుగుతున్నాయనే భ్రమలోనే ఉండి పోయింది. ఇంటర్ చదువు పూర్తి కాకుండానే ఆమెకు పెళ్లి అయ్యింది. అందుకే ఇంక చదవలేదు.

'ఇందుమతి జీవితాన్ని ఎలాగైనా సరిదిద్దాలి' నందిని నిర్ణయించుకుంది 'తాను ఎంత వరకు చేయగలదు?' నందిని తనను తాను ప్రశ్నించుకుంది. 'తన ప్రయత్నం తాను చేయాలి' సమాధాన పడింది.



Sthanika_BW_Oct13.indd 28 17/10/13 5:25 PM

"నీ పేరున ఇంకా పది ఎకరాల పొలం ఉందంటున్నావు. దాని పెత్తనం, బాధ్యత నువ్వు తీసుకో! నీ పిల్లల్ని నువ్వు కాపాడుకోవాలి. నువ్వు నోరు తెరచి ప్రతిఘటించకపోతే నీ బ్రతుకు మరింత కష్టాల పాలవుతుంది" నందిని సున్నితమైన విధానంలో సలహా ఇచ్చింది.

"మాట్లాడితే చాలు! జాలి కొద్దీ నిన్ను పెళ్లి చేసుకున్నాను. నిన్ను తన్ని తగలేస్తే నీకు దిక్కెవరు?" అని ఆయన బెదిరిస్తూ ఉంటారు. అసలు సంగతి చెప్పింది ఇందుమతి.

"నువ్వు తెలివైన దానివి. నీ దురదృష్టం కొద్దీ పరిస్థితులు ఇలా తయారయ్యాయి. ఇప్పుడు నీకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వాళ్లిద్దరూ నీకు అండగా ఉంటారు. నేను నీకు అండగా ఉంటాను. ధైర్యంగా మాట్లాడడం అలవరచుకో" నందిని చెప్పింది.

"మేము ఉంటున్న ఇల్లు టౌనుకు దూరంగా ఉంది. వాళ్లు నన్ను చంపేస్తే నా పిల్లలు ఏమయిపోతారు?" అమాయకంగా అడిగింది ఇందుమతి.

"ఎందుకు చంపుతారు? ఎదురు తిరగనంత సేపు ప్రతి ఒక్కరు ఏదో ఒకటి అంటారు. ఒక్కసారి గట్టిగా ఎదురుతిరిగితే నీ జోలికి ఎవరూ రారు. నీ డబ్బుతో వారు సర్వసుఖాలు అనుభవిస్తూ నిన్ను కష్ట పెట్టడం నాకు నచ్చలేదు" ఇందుమతిలో ధైర్యం నింపసాగింది నందిని.

"నాకూ నచ్చలేదు! అమ్మా, నాన్న ఉంటే వాళ్లు చూసుకునే వారు. ఇప్పుడు నన్ను చూసేవారు లేరు. ఆయన నా మంచి చెడ్డలు పట్టించుకోరు. 'మనిద్దరం చిన్నప్పుడు కలసి చదువుకున్నాం' అని చెప్పాను. ఇప్పుడు నన్ను అడ్డం పెట్టుకుని మీ చేత పని చేయించుకోవాలని ఆయన ఆలోచన" ఇందుమతి తన సంగతులు చెప్పింది.

"నీకు ఇష్టం లేదా?" నందిని అడిగింది.

"ఒకరికి ఇవ్వడమేగాని, ఒకరిని అడగడం మా అమ్మ, నాన్న నాకు నేర్పలేదు" ఇందుమతిలో ఆ ఠీవి అలాగే ఉంది.

"ఇంత ఆలోచనా పరిపక్వతగల నువ్వు ఎందుకు మౌనంగా వాళ్లను భరిస్తున్నావు? నిన్ను నేను చూస్తాను. నీ మీద ఎవరైనా అనవసరపు పెత్తనం చెలాయిస్తే నాపేరు చెప్పు. ఎదురు తిరుగు. అవసరమైతే నీకు రక్షణగా నేను ఉంటాను" ఇందుమతికి భరోసాగా చెప్పింది నందిని.

"నా పిల్లల్ని ఏమైనా చేస్తారేమోనని భయం" ఇందుమతి తన సందేహాన్ని వెలిబుచ్చింది.

"ఆ పిల్లలు నీకే కాదు. మీ ఆయనకూ పిల్లలే. మీ అత్తమామలకు మనుమలు. వాళ్ల జోలికి వెళ్లరు. ఒక్క ఫోను కొట్టానంటే మీ రంగులు బయట పడతాయి, అని ఎదురు తిరగడం నేర్చుకో" నందిని మెల్లి మెల్లగా ఇందుమతిలో ఆత్మవిశ్వాసం నింపింది.

ఇందుమతిలో ఆలోచన, విశ్లేషణ, పరిష్కార మార్గాలు అన్వేషించగల శక్తి సామర్థ్యాలు వున్నాయని నందిని నమ్మిక. అవి పెరిగే అవకాశం ఆమెకు ఎప్పుడూ కలగనివ్వ లేదు. ఆమెలోని శక్తులకు ప్రాణం పొయ్యాలంటే ఆమె మీద ఆమెకు నమ్మకం, విశ్వాసం కల్గిస్తే సరి పోతుందని భావించింది నందిని.

"మీ తోటలపై వచ్చే ఆదాయంపై ఆరా తియ్యి. డబ్బు పెత్తనం




నీ చేతిలోకి తీసుకో. నువ్వు ఇస్తే వాళ్లు తీసుకోవాలి గాని నీ అనుమతి లేకుండా వారేమీ తీసుకోవడానికి వీలులేదు. నీలో నిద్రపోతున్న ధైర్యాన్ని మేల్కొలుపు. నీ గురించి ఎంతగానో ఊహించాను. అవన్నీ నువ్వు నిజం చెయ్యాలి" నందిని మాటలకు ఇందుమతి ముఖంలో సంతోషం కన్పిస్తోంది. తలూపింది.

"తలూపడం కాదు! నోటితో మాట్లాడడం మొదలుపెట్టు" అని నందిని చెప్పింది.

"మీరు చెప్పినట్లు చేస్తాను" ఇందుమతి ధైర్యంగా అంది.

"నీజోలికి ఎవరైనా వస్తే 'గృహ హింస' క్రింద వాళ్లని అరెస్టు చేయించి జైల్లో పెట్టిస్తాను. మీ ఊళ్లో పోలీసుల చేత నిఘా పెట్టిస్తాను" నందిని ఇందుమతికి మరింత ధైర్యాన్ని ఇచ్చింది.

తనకు ఎవరూ లేరనే భావం నుండి బయటపడింది ఇందుమతి. ఇందుమతికి బొట్టు పెట్టి కొత్త చీర, జాకెట్టు పళ్ళు, చేతిలో పెట్టింది నందిని. ఇందుమతి ఆశ్చర్యంగా చూసింది.

"కొత్త జీవితంలో అడుగుపెడుతున్న సందర్భంలో కానుక" అంది నందిని.

ఇద్దరూ మెట్లు దిగుతూ హాల్లోకి వచ్చారు. గణపతి ఎదురు చూస్తున్నాడు.

"వస్తాను! నందిని" ఇందుమతి మాటలకు ఖంగుతిన్నాడు గణపతి. ఇందుమతి ముఖంలో ఏదో తేడా కన్పించింది గణపతికి.

"మన పని సంగతి.... " గణపతి నసిగాడు.

"మీపని అయ్యింది.... నడవండి" ఉంటూ ఉత్సాహంగా అడుగులు వేస్తున్న ఇందుమతి వెనుక అడుగులు కలిపాడు గణపతి.

గారాబం, ప్రేమ, మమకారం, అనురాగం మొదలైన భావాలతో తల్లిదండ్రులు పిల్లల్లోని అంతర్గత శక్తులు ఎదిగే అవకాశం ఇవ్వకపోతే, పెద్దయ్యాక తమ సమస్యలు ఎవరైనా పరిష్కరించాలని వారి ఎదురుచూస్తారు.

కారులో వెడుతున్న ఇందుమతి కేసి చూసి తృప్తిగా నిట్టూర్చింది నందిని. ఆమె ఆ జిల్లాకు కలెక్టరు. పరిష్కారాలు ఆమెకు తెలుసు.

◆



Sthanika_BW_Oct13.indd 29 17/10/13 5:25 PM

# విశిష్ట వ్యక్తులు – కొన్ని ఉదాత్త ఘట్టాలు

"ప్రపంచంలో ఎక్కడా మానవులు లేరు. కేవలం వ్యక్తులే ఉన్నారు"

**- డాక్టర్ అలెక్సిస్ కెరెల్** (1873-1944)
వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత, రక్తనాళ శస్త్ర చికిత్సకు ఆద్యుడు

"ప్రతి "సాధారణ" మనిషి వాస్తవంగా సగటు మీదనే సాధారణ మనిషి"

**- సిగ్మండ్ ఫ్రాయిడ్** (1856-1939) ప్రఖ్యాత మనస్తత్వ శాస్త్రవేత్త

మనిషి మనసు మంచీ చెడుల సంఘర్షణా వేదిక. మంచిలో మనిషి అత్యున్నత శిఖరాలను చేరుకొనగలడు. అలాగే చెడులో అధః పాతాళానికి కూడా దిగజారగలడు. దీనిని గుర్తించి ఎప్పటికప్పుడు మనిషి తనలోని మంచిని పెంచుకోవాలని మహాభారతాది కావ్యాలు ఉద్బోధిస్తున్నాయి. ఈ క్రమంలో కొంతమంది విశిష్టవ్యక్తులు వారి జీవితాల్లో జరిగిన కొన్ని ఘటనలలో చూపిన ఉదాత్త దృక్పథాలను గురించి తెలుసుకొందాం.

**1. సర్ సి.వి. రామన్** (1888-1970) విజ్ఞాన శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన తొలి భారతీయుడే కాక, తొలి ఆసియా ఖండపు శాస్త్రజ్ఞుడు. ప్రస్తుత తమిళనాడులో సామాన్య కుటుంబంలో జన్మించి మదరాసు నగరంలో ఎమ్.ఏ. చదివి సివిల్ సర్వీసు పరీక్ష ద్వారా ఇండియన్ ఆడిట్ అండ్ అక్కౌంట్సు సర్వీసుకు ఎంపికై, అసిస్టెంట్



అక్కౌంటెంట్ జనరల్‌గా, తదుపరి డిప్యూటీ అక్కౌంటెంట్ జనరల్‌గా పది సంవత్సరాలు పనిచేశాడు. అందులో ఎక్కువ భాగం పనిచేసిన కలకత్తా నగరంలో రోజూ ఆఫీస్ ముగిసిన తరువాత ఇంటికి వెళ్ళే మార్గంలో ఉన్న ఇండియస్ అసోసియేషన్ ఫర్ కల్టివేషన్ ఆఫ్ సైన్స్‌లో రాత్రి పొద్దు పోయేవరకు గడిపి భౌతిక శాస్త్ర పరిశీలన, ప్రయోగాలు చేసేవాడు. చివరికి 1917 లో ఇక ఉండబట్టలేక ఆనాటి కలకత్తా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ సర్ అశుతోశ్ ముఖర్జీ ఆహ్వానంపై ఆ విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర ఆచార్యుడుగా చేరటానికి అంగీకరించాడు. ప్రభుత్వంలోని ఉన్నతోద్యోగానికి రాజీనామా చేసి తక్కువ జీతంపై చేరటానికి సమ్మతించినా, చేరే ముందు విదేశాల్లో ట్రైనింగ్ పొందాలనే ఆనాటి నిబంధనను తన స్వాభిమానం, దేశ గౌరవం దృష్ట్యా పట్టు పట్టి మరీ సడలింపచేసుకొన్నాడు. అప్పటి నుంచి జీవితమంతా భౌతిక శాస్త్ర పరిశోధనకే అంకితమయ్యాడు 200 రూపాయల పరికరాలతో కాంతి తరంగాలకు సంబంధించిన "రామన్ ఎఫెక్ట్"ను కనుగొని 1930 లో నోబెల్ బహుమతి సాధించాడు.

అతని విద్యార్థులలో కె.ఎస్.కృష్ణన్, విక్రమ్ సారాభాయి, జి.ఎన్. రామచంద్రన్, భగవంతం, నాగేంద్రనాథ్ లాంటివారు సుప్రసిద్ధ శాస్త్రజ్ఞులయ్యారు. కలకత్తా విశ్వవిద్యాలయంలో 15 సంవత్సరాలు పని చేసిన తరువాత బెంగుళూరుకు మారి అక్కడే స్థిరపడ్డాడు. బెంగుళూరులోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ప్రస్తుత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్) లో చాలా సంవత్సరాలు పని చేసిన తరువాత సి.వి.రామన్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌ను నెలకొల్పి తన చివరి రోజు వరకు అక్కడే పరిశోధనలు గావించాడు.

స్వతంత్ర భావాలు కలిగిన సి.వి.రామన్ 1937లో బెంగుళూరులో తను పనిచేస్తున్న సంస్థలో ఒక దశలో అత్యంత ప్రతికూల పరిస్థితులనెదుర్కొని విసిగి వేసారి భారతదేశాన్ని వదలి పెట్టి యూరప్‌లోని ఆమ్‌స్టర్ డామ్ విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్ర ఆచార్యుడుగా చేరటానికి సన్నద్ధుడయ్యాడు. ఇది తెలుసుకొని అప్పటి ఆంధ్రవిశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ సర్ కట్టమంచి రామలింగారెడ్డి తన విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న భౌతిక శాస్త్ర ఆచార్య పదవిని స్వీకరించమని మరీ మరీ కోరుతూ సి.వి.రామన్‌కు లేఖలు వ్రాయటం

జరిగింది. దీనికి సి.వి.రామన్ జవాబు వ్రాస్తూ కట్టమంచి రామలింగా రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ, ఆ పదవిలో చేరటానికి అయిష్టతను వ్యక్తపరిచాడు. ఎందుకంటే ఆంధ్ర విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్ర ఆచార్యుడుగా తను చేరితే అది అప్పటికే ఆ శాఖలో పనిచేస్తున్న అత్యంత ప్రతిభావంతులు, తన ఒకప్పటి విద్యార్థులు భగవంతం, నాగేంద్రనాథ్‌ల పురోగతికి అవరోధమతుందని విశదీకరించాడు. (ఆ రోజుల్లో విశ్వవిద్యాలయల్లో ఆచార్యపదవి ఒక్కోశాఖలో ఒక్కటే ఉండేది.) ఎంతటి ఉదాత్తమైన భావం! ఎంతటి శిష్య వాత్సల్యం !

**2. ఫీల్డ్ మార్షల్ కె.ఎమ్. కరియప్ప** (1899-1993) స్వతంత్ర్య భారత దేశపు తొలిసైన్యాధిపతి. ప్రస్తుత కర్నాటక రాష్టానికి చెందిన కరియప్ప మదరాస్ నగరంలోని ప్రెసిడెన్సి కాలేజిలో చదువుకొని 1919లో బ్రిటిష్ సైన్యంలో అధికారిగా చేరి 1953లో భారత సైనిక దళాధిపతిగా పదవీ విరమణ చేశాడు. తదుపరి ఆస్ట్రేలియాకు భారత హైకమీషనర్‌గా పని చేశాడు. సంగీతం, హాకీ, మేజిక్‌లలో కూడా మంచి ప్రావీణ్యముండేది.



కరియప్ప స్వతంత్ర భారత దేశంలో ప్రజాస్వామ్య అవసరాలకనుగుణంగా మన సైనిక దళాలను తీర్చిదిద్ది పటిష్టమైన పునాదులను వేశాడు. 1948లో ప్రభుత్వ ఆదేశాల పరిధి మేరకు కాశ్మీరులో దురాక్రమణదారులను, చొరబాటు దారులను అత్యంత సమర్థవంతంగా ఎదుర్కొన్న సైనిక చర్యకు నాయకత్వం వహించాడు. 1950 లలోనే దూరదృష్టితో మన ఈశాన్య సరిహద్దుల్లో అనతి కాలంలో రాగల ముప్పు గురించి ప్రభుత్వాన్ని హెచ్చరించిన అతికొద్ది మంది వ్యక్తులలో కరియప్ప ఒకరు.

1965లో పాకిస్తాన్‌తో యుద్ధం జరిగినప్పుడు కరియప్ప విశ్రాంత జీవనం గడుపుతుండేవాడు. ఆ యుద్ధంలో పాకిస్తాన్ బందీలుగా పట్టుకొన్న భారత సైనికుల్లో ఒకరైన వింగ్ కమాండర్ కె.సి.కరియప్ప ఫీల్డ్ మార్షల్ కరియప్పకు ఏకైక పుత్రుడు. ఆనాటి పాకిస్తాన్ అధ్యక్షుడు ఫీల్డ్ మార్షల్ ఆయూబ్ ఖాన్ స్వాతంత్ర్యానికి పూర్వం సైన్యంలో కరియప్పతో కలసి పని చేసిన వ్యక్తి. భారత యుద్ధఖైదీల జాబితాలో కరియప్ప కుమారుని పేరును గుర్తించి అతన్ని వదలి పెడతామని తన పాత సహచరుడు ఫీల్డ్ మార్షల్ కరియప్పకు సందేశం పంపాడు. దీనికి ఆయూబ్ ఖాన్‌కు కరియప్ప పంపిన సమాధానమిది "ధన్యవాదాలు - కాని ఆ పట్టుబడిన వాళ్ళందరూ నా బిడ్డలే. మీరు వదలిపెట్టదలిస్తే అందరినీ వదలిపెట్టండి. కేవలం నా కొడుకును మాత్రం వదలి పెట్టడం నాకసలు ఇష్టం లేదు" ఎంతటి దేశభక్తి ! ఎంతటి స్వార్థ రాహిత్యం !

**3. సి. రాజగోపాలాచారి** (1878-1972) న్యాయవాది, మహా మేధావి, బహు గ్రంథ రచయిత. కొన్ని సంవత్సరాలు జైలు శిక్ష గడిపిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. "నా అంతరాత్మ కాపాడేవాడ"ని మహాత్మాగాంధీచే పిలవబడినవాడు. భారతదేశ గవర్నర్ జనరల్‌గా, గవర్నర్‌గా, ముఖ్యమంత్రిగా విశిష్ట సేవలందించినవాడు. వ్యక్తిగత జీవితంలో అనేక బాధలను దిగమింగాడు. మధ్య వయస్సులో భార్య, కూతురు, ఇద్దరు అల్లుళ్ళను పోగొట్టుకొన్నాడు. యువతరం కోసం మహాభారత రామాయణాలను సరళమైన భాషలో వ్రాసి ప్రచురించటం జాతికి తను చేసిన సేవలలో అన్నింటి కంటే ప్రధానమైనదని, అన్నిటికంటే ఎక్కువ తృప్తినిచ్చిందని వ్రాసుకొన్నాడు.



1925లో స్వాతంత్ర్య సమరంలో తలమునకలై ఉన్నపుడు ఒకరోజున వార్తా పత్రికలోని ఒక వార్తాంశం ఆయనకు ఆగ్రహం తెప్పించింది. అదేమిటంటే, తిరుచానూరు దేవాలయంలోనికి ఒక దళితుడు ప్రవేశించినందుకు పోలీసులు అరెస్టు చేసి కోర్టులో కేసు పెట్టారు. అతనికి జైలు శిక్షపడింది. ఆ సమయంలో స్వాతంత్ర్య సమరంలో భాగంగా న్యాయవాదుల కోర్టుల బహిష్కరణ కొనసాగుతుండినా కూడా రాజగోపాలాచారి ఆ నిందితుడి వకీలుతో సంప్రదించి తిరుపతికి వచ్చి అతని తరపున అప్పీలు కోర్టులో వాదించాడు. ఆ నిందితుడిపై కేసు కొట్టివేసి అప్పీలు కోర్టు విడుదల చేసింది. ఎంతటి మానవత్వం ! ఎంతటి సేవాభావం ! పరోక్షంగా ఈ సంఘటనను స్ఫురింప చేసే విధంగా శ్రీ వేంకటేశ్వరునిపై ఒక ప్రార్థనా గేయాన్ని కూడా రాజగోపాలా చారి రచించారు. ఎమ్.ఎస్.సుబ్బలక్ష్మి పాడిన ఈ పాట చాలా జనాదరణ పొందింది.

**- ఎ. నాగేశ్వరరావు,** సెంటర్‌హెడ్, సి.డబ్ల్యు.ఎస్. అపార్డ్

# విశాఖలో గ్రామీణ మహిళా వికాసం



**విశాఖ జిల్లా అచ్యుతాపురంలో ఏర్పాటయిన దుస్తుల తయారీ కంపెనీ బ్రాండిక్స్ విశాఖ గ్రామీణ జీవన చిత్రాన్ని మార్చేసింది. ఇక్కడి పేదగ్రామీణ మహిళల చేతుల్లో తయారైన లోదుస్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో హాట్‌కేక్స్‌లా అమ్ముడుపోతున్నాయి. విశాఖ వనితలు కుట్టిన బ్రాలు, ప్యాంటీస్ విదేశాల్లో విక్టోరియా సీక్రెట్ లేబుళ్లు తగిలించుకొని హాలీవుడ్ హీరోయిన్లకు కొత్త సొగసులు అద్దుతున్నాయి.**

### ఇసుక నేలలో అభివృద్ధి ఫలాలు

కోస్తాతీరంలోని విశాఖ జిల్లాలో ఎక్కువ శాతం ఇసుక నేలలే. అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరు గ్రామంలో వెయ్యి ఎకరాలను బ్రాండిక్స్ కంపెనీకి ఏపిఐఐసి కేటాయించింది. 2005లో ఈ ప్రాంతమంతా జీడి మామిడి తోటలతో నిండి ఉండేది. ఇసుక నేలలో జీడిమామిడి ఎక్కువగా పండుతుంది. ఈ చెట్లు పెరిగే చోట వేరే పంటలు పండవు. ఇలాంటి నేలలో శ్రీలంక దేశానికి చెందిన ప్రపంచ ప్రసిద్ధి గాంచిన దుస్తుల తయారీ కంపెనీ ఏర్పాటయింది.

### ఉపాధి కిరణాలు....

ఎలమంచిలి అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలోని రాంబిల్లి, మనగసాక, అచ్యుతాపురం మండలాలకు చెందిన 209 గ్రామాల నుండి 11 వేల మందికి బ్రాండిక్స్‌లో ఉద్యోగాలు దొరికాయి. వీరిలో 50 శాతం మంది పేద మహిళలే. దీంతో ఈ ప్రాంతంలో ఆర్థిక పరిస్థితి మెరుగై ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగింది. ఈ ప్రభావం పరోక్షంగా చిరు వ్యాపారాల అభివృద్ధికి దోహద పడి పరోక్షంగా పేదల జీవనోపాధులు మెరుగయ్యాయి.

అచ్యుతాపురం చుట్టూ ఉన్న గ్రామాలలో పేదరికం ఎక్కువ. పొలంపనులపై పొట్టపోసుకుంటూ, రోజూ కూలీకి వెడితే గానీ రోజు గడవని వారు అధికం. వారుంటున్న గ్రామం దాటి బయట ప్రపంచంలో ఉద్యోగాలు చేసుకునేవారు లేరు. పదో తరగతి దాటి పై చదువులు చదివిన వారు అంతంత మాత్రమే. చదువుకునే స్తోమతు లేకే ఈ పరిస్థితి. మగవారు వ్యవసాయపనులకు పోతుంటే, ఆడపిల్లలు కుట్లు, అల్లికలు, లేదా పొలంలో కూలిపనులు చేసుకునే వారు. ఇదీ వారి జీవన శైలి. ఇలాంటి బతుకుల్లో బ్రాండిక్స్ చిరు కిరణంలా ఉదయించింది. కనీస విద్యార్హతలున్న అమ్మాయిలందరికీ ఇక్కడ ఉపాధి కలిగింది. కాలం విలువ తెలుసుకొని బతుకును మరింత హుందాగా తీర్చిదిద్దుకునే అవకాశాలు వీరికి కలిగాయి. పెత్తందారుల వద్ద ఎండావానలో చెమటోడుస్తూ తలవంచుకొని కూలిపనులు చేసే స్థాయినుండి గౌరవంగా పరిశుభ్రమైన వాతావరణంలో పనిచేసుకునే అవకాశం ఏర్పడింది.

### దిమిలి గ్రామానికి ఉపాధి వెలుగు..

అచ్యుతాపురానికి 15 కిలోమీటర్ల దూరంలో రాంబిల్లి మండలం దిమిలి గ్రామంలో అధిక శాతం ప్రజలు పేదరికంలో ఉన్నారు. కొందరు పొలం పనుల మీద, మరికొందరు దినసరి వేతన కూలీలుగా మరికొందరు కులవృత్తుల మీద ఆధారపడి బతుకుతున్న వారే. ఈ గ్రామానికి చెందిన వెంకటకనకమహాలక్ష్మి ఎనిమిదో తరగతి వరకు



బ్రాండిక్స్ సెజ్‌లో ఏర్పాటయిన యూనిట్ల నుండి వెలువడే మురుగు నీటిని శుద్ధి చేయడానికి కంపెనీ అత్యంత శ్రద్ధ తీసుకుంటోంది. కోట్లరూపాయల వ్యయంతో ఎఫ్లూయెంట్ ప్లాంట్‌ని ఏర్పాటుచేశారు. ఇక్కడ అనేక దశల్లో మురుగునీటిని శుద్ధి చేసి, అనేక పరీక్షల అనంతరం నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. దీని కోసం పర్యావరణ నిపుణులను నియమించారు.

**ప్లాంట్‌ల నుండి వచ్చే వ్యర్థజలాల కోసం 5 ఎకరాల విస్తీర్ణంలో చెరువును ఏర్పాటు చేసి నీటి శుద్ధినిర్వహిస్తున్నారు. 5వారాలకు ఒక సారి 35,000 క్యూబిక్ మీటర్ల నీటిని శుద్ధిచేసిన తరువాత ఎపి పొల్యూషన్ బోర్డు పర్యావరణ నిపుణుల సమక్షంలో నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. పుడిమడక దగ్గర సముద్రతీరం నుండి సముద్రంలోకి 2.5 కిలోమీటర్ల దూరంలో 15 మీటర్ల లోతు వరకు పైపులు వేసి అక్కడ శుద్ధిచేసిన నీటిని సాగరంలో కలుపుతున్నారు.**

### చేపలకు హాని కలుగదు...

శుద్ధి చేసిన నీటిని వివిధ దశల్లో పరీక్షిస్తున్నారు. ఇదే నీటిని బ్రాండిక్స్ కంపెనీ చుట్టూ ఉన్న వందల ఎకరాల గ్రీన్‌బెల్ట్‌లో చెట్ల పెంపకానికి వాడుతున్నారు. ప్రత్యేకంగా నీటి తొట్టెలను ఏర్పాటు చేసి సముద్రంలో పెరిగే వివిధ రకాల చేప పిల్లలను శుద్ధిచేసిన నీటిలో వారంరోజులు పెంచుతున్నారు. వాటికి ఈ నీళ్ల వల్ల ఎలాంటి హానీ లేదని నిర్ధారించుకున్న తరువాత మాత్రమే ఈ నీటిని సముద్రంలోకి వదులుతున్నారు.

ఈ వ్యర్థజలాల శుద్ధికేంద్రం జర్మనీ టెక్నాలజీతో తైవాన్ ఎక్విప్‌మెంట్‌తో ఏర్పాటయింది. 18 మంది పర్యావరణ ఇంజనీర్లు నిరంతరం ఇక్కడ పనిచేస్తుంటారు.

బ్రాండిక్స్ అపెరల్‌సిటీ ఏర్పాటుకు అయిన మొత్తం ఇన్వెస్ట్‌మెంట్‌లో 60 శాతం నీటిశుద్ధి కేంద్రాల నిర్వహణకే వెచ్చించడం గమనిస్తే, ఈ కంపెనీ పర్యావరణ పరిరక్షణకు ఎంత శ్రద్ధ తీసుకుంటుందో అవగతమవుతుంది.

చదివి, ఆ తరువాత చదివే ఆర్థిక స్తోమతు లేక ఆపేసింది. తండ్రి ఉన్న ఊర్లో కులవృత్తికి డిమాండ్ ఉండదని, కేరళకు వలస వెళ్లి అక్కడే సెలూన్ పెట్టుకుని బతుకుతూ కుటుంబానికి అండగా ఉన్నారు. వెంకట కనకమహాలక్ష్మికి పెళ్లి చేసి అత్తవారింటికి పంపారు. ఎన్నో ఆశలతో కాపురానికి వెళ్లిన లక్ష్మిని దురదృష్టం వెంటాడింది. ఆనందంగా భర్తతో బతుకుదామనుకున్న ఆమెకు భర్త నిరాదరణ, వేధింపులు ఎదురయ్యాయి. వాటిని భరించలేక పుట్టింటికి వచ్చేసింది. తల్లికి భారం కాకుండా తన కాళ్ల మీద తను నిలబడాలనుకుంది కానీ, కుగ్రామంలో బతుకు తెరువు కష్టమైంది. కూలిపనులు తప్ప వేరేమార్గంలేదు. ఆ సమయంలో బ్రాండిక్స్ కంపెనీలో పనులున్నాయని తెలిసి కంపెనీని సంప్రదిస్తే వారు శిక్షణనిచ్చి ఉద్యోగం ఇచ్చారు.

### ధైర్యంగా బతుకుతున్నాను

"కంపెనీలో హెల్పర్‌గా చేరాను. పనిలో నా ప్రతిభను చూసి క్వాలిటీ సెల్‌కి ప్రమోట్ చేశారు.నాలుగు వేలకు పైగా జీతం వస్తుంది. భర్త నిరాదరణకు గురైనా పుట్టింటికి భారమవుతానని ఆందోళన చెందినా ఈ ఉద్యోగం వల్ల ఆత్మవిశ్వాసం పెరిగింది. నాతోపాటు మా వూరి నుండి పదిహేను మందికి ఉపాధి దొరికింది. నాలాగా కుటుంబ సమస్యలున్నవారూ ఉన్నారు. వారంతా హ్యాపీగా బతుకుతున్నారు. ఉద్యోగం మాకో కొత్త జీవితాన్నిచ్చింది." అని ఆనందంగా చెప్పింది లక్ష్మి.

### చదువు, ఆరోగ్యం

ఇక్కడ మూడేళ్లుగా ఆపరేటర్‌గా పనిచేస్తున్నాను. నా భర్త రాజు కూడా అచ్యుతాపురంలోని మరో కంపెనీ యూనీపార్ట్స్‌లో పని చేస్తున్నారు. మాకు ఇద్దరు పిల్లలు. రమ్య (5వ తరగతి), సిద్దు (4వ తరగతి) వీరిని జంగాలపాలెం వివేకానంద స్కూల్‌లో చదివిస్తున్నాం. మా పిల్లల చదువులకు అండగా ఉండటమే కాక నా ఆరోగ్యం పట్ల కూడా కంపెనీ శ్రద్ధ తీసుకుంటోంది. నేను చాలాకాలంగా బ్యాక్ పెయిన్‌తో బాధపడుతూ గాజువాకలోని ఆర్కే ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకున్నాను. దానికి దాదాపు 15 వేలు ఖర్చయింది. ఆరోగ్య బీమాలో భాగంగా కంపెనీ నా ఆసుపత్రి బిల్లులన్నీ రియింబర్స్‌మెంట్ చేసింది. నాకు వస్తున్న జీతంలో రెండు వేలు చిట్ వేస్తున్నాను. డ్వాక్రా గ్రూప్‌లో రూ. 1200 కడుతున్నాను. మా జీవితాలు ఆనందంగా గడుస్తున్నాయి.

**...... రేఖ లక్ష్మి , రాంబిల్లి.**

### బతుకు మారింది

ఒక సంవత్సరం క్రితం బ్రాండిక్స్‌లో చేరాను. నెలకు మూడువేల

## ఒక పరిశ్రమ.... సామాజిక పరిశీలన

- బ్రాండిక్స్ వల్ల స్థానికుల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. అచ్యుతాపురం మండలంతో సహా దువ్వాడ, అనకాపల్లి వంటి బయట ప్రాంతాల మహిళలకు జీవనోపాధి దొరికింది.
- బ్రాండిక్స్ కంపెనీ రాక ముందు ఇంట్లో మగవారి సంపాదన మీద మాత్రమే ఆధారపడే వారు. కంపెనీ వల్ల మహిళలకు ఉపాధి ఏర్పడి, ఆదాయాలు పెరిగాయి.
- అచ్యుతాపురం చుట్టుపక్కల గ్రామాలన్నీ వ్యవసాయం మీద ఆదారపడినవి. పేదరికం ఎక్కువ. ఎంత ఎక్కువంటే పదో తరగతి తరువాత పై చదువులు చదివే స్తోమతు లేని వారు ఎక్కువ. అక్కడితో చదువులు ఆపేసిన అమ్మాయిలు పొలం పనులకు వెళ్లడం లేదా ఇంట్లో కుట్లు, అల్లికలుతో బతుకుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బ్రాండిక్స్ రావడం వారికి గొప్ప ఆలంబన.చదువులు ఆగిపోయినా ఉపాధి దొరకడంతో తల్లిదండ్రులకు పిల్లలు భారం కాలేదు.
- తరతరాలుగా వ్యవసాయం మీదే ఆధార పడి బతుకుతున్న కుటుంబాలు తమ ఇంట్లో ఒకరికి ఉద్యోగం రావడంతో సామాజిక హెూదా పెరిగిన భావన కలిగింది.
- ఇక్కడ పని చేస్తున్న వారిలో ఎక్కువ శాతం అవివాహితులే. వీరి సంపాదనలో కొంత పొదుపు చేసి వివాహ ఖర్చులకు దాచుకుంటున్నారు. దీనివల్ల దల్లిదండ్రులకు కొంత ఆర్థిక భారం తగ్గిస్తున్నారు.
- బ్రాండిక్స్ ఏర్పాటు కాక ముందు ఈ ప్రాంతంలో 30 శాతం మహిళలు బతుకు తెరువు కోసం విజయవాడ, హైదరాబాద్‌లకు పోయేవారు. కొందరు కుట్టుపనిలో శిక్షణ కోసం బయట ప్రాంతాలకు వెళ్తుండే వారు. కంపెనీ వచ్చాక ఉన్న ఊర్లోనే ఉపాధి దొరకడంతో వారంతా వెనక్కు వచ్చారు. దీనివల్ల వలసలు తగ్గాయి.
- రోజూ అందరితో కలిసి బస్సులో పనికి పోయి రావడం వల్ల తమ భావాలను నలుగురిలో పంచుకునే ఆవకాశం కలుగుతుంది. ఉద్యోగాలు చేస్తున్నందు వల్ల వారికి గ్రామాల్లో గౌరవం పెరిగింది.
- మనరాష్ట్రంలో ఏర్పాటయిన ఏ కంపెనీలో ఇంత భారీ సంఖ్యలో గ్రామీణ మహిళలకు ఉద్యోగాలు లేవు.
- ప్రతిరోజూ 60 బస్సులు గ్రామాల నుండి ఉద్యోగులను కంపెనీకి చేరవేస్తున్నాయి. దీని వల్ల పరోక్షంగా డ్రైవర్లకు, ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలకు ఉపాధి అవకాశాలు కలిగాయి. క్యాంటీన్లు, సెక్యూరిటీ నిర్వహణలో మరో 300 మందికి ఉపాధి దొరికింది.

వరకు వస్తుంది. ఎక్కువ పని చేస్తే అదనపు ఆదాయం ఇస్తారు. ఇంట్లో ఆర్థిక పరిస్థితి బాగా లేక పదోతరగతితో చదువు ఆగిపోయింది.నాన్న టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నా ఆదాయం కొంత తోడయింది. ఈ ప్రాంతం నుండి నాతో పాటు 35మంది కంపెనీలో పని చేస్తున్నారు. పనివేళలో ఎలాంటి ఆరోగ్యసమస్య వచ్చినా ఆదుకోవడానికి హెల్త్ సెంటర్ ఉంది. తక్కువ ధరకే ఆహారం దొరికే క్యాంటీన్ ఉంది. ఇక్కడ అంతా వ్యవసాయం మీదే బతికేవారు. ఉద్యోగాలు చేయడం మాతోనే మొదలైంది. ఎలా చూసినా ఈ కంపెనీ మా జీవితంలో వెలుగులు నింపింది.

**.... శ్రీమంతుల ఉత్తర,**

### పెదపాడు పంచాయితీలో పెరిగిన ఉపాధి

రెండువేల అయిదొందల జనాభా ఉన్న పెదపాడులో ఉపాధిహామీ పనులు, వ్యవసాయం, కులవృత్తుల మీద ఆధారపడి బతుకుతున్న వారి సంఖ్య ఎక్కువ. ఇక్కడి ప్రైమరీ స్కూల్ టీచర్ బ్రాండిక్స్ కంపెనీ రావడం వల్ల గ్రామీణుల్లో వచ్చిన మార్పును ఇలా వివరిస్తున్నారు....

"కంపెనీ వల్ల ఇక్కడి మహిళలకు ఆర్థిక భరోసా ఏర్పడింది. తల్లిదండ్రులు, భర్తల మీద ఆధారపడకుండా బతుకుతున్నారు. ఉపాధివల్ల ఆత్మస్థైర్యంతో బతుకుతున్నారు.పిల్లలను చదివిస్తున్నారు. ఆర్థిక వనరులను పెంచుకుంటున్నారు. ఇది కాదనలేని సత్యం. బ్రాండిక్స్‌లో పని చేస్తున్న వారి పిల్లలు చదువులో మంచి మార్కులు తెచ్చుకుంటే వారికి మెరిట్ స్కాలర్‌షిప్‌లు కూడా ఇస్తున్నారు. ఇది సామాజిక బాధ్యతే."

**సత్యనారాయణ, టీచర్, మండలపరిషత్ ప్రాథమికపాఠశాల, పెదపాడు**

### పర్యావరణానికి ప్రాధాన్యం

బ్రాండిక్స్‌లో దుస్తుల తయారీ కంపెనీలే ఉన్నప్పటికీ, అసలు కాలుష్యం రాకుండా పలు జాగ్రత్తలను తీసుకుంటున్నారు. కంపెనీ చుట్టూ ఉన్న వెయ్యి ఎకరాల్లో యాభై శాతం గ్రీనరీ అభివృద్ధి చేస్తున్నారు. పూలమొక్కలు, మామిడి చెట్లు విరివిగా పెంచుతున్నారు. కార్యాలయాల్లో సోలార్ ల్యాంపులకు ప్రాధాన్యతిచ్చారు.


ఎపీఐఐసీ నుండి సరఫరా అవుతున్న 60 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేయడానికి కంపెనీ ప్రత్యేకంగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. ఇక్కడ క్లోరిన్‌తో నీటిని శుద్ధి చేసిన తరువాత కంపెనీలోని యూనిట్లకు సరఫరా చేస్తున్నారు.

**శ్యాంమోహన్,**
**రూరల్‌మీడియా**

# గ్రామాభివృద్ధికి సోపానం గాంధీజీ మార్గం

**భారతదేశం గ్రామాలలో జీవిస్తుంది. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రాలు అభివృద్ధి పథంలో ఉంటాయి. అదే రీతిలో దేశం కూడా పురోభివృద్ధిలో నడుస్తుంది. అందుకే జాతిపిత మహాత్మాగాంధీ 'గ్రామస్వరాజ్యం' గూర్చి కలలు కన్నారు. ఆ దిశలో ఈ దేశాన్ని ముందుకు నడిపించారు. ఆయన జవహర్ లాల్ నెహ్రూను తన వారసుడిగా ప్రకటించి, దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య, సోషలిస్టు వ్యవస్థకు పునాది వేశారు.**

నెహ్రూయే ప్రధాని కాకుంటే గాంధీయిజం, ఆదర్శవాదంతో ఈ దేశాన్ని నడిపించే వారు కాదు. నెహ్రూను తన వారసుడిగా ఎంచి కమ్యూనిటీ అభివృద్ధితో కూడిన గ్రామ స్వపరిపాలనకు అంకురార్పణ చేశారు. గాంధీజీ కలను నిలబెట్టిన వాడు నెహ్రూ. అందుకే గాంధీజీకి ఈ దేశం రుణం పడి ఉంది.



ఈ దేశానికి శాంతి, స్వపరిపాలనతో కూడిన అభివృద్ధి అవసరం అని గాంధీజీ అన్నారు. గ్రామాన్నే ఒక రిపబ్లిక్ గా చేయాలన్నారు. అది నిజమే. గ్రామసభ, శాసనసభ, పార్లమెంటు కూడా ప్రజావసరాలను తీర్చే వివిధ వ్యవస్థలే. గ్రామాలు పచ్చగా ఉంటే, దేశం పచ్చగా ఉంటుందన్నారు. గ్రామ పరిపాలన మానవీయత అవసరాలకు అనుగుణంగా నడిపించగలిగిన వాడు, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు నడిచేందుకు అవకాశం ఉందంటారు గాంధీజీ. గాంధీ కాలంలో గ్రామాలు స్వయంగా ఆయనకు చేయూతనిచ్చి ఆయన ప్రతిపాదించిన గ్రామ స్వరాజ్య భావనను నిలబెట్టేందుకు ప్రయత్నించాయి.

గాంధీజీ వికేంద్రీకరణ అవసరమని ప్రగాఢంగా విశ్వసించారు. గ్రామ పంచాయతీలను అభివృద్ధి పరచాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. గ్రామాలు స్వయం పోషకాలుగా అభివృద్ధి చెందడమే కాక, గ్రామ స్వరాజ్యాలుగా అవతరించాలి అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నేటి యువత గ్రామీణాభివృద్ధిలో ప్రధాన పాత్రను నిర్వహించాలి. అందుకు తగిన విధంగా నేడు గ్రామాల్లో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ఆ దిశలో కృషి చేస్తున్నారని చెప్పవచ్చు. గ్రామీణ ఉపాధి హామీ విషయంలో ఆయన చూపిన మార్గంలో నడిచేందుకు మనం ప్రయత్నం చేస్తున్నాము. ఆ ప్రక్రియ విజయ వంతం మౌతుందని ఆశించవచ్చు.

ఇటువంటి అంశాలలో గ్రామ పంచాయితీయే నిర్ణయించిన విధంగా ముందుకు నడవాలని గాంధీజీ అనేవారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నేటి యువత గ్రామీణాభివృద్ధిలో ప్రధాన పాత్రను పోషించాలి. గ్రామీణ ప్రాంతాల రోజు వారీ అంశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోరాదని, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాలను గ్రామ పంచాయతీలకు అప్పగించాలని గాంధీజీ అభిప్రాయ పడేవారు. గ్రామీణాభివృద్ధిలో భాగంగా భూసంస్కరణల అమలు ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఆయన ఉద్దేశ్యంలో ఎక్కువ భూమిని కలిగిన వారు స్వచ్ఛందంగా తమ భూమిని గ్రామ పంచాయతీలకు అప్పగించాలి. అటువంటి భూములను గ్రామ పంచాయతీలు భూమి లేని నిరుపేదలకు పంచాలని అనేవారు. ఆయన ఆలోచనలను వినోబా భావే భూదానోద్యమంగా ప్రచారం చేసి నాలుగు లక్షల ఎకరాలను సేకరించి పేదలకు పంచారు. ఆ కార్యక్రమాన్ని ఆచార్య వినోబా భావే మన రాష్ట్రంలోని పోచంపల్లి నుంచి ప్రారంభించి, అమలు పరచి దేశానికే మార్గదర్శి అయ్యారు.

గ్రామ పంచాయతీలు నిర్వహించవలసిన విధులను గాంధీజీ వివరించారు. ప్రతి గ్రామంలోనూ పారిశుధ్యం, విద్య, వైద్యం వంటి విషయాలను గ్రామ పంచాయతీలకు అప్పగించి వాటి అమలుకు, నిర్వహణకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చాలని అనేవారు గాంధీజీ. ఆ తీరులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి కోటి రూపాయల నిధులను ఇచ్చి అభివృద్ధి పనులను అమలు చేయాలని ఆలోచిస్తోంది. ఈ ఆలోచన కనుక విజయవంతం అయితే, ఆ మార్గాన్ని దేశమంతటా అమలు చేయడానికి మార్గదర్శకమవుతుంది.

గ్రామీణ ప్రాంతాలలో పలు కారణాల వల్ల పెరుగుతున్న జనాభా, దానితో పాటు పెరిగి పోతున్న నిరుద్యోగం తీవ్రమైన సమస్యలుగా పరిణమిస్తున్నాయి. అందుకు తగిన విధంగా భారత ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నది. గాంధీజీ ఆశించిన విధంగా గ్రామీణ ప్రాంతాలలో దారిద్ర్యరేఖకు దిగువనున్న వారి పట్ల ఈ పథకం వరంగా మారింది. ఈ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పనులు గ్రామానికి త్రాగునీరు లభ్యత మెరుగు పరిచే దిశలోను, వివిధ గ్రామ సమస్యల పరిష్కారానికి మార్గం కనుగొనే దిశలో ముందుకు కదిలే వెసులుబాటు ప్రజలకు కల్పించింది.

భారతదేశ ప్రభుత్వం మహాత్మాగాంధీ కలలను నెరవేర్చేరీతిలో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామ పంచాయితీలకు రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించి, బలోపేతం చేసింది. అయితే, గ్రామ పంచాయితీలకు తగినన్ని ఆర్థిక వనరులు కల్పించక పోవడం వలన గాంధీజీ తలచిన అభివృద్ధికి తగిన మార్గం ఏర్పడటం లేదు.

గాంధీజీ మానవాభివృద్ధికి కృషి చేయాలని అభిలషించారు. మానవాభివృద్ధికి వ్యక్తిగత స్వేచ్ఛ అనివార్యం. ప్రజాభిప్రాయం మాత్రమే సమాజాన్ని పరిశుద్ధంగా, ఆరోగ్యంగా ఉంచగలుగుతుందని గాంధీజీ బోధించారు. ప్రజాభిప్రాయం ఏర్పడటానికి ఆంక్షలు లేని విధంగా పత్రికలు, ప్రజా సంఘాలు, ఇతర వేదికలు ప్రముఖ పాత్ర నిర్వహించాలని అనేవారు. ఆయన సామాజిక అసమానతలను వ్యతిరేకించారు. స్వేచ్ఛ, స్వరాజ్యంతో అసమానతలు తొలగించాలన్నారు. గ్రామాలలో ఉన్న అంటరాని తనం, ఆకలి, అనారోగ్యాన్ని తొలగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గాంధీజీ అన్నారు. మహిళలకు, పురుషులకు మానవహక్కులు సమానంగా ఉండాలని అన్నారు.

ఆయన ఆశయాలతో గ్రామాలు ముందుకు నడిచి మానవాభివృద్ధిని సాధించాలని కోరుకుందాం.

జైహింద్ *- సి.ఎం.పి.*



Sthanika_Color_Oct13.indd 23 17/10/13 5:27 PM

# దేశంలో ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. పథకం అమలు తీరు

**భారతదేశ పేద ప్రజలకు భరోసాను కల్పిస్తున్న చట్టం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణాభివృద్ధి పథకం (ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్). ప్రపంచంలోనే అత్యధిక మందికి ఉపాధిని కల్పిస్తోంది. దీనిపై చాలామందికి పలు అనుమానాలున్నాయి. ఈ పథకం పేదరిక రేఖకి దిగువన ఉన్న పేదలకు సంవత్సరంలో కుటుంబలోని ఒక వ్యక్తికి నూటయాభై రోజులు పనిని కల్పిస్తుంది. ఈ పథకం క్రింద రిజిస్టర్ చేసుకొని ఎవరు జాబ్‌కార్డు పొందుతారో వారికి తప్పకుండా అడిగినప్పడు పనిని కల్పిస్తుంది.**

**అంటే పనిలేక కుటుంబాలు ఆహారం లేకుండా ఉండకుండా చూడడమే ఈ పథకం ఉద్దేశ్యం. కుటుంబంలో నలుగురు లేదా ఐదుగురు సభ్యులుంటే తప్పక వారిలో ఒకరికి వందరోజులు పని కల్పించాలి. లేనిచో ఆ వ్యక్తులకు పనిలేని దినాలలో కాంపెన్సేషన్ చెల్లించాలి. ఆ విధంగా పేద కుటుంబాలను (బిపిఎల్) ఆదుకోవటమే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం పనిచేస్తుంది.**

ఈ పథకం ద్వారా గ్రామాలలో ఉన్న పేదవారు ఉపాధి లేక పస్తులు ఉండకుండా చూడడం, పనిలేని రోజుల్లో గ్రామాలలో పేదలు యజమానుల వద్దకో, మధ్యవర్తుల వద్దకో వెళ్ళి చేయి చాచి, అప్పు అడిగి తీసుకొని ఆ అప్పును తీర్చేందుకు ఆయన వద్దే పని చేయాల్సి ఉండేది. అలా బలవంతంగా పనిచేయించు కోవడం అనేదానికి ఈ పథకం ద్వారా స్వస్తి పలకడం జరుగుతోంది.

పనులున్న కాలంలో కూలికి పోయి మార్కెట్ రేటు ప్రకారం 200-250 రూపాయలు కూలిపొందవచ్చు. ఆ పనులు కాలంలో వత్తిడి ఉండటం వలన పని దొరుకుతుంది. కాని దొరకని కాలంలో పనిని కల్పించేందుకు భూస్వాముల దయాదాక్షిణ్యం మీద జీవించాలి. అలాంటి స్థితిని పేదలను తప్పించేందుకు ఈ ఎం.జి.ఎన్.ఆర్.జి.ఎస్ పథకం ఎంతగానో తోడ్పతుంది.

అందుకే గ్రామాలలో ఈ పథకం అమలు చేయటం వలన పనులు చేయటానికి వ్యవసాయ కార్మికులు లభించటం లేదని గగ్గోలు పెడుతున్నారు. దొరికిన వారికి ఎక్కువ రేటులో కూలీ చెల్లించవలసి వస్తుందని వాపోతున్నారు. కూలి దొరికిన కాలం పేదల బ్రతుకు ఢోకా లేదు. కాని పని దొరకని కాలంలో 'నేనున్నాను' అనే పని భరోసాను కల్పిస్తుంది ఈ పథకం. అందుకే గ్రామాలలోని భూస్వాములు ఈ చట్టం వచ్చిన తరువాత పేద కార్మికులు తమకు తలొగ్గడం లేదని,





Sthanika_Color_Oct13.indd 18 17/10/13 5:27 PM

వారు పిలిచినప్పుడు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని దీనికంతటికి కారణం కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకమేనని విమర్శిస్తున్నారు.

ప్రభుత్వం అండ చూచుకొని కూలి వారు భూస్వాముల మాట వినడం మానేశారు. సామాజిక ఆధిపత్య సంబంధాలను వమ్ము చేశారని కోపగించుకుంటున్నారు. అంతేగాక, గతంలో గ్రామంలోకి వచ్చి కార్మికులను బలవంతంగా వారు యిచ్చిన కూలికి తీసుకొని పనిచేయించటం జరిగేది. ఇప్పుడు అలాంటి ఆధిపత్యం గ్రామాలలో తగ్గిందని చెప్పవచ్చును.

ఈ పథకం అమలు తరువాత గ్రామాలలో కాంట్రాక్టు లేబర్ గ్రూపులు ఏర్పడి పేదలను పనికి తీసుకొని వెళ్ళేందుకు కాంట్రాక్టర్స్‌గా మధ్య వర్తులు వ్యవహరిస్తున్నారు. అంటే ఒక కాంట్రాక్టుదారుని క్రింద 60-70 మంది తన మాట వినే వారిని గుర్తించి తన ముఠాగా ఏర్పడి రైతులు యిచ్చిన పనికి తగినంత మందిని పంపి పని పూర్తి చేయించడం జరుగుతోంది. ఆ విధంగా కాంట్రాక్టును నిర్వహించే వారు అటు కూలీలకు-యజమానులకు మధ్య కూలీల ఏజెంట్‌గా పనిచేస్తున్నారు.

ఒక రైతు పొలంలో పనికి 20 మంది కావలసి ఉంటే అంతమందిని పంపి పని పూర్తి చేసి ఖరీదు వసూలు చేసి ఎంత వస్తే అంత పంచుకోవడం జరుగుతుంది. తక్కువ పనికి ఎక్కువ మందిని పంపి పని చేయించి ఎంత వస్తే అంత కూలీలు పంచుకొంటారు. రైతు పనికి తగిన మొత్తం కాంట్రాక్టు వ్యక్తికి అంతా చెల్లిస్తారు. పనిని పూర్తి చేయించడం అతని బాధ్యత. ఎంత మందితో చేయించుతారో తక్కువ లేదా ఎక్కువ మందా అనేది కాకుండా పని చేయించడం జరుగుతుంది. కనుక గ్రామాల్లో రైతులకు విడిగా కూలీలు దొరకడం లేదు. రైతు ఆ కాంట్రాక్టు వ్యక్తి ద్వారా కూలీ పనులు చేయించుకోవడం జరుగుతుంది.

ఈ ఎం.జి.ఎన్.ఆర్.జి.ఇ.ఎస్ పథకం క్రింద జాబ్‌కార్డు పొందడం వలన పని లేదని ఆందోళన పోయింది. రేషన్ షాపు ద్వారా కిలో 2 రూపాయలకే బియ్యం 15-20 కిలోల దొరుకుతున్నాయి. కనుక గ్రామీణ పేదలు ఆందోళన లేకుండా ఆకలి బాధపడకుండా జీవనానికి నోచుకుంటున్నాడు. దానిని చూసి యజమానులు జీర్ణించు కొనలేకపోతున్నారు.

'నిన్న మొన్నటి వరకు మేము చెప్పినట్లు విన్న వ్యక్తులు మాముందే తల ఎగరేస్తున్నారు. వీరికి ప్రభుత్వం భరోసా యిచ్చి నాశనం చేస్తోంది' అని విమర్శిస్తున్నారు.

అంతేగాక 'ఎంతకాలం ఈ చట్టం పని చేస్తుందో వీరికి భరోసా కల్పించుతుందో చూద్దాం. తిరిగి పని లేనప్పుడు మా దగ్గరకు రాకుండా ఉంటాడా? అప్పుడు చెబుతాం వీడి పని' అని యాజమానులు ఎదురుచూస్తున్నారు. మహా అయితే ఎన్నికల ముందు ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తుంది. ఆ తరువాతనైన మా వద్దకు రారా' అని భూసామ్య యజమానులు అనుకొనడం సహజం. వారు ఈ చట్టాన్ని అమలు చేయకుండా చేస్తే నిజంగా 32.5 శాతం పేదల బ్రతుకులు తిరిగి యధాస్థితికి వచ్చే అవకాశం ఉంది. అంతేగాక ఈ ఉపాధిహామీ పథకం వలన పనికి భరోసా దొరకడంతో కూలీలు పని దొరికే చోటికి తరలి వెళ్ళకుండా వారి ఊరిలోనే ఉంటున్నట్లు అంచనా. అంటే ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. పథకం ద్వారా కూలీల మైగ్రేషన్ తగ్గిందని అంచనాలు వెల్లడిస్తున్నాయి.

ఈ పథకాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేయబడుతుంది. గత ఎనిమిది సంవత్సరాలు నుండి ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకం అమలుతో 30 కోట్ల 65 లక్షల 25 వేల 565 పని దినాలు కల్పించబడ్డాయి. అందులో ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారీగా చూస్తే కర్నూలు, ఖమ్మంలు ప్రథమ స్థానంలో ఉన్నాయి. కాని ఆంధ్రప్రదేశ్‌లో 900 గ్రామాలలో ఈ ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ పనులు అమలు కావడం లేదు. గత సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో 8 లక్షల 10 వేల పనిదినాలు కల్పించేందుకు 4,100 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు గ్రామీణా భివృద్ధి శాఖ తెలిపింది. 2012-13 6.40 లక్షల కుటుంబాలకు పని కల్పించడం జరిగింది.

ఈ పథకం అమలు చేయటం వలన గ్రామాలలో పనులు చేయటం జరుగుతోంది. సామాజిక పనులను స్థిరీకరించేందుకు ఉపయోగ పడుతుంది. ముఖ్యంగా గ్రామాలలోని మంచినీటి చెఱువులలో పూడికలు తీసి, నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండేలా చేయడం, త్రాగునీటి వసతులు కల్పించటం, మంచి నీటి చెరువులను బాగు చేయటం లాంటివి జరుగుతున్నాయి.

రోడ్లు నిర్మాణం చేపట్టి గ్రామాలకు రహదారి సౌకర్యాలు కల్పించటం, పంటకాలువలను బాగుచేసి పొలాలకు నీరు అందచేయడం, గ్రామాలలో పారిశుధ్యపు పనులు చేపట్టి, అనారోగ్యం కలుగకుండా చర్యలు తీసుకోవడం తదితర ఎన్నో సమాజానికి సంపదను సృష్టించేందుకు పనిచేయడం జరుగుతుంది.

గ్రామీణాభివృద్ధి శాఖ ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో పారదర్శకంగా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ అమలు తీరుతెన్నులను గమనిస్తుంది. కనుక పని దినాలు మస్తర్లు, చెల్లింపులను, పనుల నిర్వహణను గుర్తిస్తూ పనులను చేపట్టి పూర్తి చేయడం సజావుగా జరుగుతుంది.

- జాబ్‌కార్డ్ ఉన్న వారికి అడిగిన వెంటనే పని కల్పించడం జరుగుతోంది.
- 15 రోజులు లోపు చేసిన పనికి చెల్లింపులు చేసేటట్లు చర్యలు చేబడుతున్నారు.
- గ్రామానికి అవసరమైన పనులను గుర్తించి చేయించటం జరుగుతోంది.
- సామాజిక తనిఖీ ద్వారా పనుల చెల్లింపులను మానిటర్ చేయటం కూడా జరుగుతోంది..

సాధ్యమైనంతవరకు లోపాలను తొలగించి, వాటిని సరిదిద్దుకొని ఉపాధిహామీ పథకం ఫలవంతగా అమలు చేయడం జరుగుతుంది.

ఈ పథకాన్ని అమలు చేయటానికి తగిన నిపుణులను ఎంచుకొని ఆయా రంగాలో శిక్షణనిస్తూ, పున:చరణ తరగతులను నిర్వహించి, పథకాన్ని ఎంతో పారదర్శకంగా అమలు చేయడం జరుగుతోంది. అంతేగాక సామాజిక సంపదను సృష్టించి, కొనసాగించటంలో ఈ పథకం ఎంతగానో తోడ్పడుతోంది.

ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ పనులలో లోపాలు దొర్లినపుడు వాటిని ఎప్పటికప్పుడు సరిచేసుకుంటూ పథకం ఏర్పరచుకున్న టార్గెట్లను సాధించడం జరుగుతెంది.

*- సి.ఎం.పి, అపార్డ్*



Sthanika_Color_Oct13.indd 19 17/10/13 5:27 PM



# గ్రామ స్వరాజ్యానికి గ్రామ పంచాయితీలు

గ్రామ పంచాయితీలు స్వయం పరిపాలనా యూనిట్లుగా పనిచేయాలని, గ్రామ స్వరాజ్యానికి ఇది అవసరమని జాతి పిత మహాత్మాగాంధీ వక్కాణించారు. గ్రామ పంచాయితీలకు సంబంధించిన అంశాన్ని రాజ్యాంగ నిర్మాతలు 40వ అధికరణలో గల రాజ్యాంగ నిర్దేశిక సూత్రాలలో చేర్చారు. రాజ్యాంగ నిర్దేశిక సూత్రాలలోని అంశాలను ప్రభుత్వం విధిగా పాటించాలనే నియమం లేదు. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయితీల అభివృద్ధికి చేయవలసిన కృషిని చేయలేదు. ఈ లోటును సరిదిద్దాలన్న సదుద్దేశంతో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామపంచాయితీలకు రాజ్యాంగ ప్రతి పత్తిని కల్పించి కొన్ని విధులు, నిధులు కల్పించాలని కేంద్రప్రభుత్వం భావించింది. గ్రామ పంచాయితీలకు స్థిరత్వాన్ని, బలాన్ని సమకూర్చి, వాటిని కొనసాగించడమే 73వ రాజ్యాంగ సవరణ ఆశయం. గ్రామ పంచాయితీ వ్యవస్థను బలోపేతం గావించవలసిన అవసరాన్ని వీరప్ప మొయిలీ అధ్యక్షతన ఏర్పడిన రెండో పరిపాలనా సంస్కరణల సంఘం గుర్తు చేసింది.

## విధుల కోసం పోరాటం

మన రాజ్యాంగంలోని పదకొండో షెడ్యూలులో పేర్కొన్న అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయితీలకు బదలాయించాలి. ఇందుకోసం గతంలో మన రాష్ట్రంలోని సర్పంచులు ఆందోళనలు కూడా చేశారు. రాజ్యాంగంలోని పదకొండో షెడ్యూల్లులోని అంశాలను గ్రామ పంచాయితీలకు బదలాయించడంలో దక్షణ భారత దేశంలోని తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలతో పాటు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కూడా ముందంజలో ఉన్నాయి. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వెనుకంజ వేసింది. 29 అంశాలలో పదింటిని గ్రామ పంచాయితీలకు బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడమయినది. గ్రామ పంచాయితీలకు విధులను అప్పగించినప్పుడు వాటిని నిర్వహించడానికి అవసరమయిన నిధులను కూడా కేటాయించాలి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో సహా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయితీలకు నిధులు లేని విధులను అప్పగించాయన్న విమర్శ తీవ్రంగా వినిపిస్తుంది. గ్రామ పంచాయితీలు గ్రామాల ప్రగతికి సోపానాలు. గ్రామీణుల కనీస అవసరాలను తీర్చవలసిన బాధ్యత గ్రామ పంచాయితీలపైనే ఉంది. ప్రతి గ్రామ పంచాయితీ ఆ గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన త్రాగునీటిని సమకూర్చాలి. గ్రామ ప్రజలకు అవసరమయిన నిత్యావసర వస్తువులను చౌక ధర దుకాణాల ద్వారా సమకూర్చాలి. గ్రామాలలో ప్రాథమిక పాఠశాలల నిర్వహణ బాధ్యత కూడా గ్రామ పంచాయితీలదే. అనేక గ్రామాలలో సరి అయిన పాఠశాల భవనాలు లేవు. కొన్ని చోట్ల ఉపాధ్యాయులు లేరు. మరికొన్ని ప్రాథమిక పాఠశాలల్లో త్రాగునీటి వసతి, మరుగుదొడ్లు లేవు. గ్రామీణ ప్రాంతాలలో బాలికలు విద్య మానేయడానికి ప్రధాన కారణం ప్రాథమిక పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యం లేక పోవడం. భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విద్యాహక్కు చట్టాన్ని కూడా గ్రామపంచాయితీలు అమలు పరచాలి.

### లాంచనంగా మారిన గ్రామ సభ సమావేశాలు

73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామ సభలకు రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించడం జరిగింది. గ్రామ సభ అ గ్రామ ప్రజలందరూ పాల్గొనే గ్రామస్థాయి శాసన సభ. 18 సంవత్సరాల వయస్సు నిండి ఆ గ్రామ ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకున్న వారందరూ గ్రామ సభలో సభ్యులు. ప్రతి సంవత్సరం రెండుసార్లు గ్రామ సభ సమావేశాలను ఆ గ్రామ సర్పంచ్ నిర్వహించాలి. ఆ రకంగా చేయని సర్పంచ్‌లపై రాష్ట్ర ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకొనవచ్చు. గ్రామ సభ ఆ గ్రామ ప్రజలకు బహిరంగ చర్చలో పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తుంది. గ్రామ సభ సమావేశాలలో వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల లబ్ధీదారులను ఎంపిక చేయాలి. గ్రామ పంచాయితీలో తీసుకున్న నిర్ణయాలను గ్రామ సభ సమావేశంలో గ్రామ ప్రజలకు తెలియచేయాలి. గ్రామీణాభివృద్ధికి సంబంధించిన ప్రభుత్వ సిబ్బంది గ్రామ సభ సమావేశాలకు విధిగా హజరై, గ్రామస్తులు అడిగే ప్రశ్నలకు సమాధాన మివ్వాలి. దురదృష్టవశాత్తు గ్రామ సభల సమావేశాలు లాంఛన ప్రాయంగా మారాయి. వివిధ పథకాల లబ్ధిదారుల ఎంపిక విషయంలో గ్రామ సభ తీసుకున్న నిర్ణయం అంతిమ నిర్ణయం కావాలి. ఏ ఇతర వ్యక్తికి గాని, సంస్థకు గాని దీనిని మార్చే అధికారం ఉండరాదు. సమర్ధవంతంగా గ్రామ సభల సమావేశాలను నిర్వహిస్తున్న గ్రామ పంచాయితీలకు అర్థిక ప్రోత్సాహకాలనివ్వాలి.

### గ్రామ పంచాయితీల నిర్వహణలో మహిళలకు ప్రోత్సాహం

మన దేశ జనాభాలో సుమారు సగం మంది మహిళలు. వీరికి సాధికారత కల్పించాలనే సదుద్యేశంతో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయితీ సంస్థలలో 33 1/3 శాతం సీట్లను వీరికి కేటాయించడం ముదావహం. మన రాష్ట్రంలో ఉన్న పంచాయితీల్లో యాభై శాతం సీట్లను మహిళలకు కేటాయించడం హర్షణీయం. గ్రామ పంచాయితీలలో మహిళా సర్పంచులు, మహిళా సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండడం వలన గ్రామీణ ప్రాంతాలలో సకారాత్మక మార్పులు సంభవిస్తాయి. గ్రామాలలోని మహిళల సమస్యలపై వీరికి సరిఅయిన అవగాహన ఉంటుంది. ఇంటికి అవసరమైన త్రాగునీటిని అనేక కష్టాల కోర్చి చాలా దూరం నుండి మోసుకొచ్చేది మహిళలు. గ్రామాలలో మరుగు దొడ్లు లేకపోతే ఇబ్బందులు పడేది మహిళలు. ఈ సమస్యల పరిష్కారానికి గ్రామ పంచాయితీలలోని మహిళా సభ్యులు పరిష్కార మార్గాలను అన్వేషిస్తారు. కొన్ని సందర్భాలలో మహిళలు వ్యవహారజ్ఞానం, అనుభవం, ఇంటి పనులవల్ల తీరికలేని కారణంగా గ్రామ పంచాయితీల కార్యకలాపాలలో ఉత్సాహంగా పాల్గొనడం లేదు. వీరి తరపున వీరి కుటుంబంలోని సభ్యులు మహిళా ప్రతి నిధుల విధులను నిర్వహించడం దురదృష్టకరం. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే మహిళా సభ్యులకు వారి అధికారాలను, విధులను తెలియచేసే విధంగా శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి.

### రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫారసులను అమలు పరచాలి

గ్రామ పంచాయితీలు తమ నిధులను సక్రమంగా నిర్వహించడానికి వీలుగా రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన విధంగా నిధులు కేటాయించాలి. ఆసక్తి కరమైన అంశం ఏమిటంటే కేంద్ర ప్రభుత్వం తమకు అవసరానుగుణంగా ఆర్థిక సహకారాన్ని అందించడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయితీలకు తగినన్ని నిధులను కేటాయించడం లేదు. గ్రామ పంచాయితీలు సమర్ధవంతంగా గ్రామీణాభివృద్ధికి కృషి చేయాలంటే, రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయితీలకు రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫారసు గావించిన రీతిలో నిధులను కేటాయించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయితీలకు కేటాయించిన నిధులను సకాలంలో అందించాలి. ఈ నిధులను ఇతర శాఖలకు గాని, కార్యక్రమాలకు గాని మళ్ళించరాదు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న గ్రామ పంచాయితీలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించి, ఆదుకోవాలి.

గ్రామ పంచాయితీ సర్పంచులుగా, వార్డు సభ్యులుగా గెలిచినవారు మనసా, వాచా కర్మణా పార్టీలకు అతీతంగా ఆయా గ్రామాల అభివృద్ధికి కృషి చేసి మహాత్ముడు కలలు గన్న గ్రామ స్వరాజ్యానికి కృషి చేస్తారని ఆశిద్దాం.

**- డా॥ పి. మోహన్ రావు**

**హెడ్, ప్రభుత్వ పాలనా శాఖ, రైల్వే డిగ్రీ కళాశాల, సికింద్రాబాద్**

**వేదిక ఢిల్లీ. పంచాయతీరాజ్ సమావేశం జరుగుతోంది. విలక్షణ ప్రగతి సాధించిన వెయ్యిమంది సర్పంచులు కలిశారక్కడ. ఒక్కొక్కరే ప్రసంగిస్తున్నారు. సర్పంచ్ హిమాంశు పటేల్ వంతు వచ్చింది. అప్పటి వరకు అనాసక్తిగా వింటున్న వాళ్లంతా ఉత్సాహంగా మారిపోయారు. గుజరాత్‌లోని సబర్‌కాంత జిల్లాలో ఆరువేల జనాభాగల పంచాయితీ 'పున్సారి'. ఊర్లోకి అడుగుపెడుతూనే సకల సౌకర్యాల స్వర్గధామంలా అనిపిస్తుంది.**





ఆరులక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్ ద్వారా ఇంటింటికీ పుష్కలంగా మంచినీళ్లు సరఫరా అవుతున్నాయి. ఎవరింట్లో శుభకార్యం జరిగినా కేవలం వంద రూపాయలు తీసుకుని వాటర్‌ట్యాంక్‌ను పంపిస్తున్నారు పంచాయితీ అధికారులు. గ్రామంలో మురుగునీటి వ్యవస్థ అద్భుతం. ఎంత వర్షమొచ్చినా వీధులన్నీ చాలా శుభ్రంగా కనిపిస్తాయి.

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థతో సంబంధం లేకుండా పంచాయతీనే స్వయంగా బస్సును సమకూర్చుకుంది. రోజుకు ఆరేడు ట్రిప్పులు తిరుగుతుందీ బస్సు. ఇందులో ప్రయాణించే మహిళలకు మూడు రూపాయలే తీసుకుంటారు. విద్యార్థినులకైతే టికెట్టు ఉచితం. సొంత బస్సును ఏర్పాటు చేసుకోవడం వలన పాలక్యాన్లను పట్టణాలకు సులువుగా తీసుకెళ్లే వీలు కలుగుతోంది. దీనివల్ల పాడి పెంపకందారుల ఆదాయం ఇదివరకటి కంటే పెరిగింది.

# అసలు సిసలైన పంచాయితీ - పున్సారి!



ఇక విద్యుత్ సంగతికొస్తే కరెంటుకోత ఉన్నా సరే ఊరికి కరెంటు కొరత ఉండదు. దీనికి కారణం? సౌరవిద్యుత్తు. అన్ని వీధులకు చక్కటి లైట్లను ఏర్పాటు చేశారు. ఊర్లో చెత్త అనేదే కనిపించదు. నగరాల్లో లేని వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ ఇక్కడుంది. పన్నులు కట్టేందుకు పంచాయితీ కార్యాలయానికి వచ్చిన వాళ్లందరికీ ఒక డస్ట్‌బిన్‌ను ఉచితంగా ఇవ్వడం ఆనవాయితీ. ఇళ్లలో పోగైన చెత్తను డంప్‌యార్డ్‌కు తరలిస్తారు. రీసైకిల్ చేసి వృథాను అరికడుతున్నారు.



ఊళ్లో అయిదు ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ప్రతి పాఠశాలలో సీసీ టీవీ కెమెరాలను బిగించారు. వాటిని ప్రధానోపాధ్యాయుని గదితోపాటు, అన్ని వార్డుల్లోని టీవీలకు అనుసంధానించారు. వీధుల్లో అటూ ఇటూ తిరిగేటపుడు తల్లిదండ్రులు ఆ టీవీల్లో తమ పిల్లలను చూసుకుని మురిసిపోతుంటారు. అయ్యవారు రాకపోయినా వెంటనే తెలిసిపోతుంది. ఆ విషయాన్ని ఎవరో ఒకరు సర్పంచుకు తెలియజేస్తారు. కెమెరాల వల్ల బడి ఎగ్గొట్టే పిల్లల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. జీరో డ్రాపౌట్స్ రికార్డును సొంతం చేసుకున్నాయి ఈ పాఠశాలలు.



భద్రత విషయానికొస్తే, ఊరందరికీ గ్రూప్ ఇన్సూరెన్స్ ఉంది. "ఏడాదికి 6.5 లక్షల ప్రీమియం చెల్లిస్తాం. పాలసీదారుల్లో ఎవరైనా మరణిస్తే లక్షరూపాయలు, గాయపడితే పాతిక వేలు పరిహారం చెల్లిస్తుంది బీమా కంపెనీ. ఇది పల్లె ప్రజలకు భరోసాను ఇస్తోంది" అంటున్నారు సర్పంచు హిమాంశు పటేల్. మహిళల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు కూడా కృషి చేస్తున్నదీ పంచాయితీ. 'సఖిమండల్' అనే స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తోంది. ఇప్పటి వరకు సభ్యులంతా కలిసి 32 లక్షల రూపాయల సొమ్మును జమ చేయడం విశేషం. ఈ మొత్తాన్ని ఇంటి ఖర్చులకు, సరుకుల కొనుగోలుకు వాడుకుంటున్నట్లు సంఘ ప్రతినిధులు చెప్పారు.



సాంకేతికత విషయానికొస్తే, ఏ పట్టణానికీ తీసిపోదు ఈ పంచాయితీ. నాలుగేళ్ల కిందటే వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన తొలి గ్రామ పంచాయితీగా రికార్డుల్లోకి ఎక్కింది. ఈ మధ్యనే వీరందరికీ ఉచిత వైఫై ఇంటర్‌నెట్ కనెక్షన్‌నూ సమకూర్చారు. ఇది విద్యార్థులకు, నిరుద్యోగులకు ఎంతో ఉపయోగపడుతోంది. దీనికితోడు వాటర్‌ప్రూఫ్ స్పీకర్లను అమర్చారు. అందులో పొద్దున, సాయంత్రం భక్తిగీతాలు, భజన కీర్తనలను వినిపిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించే కొత్త సంక్షేమ పథకాలను స్పీకర్ల ద్వారా తెలియజేస్తారు.

"లోకల్ అప్‌డేట్స్ వల్ల ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. అభివృద్ధి మరింత వేగవంతం చేసేందుకు తోడ్పడుతోంది. ఒకవేళ నేను ఊర్లో లేకపోతే మొబైల్ నుంచే అనౌన్స్‌మెంట్లు ఇస్తుంటాను" అన్నారు సర్పంచు. 'పల్లెలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందినట్లు' అన్న బాపూజీ కలల్ని నిజం చేస్తున్న 'పున్సారి' పంచాయితీ దేశానికే ఆదర్శం. అందుకే పంచాయతీల కొచ్చే ప్రముఖ అవార్డులన్నీ దీనికొచ్చాయి.

*- టి. నర్మద*



Sthanika_Color_Oct13.indd 32 17/10/13 5:28 PM

# ఐక్యరాజ్య సమితి మహిళల గ్రామసభలతో వెల్లివిరిసిన చైతన్యం - సామాజిక దురాచారాలపై మహిళల సమరశంఖం





**ఇన్నాళ్ళూ మౌనంగా ఉన్న మహిళలు తమ సమస్యలపై చర్చించడానికి ముందుకు వస్తున్నారు. అపార్డు అందించిన శిక్షణా స్ఫూర్తి, పూర్వ కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి కలిగించిన ప్రేరణతో యు.ఎన్. ఉమెన్ కార్యక్రమం ద్వారా ఎంపికయిన మహిళా మోటివేటర్లు ప్రజలను ముఖ్యంగా మహిళలను చైతన్యవంతం చేసి గ్రామసభలకు హాజరయ్యేటట్లు చేశారు. కేవలం సభలకు హాజరవడమే కాకుండా మహిళలు తాము ఎదుర్కొనే సామాజిక సమస్యలను చర్చించడానికి గ్రామసభలను వేదికగా చేసుకున్నారు. తాము పొందిన చైతన్యంతో వార్డు, మహిళా, గ్రామసభలను వేదికగా చేసుకొని సామాజిక దురాచారాలపై సమరశంఖం పూరిస్తున్నారు విజయనగరం జిల్లాకు చెందిన మహిళలు.**

ఈ జిల్లా అధికారులైన పూర్వ, ప్రస్తుత కలెక్టర్లు, శ్రీ ఎం. వీరబ్రహ్మయ్య, ఐ.ఎ.ఎస్, శ్రీ కాంతిలాల్ దండే, ఐ.ఎ.ఎస్, జిల్లా ప్రజా పరిషత్తు ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీ ఎన్. మోహన్‌రావు తదితరులు అందించిన సహాయ సహకారాలతో వారు ముందడుగు వేస్తున్నారు. దీని కోసం మహిళల ప్రగతికి పది సూత్రాలను రూపొందించుకొని వాటి సాధన దిశగా పయనం సాగిస్తున్నారు.

ఆ పది సూత్రాలలో 1. ప్రాజెక్టు పరిధిలోని పంచాయతీలలో సర్పంచ్‌తో సహా మొత్తం పాలక వర్గం మహిళలే ఎన్నికయ్యేలా కృషి చేయడం 2. బాల్య వివాహాలను పూర్తి స్థాయిలో నిరోధించడానికి కృషి చేయడం 3. వరకట్న వేధింపుల నుండి మహిళలకు రక్షణ కల్పించడం 4. గృహ హింస బారిన పడిన మహిళలకు రక్షణ కల్పించడానికి ప్రాధాన్యత నివ్వడం 5. మద్యపానం సేవించడం వలన కలిగే అనర్థాలపై చర్చించి, నిరోధానికి కృషి చేయడం 6. భ్రూణ హత్యల నిరోధానికి ప్రయత్నించడం 7. మహిళల అపహరణ/మోసాల వంటి సంఘటనల నుండి కాపాడుకొనే విధంగా వారిని చైతన్యవంతం చేయడం 8. సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు కృషి చేయడం 9. సంపూర్ణ పారిశుధ్యం, 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి

వాటిని వినియోగించుకునే విధంగా కృషి చేయడం 10. సురక్షితమైన నీరు ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండే విధంగా ప్రయత్నించడం. ఈ ప్రగతి సూత్రాల సాధనలో మహిళలు ఆయా వార్డు, మహిళా, గ్రామసభలలో విస్తృతంగా చర్చకు తీసుకు రావడమే కాకుండా గ్రామాలలో మద్య నిషేధం, బాల్య వివాహాల నిరోధం, మోసగించబడిన మహిళలకు బాసటగా నిలవడం వంటి అంశాలలో కొంత ప్రగతిని సాధించారు. ఇంత కాలం తాము మాట్లాడడానికి అవకాశం లేకపోవడంతో తమ సమస్యలను చర్చించడానికి ఆస్కారం లేకపోయింది.

ఇటువంటి సమయంలో ఐక్యరాజ్య సమితి మహిళా ప్రాజెక్టు ద్వారా భారత దేశం మరియు దక్షిణాసియా దేశాలలోని మహిళా రాజకీయ నాయకత్వ లక్షణాల పెంపుదల కార్యక్రమం అమలు కొరకు మన రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలను ఎంపిక చేశారు. ప్రాజెక్టు జిల్లాలలో మహిళా ప్రజా ప్రతినిధుల సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు పరిపాలనలో స్వయం నిర్ణయాధికార శక్తిని పెంపొందింపజేయడం ప్రధాన ధ్యేయంగా ఈ కార్యక్రమం అమలవుతోంది. దీనిలో భాగంగా 73వ రాజ్యాంగ సవరణ ద్వారా చట్ట బద్ధత కల్పించిన గ్రామ సభలు, మహిళా సభలు, వార్డు సభల నిర్వహణకు ప్రాధాన్యం ఇచ్చారు. ముఖ్యంగా మహిళల సామాజిక సమస్యలకు ప్రాధాన్యం ఇచ్చారు.

2011 జూన్ నుండి అమలవుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా విజయనగరం జిల్లాలో 75 గ్రామాలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాలలో 75 మహిళా ప్రేరకులను (మోటివేటర్లు) ఎంపిక చేసి అపార్డులో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన అనంతరం వారు ప్రాజెక్టు ఉద్దేశ్యాలతో పాటు వార్డు, మహిళా, గ్రామ సభలను నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేశారు. ఇప్పటి వరకు 782 వార్డు సభలు, 75 మహిళా సభలు, 75 గ్రామ సభలు నిర్వహించారు. వార్డు సభలలో 28189 మంది, మహిళా సభలలో 6939 మంది, గ్రామ సభలలో 16843 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సభల్లో గ్రామాభివృద్ధికి సంబంధించిన అంశాలైన వీధి రోడ్లు, పారిశుధ్యం, త్రాగునీరు, విద్య, ఆరోగ్యం, సాగునీరు, ఉద్యాన పంటలు, కనీస వేతనాలు, గృహ నిర్మాణం, అట్టడుగు వర్గాల జీవనోపాధితో పాటు సామాజికాంశాలైన బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు, గృహ హింస నుండి మహిళలకు రక్షణ, మద్యపానం వలన అనర్థాలు, భ్రూణ హత్యలు, స్త్రీల అపహరణ/మోసాలకు గురికావడం వంటి అంశాలను చర్చించారు. 33 గ్రామాలలో నిర్వహించిన గ్రామసభల్లో త్రాగునీటి కోసం చర్చించగా, వాటిలో 19 గ్రామాలలో రూ. 69.65 లక్షల వ్యయంతో మంచినీటి పథకాలు నిర్మించి ఆ సమస్యను తీర్చారు. వీధిరోడ్లు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం కోసం 25 గ్రామాలలో చర్చించగా, 14 గ్రామాలలో 31.35 లక్షల నిధులతో రోడ్లను నిర్మించారు. వీధిలైట్లు,





విద్యుత్‌లైన్ల కోసం రెండు గ్రామాలలో చర్చించగా, రూ. 1.20 లక్షల వ్యయంతో విద్యుత్ సౌకర్యం కల్పించారు. అంగన్‌వాడీ భవనాల కోసం 11 గ్రామసభల్లో చర్చించగా 2 గ్రామాలలో భవనాల మంజూరునకు ప్రతిపాదనలు పంపారు. 54 గ్రామాలలో మద్య నిషేధం కొరకు చర్చించగా, కోరుకొండ, ధనాలపేట, టి. బూర్జవలస, మన్యపురిపేట, కోరుకొండపాలెం, వల్లూరు గ్రామాలలో మద్యనిషేధం విధించారు. ఇదే స్ఫూర్తితో పరిసర గ్రామాల ప్రజలు కూడా చైతన్యం పొంది ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. బాల్య వివాహాల గురించి 60 గ్రామాలలో చర్చించగా, బొప్పడాం, బాలగొడబ, ధనాలపేట, మన్యపురిపేట, దుప్పాడ తదితర గ్రామాలలో బాల్య వివాహాలను నిరోధించారు. గత ఏడాదిన్నర కాలంలో ఆయా గ్రామాల్లో ఒక్క బాల్య వివాహం కూడా జరగలేదు.

ఈ విధంగా మహిళలు గ్రామసభలను ఉపయోగించుకొని గ్రామాభివృద్ధితో పాటు, సామాజిక సమస్యల పరిష్కారంలో కూడా విజయం సాధిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో ఈ ప్రాజెక్టును కొనసాగించి వార్డు, మహిళా, గ్రామసభలను విజయవంతం చేస్తే, గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం తప్పని సరిగా సాకారం కావటంతో పాటు, మహిళా సాధికారత, స్వయం నిర్ణయాధికారం త్వరలోనే సాధించ గలుగుతామని మహిళలు ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

**- అవనాపు దేముడు,**

**జిల్లా శిక్షణ మేనేజరు, జిల్లా పరిషత్తు శిక్షణ విభాగం, విజయనగరం జిల్లా.**

Printed & Published by: Shasibhushankumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : Shasibhushankumar**